
సత్యమేవ జయతే

సాక్షి



WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50

జీవ వైవిధ్య సంరక్షణలో ఏపీ టాప్

- 14 వేలకు పైగా స్థానిక సంస్థల్లో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలు
- ప్రజా జీవవైవిధ్య రిజిస్టర్ల రూపకల్పన
- అతి తక్కువ కాలంలో వీటిని చేసిన రాష్ట్రంగా నిలిచిన ఏపీ
- ఇప్పటికే అన్ని పంచాయతీలు, జిల్లా పరిషత్‌లకు రూ.12 కోట్లు విడుదల



సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా జీవ వైవిధ్య పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ నడుం కట్టింది. గ్రామ స్థాయిలో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలు, అక్కడి ప్రత్యేకతలతో జీవ వైవిధ్య రిజిస్టర్లు రూపొందించి జీవ వైవిధ్య సంరక్షణకు పటిష్టమైన పునాదులు వేసింది. 2002లో జీవ వైవిధ్య చట్టం అమల్లోకి వచ్చినా.. రాష్ట్రంలో దాని అమలుకు సంబంధించిన నియమ నిబంధనలకు మాత్రం 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఆమోదం లభించింది. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో జీవ వైవిధ్య సంరక్షణకు ప్రాధాన్యత పెరిగి ఆ అంశంలో దేశంలోనే అగ్రగామిగా ఎదిగింది.

అన్ని గ్రామాల్లో యాజమాన్య కమిటీలు

జీవ వైవిధ్య చట్టం ప్రకారం రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల్లో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసి.. తద్వారా ప్రజా జీవ వైవిధ్య రిజిస్టర్లను రూపొందించాల్సి ఉంది. కానీ.. జీవ వైవిధ్య మండలి ఏర్పాటైన 13 సంవత్సరాల వరకు దాని గురించి ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. మిగిలిన రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ 2020 డిసెంబర్‌లోపు అన్ని స్థానిక సంస్థల్లోను వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో 2020 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవ వైవిధ్య మండలికి పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) స్థాయి అధికారిని సభ్య కార్యదర్శిగా నియమించడంతో మండలి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రతి మండలానికి ఒక స్వచ్ఛంద సేవా సంస్థను కో–ఆర్డినేటర్‌గా మండలి నియమించింది. రాష్ట్రంలో మొత్తం 14,157 స్థానిక సంస్థల్లో ఈ కమిటీలు ఏర్పాటు చేయగా.. వాటిలో 13,363 గ్రామ పంచాయతీ స్థాయివి కాగా 661 మండల పరిషత్, 13 జిల్లా పరిషత్ స్థాయి కమిటీలు ఉండటం విశేషం. ఆ తర్వాత రాష్ట్రంలోని ప్రధాన యూనివర్సిటీల్లో జీవ శాస్త్ర శాఖాధిపతులను సంప్రదించి జీవ వైవిధ్య రిజిస్టర్లను తయారు చేసే పనిలో పాల్గొనేలా చేసింది.

సమగ్ర కార్యాచరణ అమలు

జీవ వైవిధ్య కమిటీలు పని చేసేందుకు 15 అంశాలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తయారు చేశారు. గ్రామ వనాలు, మండల, జిల్లా స్థాయిలో జీవ వైవిధ్య ఉద్యాన వనాలు ఏర్పాటు, అంతరించే జాతుల నర్సరీలను పెంచడం, మొక్కలు నాటడం, చెరువులు, కుంటలను శుభ్రం చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం, స్కూళ్లు, కాలేజీలలో మొక్కలు నాటడం, మహిళా సంఘాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు, స్థానిక వైద్యులు, నాటు వైద్యులను గుర్తించి వారి వద్ద ఉన్న జ్ఞానాన్ని గ్రంథస్తం చేయడం వంటి పనులను ఈ కమిటీలు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా అన్ని స్థానిక సంస్థల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, క్రియాశీలక సభ్యులతో జాయింట్ బ్యాంక్ ఖాతాలను తెరిపించి వారికి మంజూరు చేసిన నిధులను బదిలీ చేశారు. ఇప్పటివరకు 10 వేల గ్రామ పంచాయతీలకు రూ.75 వేల చొప్పున మొదటి విడతగా రూ.12 కోట్లను బదిలీ చేశారు.

జీవ వైవిధ్య సంరక్షణలో ఓ మైలురాయి



అన్ని స్థానిక సంస్థల్లోనూ 15 సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న జీవ వైవిధ్య యాజమాన్యాల కమిటీలను అతి తక్కువ కాలంలో పూర్తి చేయడం జీవ వైవిధ్య సంరక్షణలో ఒక మైలు రాయి. ఇది దేశం మొత్తంలో మన రాష్ట్రానికి ఒక ప్రత్యేకతను, ఒక విశిష్టమైన గుర్తింపును తీసుకువచ్చింది. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో జీవవైవిధ్య సంరక్షణకు సంస్థాగత నిర్మాణం జరిగింది.

– దెందులూరి నళినీమోహన్, అటవీ శాఖ పూర్వ పీసీసీఎఫ్, జీవ వైవిధ్య మండలి రిటైర్డ్ సభ్య కార్యదర్శి





సీఐఎస్ఎఫ్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మహత్య

షార్‌లో విషాదం

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో సీఐఎస్ఎఫ్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. 24 గంటల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం కలకలం కలిగించింది. షార్ మొదటిగేటు వద్ద సీఐఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌సింగ్ (33) సోమవారం రాత్రి తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బిహార్‌కు చెందిన వికాస్‌సింగ్ సెలవు కావాలని కొద్దిరోజులుగా అడుగుతున్నారని, అందుకు పైఅధికారులు ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నారని సహచర సిబ్బంది చెబుతున్నారు. ఎస్ఐ కాల్చుకోవడాన్ని చూసిన సిబ్బంది శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా.. షార్‌లోని జీరోపాయింట్ రాడార్ సెంటర్‌కు సమీపంలోని అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని కానిస్టేబుల్ చింతామణి (29) ఆత్మహత్య చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్ జిల్లా శంకర విలేజ్ అండ్ తాలూకాకు చెందిన చింతామణి ఈ నెల 10న కానిస్టేబుల్‌గా ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. చింతామణి ఆత్మహత్య సమాచారం అందుకున్న సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ చిన్నకన్నన్ శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.





ఆత్మహత్య చేసుకున్న సీఐఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌సింగ్, కానిస్టేబుల్ చింతామణి

నడక నాలుగు విధాలుగా మేలు

అమెరికా సహా 42 దేశాలకు చెందిన 20,152 మంది డేటా విశ్లేషణ



సాక్షి, అమరావతి

నడక నాలుగు విధాలుగా మేలు... అని తరచూ వైద్యులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం కోసం 18 ఏళ్లు పైబడిన వారు వారానికి కనీసం 150 నిమిషాల మితమైన శారీరక శ్రమ లేదా వారానికి కనీసం 75 నిమిషాల తీవ్రమైన శారీరక శ్రమ చేయాలని డబ్ల్యూహెచ్‌వో కూడా సూచిస్తోంది. ముఖ్యంగా 60ఏళ్లు పైబడినవారు వాకింగ్, జాగింగ్ చేయడం వల్ల ప్రమాదకర రోగాల నుంచి రక్షణ పొందవచ్చని పలు అధ్యయనాలు స్పష్టంచేశాయి. తాజాగా ఇదే విషయం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాసాచుసెట్స్ పరిశోధకుల అధ్యయనంలోనూ వెల్లడైంది. 60 ఏళ్లు పైబడిన వారు రోజు 6వేల నుంచి 9వేల అడుగులు నడిస్తే గుండెకు మంచిదని నిర్ధారించింది. ఈ అధ్యయనంలో భాగంగా అమెరికా సహా 42 దేశాల్లో 18 ఏళ్లు పైబడిన 20,152 మంది డేటాను ఎనిమిది కోణాల్లో పరిశోధకులు విశ్లేషించారు. ఆరేళ్ల పాటు వీరు నడుస్తున్న దూరం, ఆయా వ్యక్తుల్లో కార్డియోవాస్కులర్ డిసీజ్ (సీవీడీ), నాన్ ఫాటల్ కరోనరీ హార్ట్ డిసీజ్, స్ట్రోక్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి అంశాలను బేరీజు వేశారు. ఈ నేపథ్యంలో 60 ఏళ్లు పైబడిన వారు రోజుకు 6వేల నుంచి 9వేల అడుగులు నడిస్తే గుండెపోటు ప్రమాదం నుంచి బయటపడవచ్చని గుర్తించారు. రోజుకు రెండు వేల అడుగులు మాత్రమే నడిచే వారితో పోలిస్తే వీరిలో గుండెపోటుతోపాటు పక్షవాతం ముప్పు 40 నుంచి 50 శాతం వరకు తగ్గుతుందని తేల్చారు. వృద్ధులకే కాదు అన్ని వయసులవారు నడక, వ్యాయామం, జాగింగ్, ఇతర శారీరకశ్రమ కార్యకలాపాలను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని స్పష్టంచేశారు. అయితే డబ్ల్యూహెచ్‌వో సూచించిన ప్రమాణాల మేరకు 41.3 శాతం మంది దేశంలో శారీరకశ్రమ చేయడం లేదని 2021లో ఒక సర్వేలో ఐసీఎంఆర్ తెలిపింది.

అన్ని వయసుల వారికి ఉత్తమం

నడక చక్కటి, సహజమైన వ్యాయామం వంటిది. రోజు వారి దినచర్యలో అన్ని వయసులవారు నడకను అలవాటుగా మార్చుకోవాలి. ప్రస్తుతం అన్ని వయసుల వారిలో శారీరక శ్రమ చేయడం చాలా వరకూ తగ్గిపోయింది. దీనికితోడు ఆహారపు అలవాట్లు కారణంగా చిన్న వయసులోనే ఊబకాయం, ఇతర జీవనశైలి జబ్బుల బారినపడుతున్నారు. వీటిని జయించి ఆరోగ్యంగా ఉండాలంటే నడక ఒక్కటే ఉత్తమ మార్గం. రోజు 30నిమిషాలు నడవడంవల్ల రక్తపోటు, ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు అదుపులోకి వస్తాయి. 45ఏళ్లు పైబడినవారు, మధుమేహం, ఇతర సమస్యలు ఉన్నవారు కొత్తగా నడక, వ్యాయామం ప్రారంభిస్తున్నట్లయితే ఒకసారి వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సలహా మేరకు వ్యాయామాలు చేయడం ప్రారంభించాలి. మధుమేహం సమస్య ఉన్నవారు ఇన్సులిన్ తీసుకుంటుంటారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నడక, వ్యాయామం కొనసాగించాలి.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, గుండె, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స నిపుణులు, కర్నూల్ జీజీహెచ్

అమెరికన్ కాలేజ్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్ ప్రకారం ఒక కి.మీ. దూరానికి ఎన్ని అడుగులు అంటే..

- సగటు నడక 1,408 అడుగులు
- చురుకైన నడక 1,209 అడుగులు
- జాగింగ్ 1,219
- పరుగు 1,045

రోజు నడకతో ప్రయోజనాలు...

రక్తప్రసరణ పెరుగుతుంది. రక్తంలోని మలినాలు బయటకు పోతాయి.	శరీర బరువు, రక్తంలో గ్లూకోజ్ స్థాయి తగ్గుతాయి.	మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరిగి, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది.
మధుమేహం, రక్తపోటు, ఇతర జీవనశైలి జబ్బులను అదుపులో ఉంటాయి.		
మానసిక కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి.		

ఆత్మ విశ్వాసం, శారీరక సామర్థ్యం పుంజుకుంటాయి.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 296

మంగళవారం 17-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్ 'తీన్‌మార్'..

శ్రీలంకతో వన్డే సిరీస్‌ను భారత్ భారీ విజయంతో ముగించింది. చివరి వన్డేలో టీమిండియా 317 పరుగుల తేడాతో లంకను చిత్తుగా ఓడించింది. పరుగుల పరంగా వన్డే క్రికెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద విజయం. విరాట్ కోహ్లి, శుభ్‌మాన్ గిల్ సెంచరీలతో చెలరేగగా.. సిరాజ్ 4 వికెట్లు తీసి సత్తా చాటాడు.

10లో



కొలీజియంలో ప్రభుత్వ నామినీలు

సుప్రీం కొలీజియంలో ప్రభుత్వం నామినేట్ చేసే వారిని కూడా నియమించాలని సీజేఐకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు లేఖ రాశారు.

వివరాలు 6లో ▸



అమెరికాలో మళ్లీ కాల్పులు

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని గోషెన్‌లో జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు మరణించారు.

వివరాలు 6లో ▸



రష్యా క్షిపణి దాడి

ఉక్రెయిన్ దేశంలోని డ్నీప్రో నగరంలో ఓ అపార్టుమెంట్‌పై రష్యా జరిపిన క్షిపణి దాడిలో 40 మంది మృతి చెందారు.

వివరాలు 6లో ▸



ఆర్‌వీఎంలను అంగీకరించం


రిమోట్ ఓటింగ్ మెషీన్లను అందుబాటులోకి తేవాలన్న ఎన్నికల సంఘం ప్రతిపాదనను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి.

వివరాలు 6లో ▸

సాటిలేని 'ఉప'కారం

ఎస్సీ సబ్‌ప్లాన్‌పై కేంద్ర గణాంకాల్లో ఆంధ్రప్రదేశ్‌కు అగ్రస్థానం

- మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో సాయం అందలేదు
- ఏపీలో 3.28 లక్షల పట్టణ పేద కుటుంబాలకు సాయం
- వంద శాతం పని చేస్తున్న అంగన్‌వాడీలు, ఐసీడీఎస్‌లు
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: అత్యంత సమర్థంగా ఎస్సీ ఉప ప్రణాళికను అమలు చేస్తూ ఆయా కుటుంబాలకు సాయం అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప ప్రణాళికను ఈ ఆర్థిక ఏడాది తొలి ఆరు నెలల్లోనే అమలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. 2022–23 రెండో త్రైమాసికం వరకు (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పథకాల అమలు పురోగతిపై రూపొందించిన నివేదికను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ ఈ నెల 11వ తేదీన విడుదల చేసింది. ఉపప్రణాళిక ద్వారా చిత్తశుద్ధితో ఎస్సీ కుటుంబాలకు సాయం అందించడం, ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరుతో పాటు పట్టణ పేదలకు సాయం, వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్ల జారీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా మంచి పనితీరు కనపరిచిందని కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రశంసించింది.

- నిర్దేశిత లక్ష్యాల్లో 90 శాతానికిపైగా అమలు చేసిన రాష్ట్రాలను చాలా మంచి పనితీరు కనపరిచినట్లు పరిగణించారు. 80 నుంచి 90 శాతం మేర అమలు చేసిన రాష్ట్రాలను మంచి పనితీరు కనపరిచిన జాబితాలో చేర్చారు. 80 శాతం లోపు అమలు చేసిన రాష్ట్రాలను పనితీరు బాగోలేని వాటిగా నివేదిక వర్గీకరించింది.
- ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని 22 రాష్ట్రాల్లో మొత్తం 29.84 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం అందించగా అందులో 29.10 లక్షల ఎస్సీ కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్‌లో సహాయం అందినట్లు నివేదిక వెల్లడించింది. మిగతా మరే రాష్ట్రం కూడా లక్ష

మిగతా 2వ పేజీలో ▶

2022 -23లో ఎస్సీ ఉప ప్రణాళిక అమలు (ఏప్రిల్ - సెప్టెంబర్ వరకు)

రాష్ట్రం పేరు	సాయం పొందిన ఎస్సీ కుటుంబాలు
ఆంధ్రప్రదేశ్	29,10,944
కర్ణాటక	22,884
తెలంగాణ	17,235
తమిళనాడు	10,121
ఛత్తీస్‌గఢ్	1,377
గుజరాత్	108
మహారాష్ట్ర	0
కేరళ	0

న్యూస్‌రీల్

లాభాలతో మొదలై నష్టాల్లోకి



స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. తొలుత లాభాలతో మొదలైన మార్కెట్లు.. ఆ తర్వాత నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ 168 పాయింట్లు క్షీణించి 60,093 వద్దకు చేరగా.. నిఫ్టీ 62 పాయింట్ల నష్టంతో 17,895 వద్ద ముగిసింది.

వివరాలు 11 ▸

వందే భారత్ రైలు ప్రారంభం



సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ రైలును ప్రధాని మోదీ సంక్రాంతి పండుగ రోజున లాంఛనంగా ప్రారంభించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నవ భారత సామర్థ్యానికి చిహ్నమని.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇది గొప్ప కానుక అని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 8 ▸

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

మొత్తం 72 మంది దుర్మరణం!

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 72 మంది ప్రయాణికులతో కఠ్మాండు నుంచి పర్యాటక ప్రాంతమైన పొఖారా బయల్దేరిన యతి ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండ్ అవ్వడానికి ముందు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అందరూ మరణించినట్టు భావిస్తున్నారు. మృతుల్లో ఐదుగురు భారతీయులున్నారు.

6లో



ఘటనా స్థలంలో పడి ఉన్న విమాన శకలం

విశ్వ సుందరి ఆర్.బోనీ గాబ్రియెల్



విశ్వసుందరి కిరీటం అమెరికా అందగత్తె ఆర్.బోనీ గాబ్రియెల్‌కు దక్కింది. వెనెజువెలా, డొమినికన్ రిపబ్లిక్ భామలు రన్నరప్స్‌గా నిలిచారు. అమెరికాలో జరిగిన కార్యక్రమంలో 2021 మిస్ యూనివర్స్ హర్నాజ్ సంధూ.. 2022 విశ్వసుందరి బోనీ గాబ్రియెల్‌కు కిరీటధారణ చేశారు. భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన మంగళూరు సుందరి దివితా రాయ్ టాప్-16లో స్థానం దక్కించుకున్నారు.

- వివరాలు 6లో

ప్రభుత్వ స్కూళ్ల డిజిటల్ బాట

- తొలి విడతలో 6,511 స్కూళ్లు డిజిటల్ విధానంలోకి..
- అత్యున్నత స్థాయి బోధనకు వీలుగా వీటిలో అన్ని ఏర్పాట్లు
- 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లతో పాఠాలు
- రూ.302 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- 13,301 నాడు–నేడు స్కూళ్లలో రూ.60 కోట్లతో స్మార్ట్ టీవీలు
- 6–10 తరగతులకు డిజిటల్ కంటెంట్ ఇప్పటికే సిద్ధం
- సీబీఎస్‌ఈ బోధనకు వీలుగా ఈ–కంటెంట్



2లో

రైతులకు మరో రూ.1,467 కోట్లు చెల్లింపు

- ఇప్పటివరకు 4.73 లక్షల మంది రైతుల నుంచి 26.08 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- 90శాతం మంది రైతులకు రూ.4,779.85 కోట్లు జమ

- వివరాలు 5లో



1 శాతం మంది గుప్పిట్లో..

40 శాతం దేశ సంపద!

ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడి

- దేశం మొత్తం సంపదలో 40 శాతానికి పైగా కేవలం 1 శాతం సంపన్నుల చేతుల్లోనే పోగుపడిందట! మరోవైపు, ఏకంగా సగం మంది జనాభా దగ్గరున్నదంతా కలిపినా మొత్తం సంపదలో మూడోవంతు కూడా లేదు. ఈ విషయాన్ని ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ అనే హక్కుల సంఘం వార్షిక అసమానతల నివేదికలో వెల్లడించింది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...


బీఎస్సీ అగ్రికల్చర్ సీట్ల భర్తీకి ఆఖరి దశ కౌన్సెలింగ్



గుంటూరురూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేటెడ్ కళాశాలల్లో మిగిలిన బీఎస్సీ అగ్రికల్చర్ సీట్ల భర్తీకి ఆఖరి దశ మాప్ అప్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రామారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంసెట్ 2022 ద్వారా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు 18వ తేదీన, ఏపీ అగ్రిసెట్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు 19వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గుంటూరు నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ జరుగనుంది. విద్యార్థులు వ్యవసాయ విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా విద్యుత్తు బస్సులు

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్టీసీలలో వినియోగం
- రూ. వెయ్యి కోట్లతో 50 వేల బస్సులు
- సబ్సిడీతో రోడ్డు రవాణా సంస్థలకు సరఫరా
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం



సాక్షి, అమరావతి: కాలుష్య నియంత్రణలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యుత్తు బస్సులు (ఇ బస్సులను) ప్రవేశపెట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, భారీ పరిశ్రమల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ల్లో వీటిని ప్రవేశపెట్టనుంది. కాలుష్యం వెదజల్లుతున్న డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా విద్యుత్తు గతిశక్తి ప్రాజెక్టు కింద దశలవారీగా ఇ-బస్సులను ప్రవేశపెట్టే ప్రణాళికను ఆమోదించింది. ప్రస్తుతం దేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్టీసీలు 1,49,095 బస్సులు వినియోగిస్తున్నాయి. వాటిలో 1,33,770 డీజిల్ బస్సులే. వాటి స్థానంలో కేంద్ర ఇ-బస్ ప్రోగ్రాం అనే పేరుతో ఇ-బస్సులను ప్రవేశపెడతారు. మొదటి దశలో ఏకంగా రూ.వెయ్యి కోట్లతో 50 వేల బస్సులు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదనలు రూపొందించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్టీసీలకు సబ్సిడీ మీద వీటిని అందిస్తారు. ఇ-బస్సులను కొనే బాధ్యతను కేంద్ర ఇంధన శాఖకు చెందిన 'కన్వర్జెన్స్ ఆఫ్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్)'కు అప్పగించారు. మొదటి దశను 2024 డిసెంబర్‌నాటికి పూర్తి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ బస్సుల చార్జింగ్ కోసం రాష్ట్రాల విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)లతో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఆర్టీసీ ప్రధాన బస్ స్టేషన్లతోపాటు ప్రతి 50 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారు.

మొదలైన మైలేర్ల సందడి

- సరిహద్దు రాష్ట్రాల్లో భలే ఫేమస్
- మొదటి బహుమతిగా లారీలు, కార్లు
- పోటీలకు ఎద్దులను సిద్ధంచేస్తున్న నిర్వాహకులు
- పోటీలో గెలిచిన ఎద్దు ధర రూ.లక్షల్లోనే
- కనుమ నుంచి మూడు నెలలు ఇదే సందడి



పలమనేరు ప్రాంతంలో నిర్వహించే మైలేరు (ఫైల్)

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పలమనేరు, కుప్పం ప్రాంతాలతోపాటు పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మైలేర్ల (ఎద్దుల పరుగు పందేల) సందడి మొదలైంది. సంక్రాంతంటే ఈ మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు గుర్తొచ్చేది మైలేర్లే. కనుమ పండుగ నుంచి ఏప్రిల్ వరకు మైలేర్లు జరుగుతాయి. ఈప్రాంతంలో జరిగే మైలేరు పండుగల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేల నుంచి లక్ష దాకా ఉండేది. అదే తమిళనాడులో అయితే లారీలు, కార్లు మొదటి బహుమతిగా అందజేస్తున్నారు. మైలేరు అనే తమిళ పదానికి ఎద్దుల పరుగుపందెం అని అర్థం. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతంలో మైలేర్లు నిర్వహించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. పలువురు తమ ఎద్లను ఈ పందేలకు సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీలో పాల్గొనే ఎద్దును సంరక్షిస్తున్న రైతును గౌరవంగా చూస్తారు. ఇక ఈ పోటీలో తమ గ్రామం ఎద్దు గెలిచిందంటే.. ఆ వూరి వారి ఉత్సాహాన్ని వర్ణించలేం. గెలిచిన ఎద్దుకు గ్రామంలో మెరవణి (ఊరేగింపు) ఉంటుంది.

పండగెద్దులా మజాకా



పండుగ నెల మొదలైనప్పటి నుంచి ఎద్దుకు మంచి మేత పెడతారు. వాటి కొమ్ములను జువ్వుతారు. ఎద్దు కొమ్ములు ఎంత బాగుంటే అంత క్రేజ్. ఇలా సిద్ధం చేసిన ఎద్లను బాగా అలంకరించి పరుగుపందేలకు తీసుకెళతారు. కొమ్ములకు రంగులు వేసి ప్రభలతో అలంకరించి బెలూన్లు కడతారు. పోటీల్లో ఎద్దుపై యువకులు దెబ్బవేసేందుకు ప్రయత్నిస్తారు కాబట్టి దానికి రక్షణగా బ్లేడులు కట్టిన పరదాలను అమరుస్తారు. కాళ్లకు గజ్జెలు కట్టి, గిట్టలకు పసుపు రాసి పూజ చేస్తారు. ఈ ప్రాంతంలో 500 వరకు ఎద్లను ఈ పందేలకు సిద్ధం చేస్తున్నారు.

పందెం ఎద్దు ధర రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షలు



పోటీలు జరిగేచోట కిక్కిరిసిన జనం మధ్య అల్లిని (నిర్ణీత ప్రదేశాన్ని) ముందుగా ఎద్దుకు చూపెడతారు. అనంతరం ఆ ఎద్దును మూడుసార్లు పరిగెత్తిస్తారు. ఈ మూడుసార్లలో సరాసరి తక్కువ సెకన్లలో గమ్యం చేరిన ఎద్దు విజేతగా నిలుస్తుంది. ఒక్కో మైలేరులో 500 నుంచి వెయ్యి వరకు ఎద్దులు పాల్గొంటాయి. ఒక్కో ఎద్దుకు ప్రవేశ రుసుము రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఉంది. మైలేరులో గెలుపొందిన ఎద్దు ధర అమాంతం పెరుగుతుంది. వీటిని లక్షలు పెట్టి కొనేందుకు పలువురు ముందుకొస్తారు. పలమనేరు ప్రాంతంలో మైలేరు విజేత ధర రూ.2 లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఉంది.

మైలేర్లకు పేరొందిన ఊళ్లు..

ఈ ప్రాంతంలో మైలేరు పండుగను గొప్పగా జరుపుకొనే ఊళ్లు చాలా ఉన్నాయి. బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, మండిపేట కోటూరు, చెత్తపెంట, కాబ్బల్లి, కెంచనబల్ల, రామకుప్పం, మిట్టూరు, శాంతిపురం, కెనమాకులపల్లె, మల్లానూరు, నాయినూరు, గొల్లచీమనపల్లె తదితర గ్రామాల్లో మైలేర్లు నిర్వహిస్తారు. సరిహద్దులోని తమిళనాడులో బొరుగూర్, పర్నూరు (ఇక్కడ మొదటి బహుమతి లారీ, బుల్లెట్) గుడియాత్తం, ఆంబూరు, నాట్రాంపల్లె, పేర్నంబట్, పల్లికొండ, వేలూరు, క్రిష్ణగిరి, సేలం, ధర్మపురి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తారు. కర్ణాటకలోని దూలపల్లెలో ఈ పోటీ పెద్ద ఎత్తున జరుగుతుంది. దూలపల్లెలో పోటీలను తిలకించేందుకు ఆ రాష్ట్ర మంత్రులు కూడా హాజరవుతుంటారు.

కడియం మొక్కలకు ఎగుమతుల గుబాళింపు

ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం



- రాయితీలతో నర్సరీ రైతులకు ప్రోత్సాహం
- ఏటా రూ.5.50 కోట్ల విలువైన మొక్కల ఎగుమతి
- మూడేళ్లలో రూ.7.40 కోట్ల విలువైన ఎగుమతులే లక్ష్యం
- స్కిల్ హబ్స్‌లో ప్రత్యేక కోర్సులు

సాక్షి, అమరావతి: అందమైన పూల మొక్కలు, అలకరణ మొక్కలకు ప్రసిద్ధి పొందిన కడియం నర్సరీ రంగం అంతర్జాతీయంగా ఎగుమతి అవకాశాలను మరింతగా అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ప్రస్తుతం కడియం నుంచి ఏడు దేశాలకు ఏటా రూ.5.50 కోట్ల విలువైన మొక్కలు ఎగుమతి అవుతున్నాయి. వచ్చే మూడేళ్లలో ఈ మొత్తాన్ని రూ.7.40 కోట్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం తూర్పు గోదావరి జిల్లా ఎగుమతుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు మొక్కలను ఎగుమతి చేస్తూ రూ.కోట్ల వ్యాపారం చేస్తున్న కడియం నర్సరీ రైతులు సరైన అవగాహన లేక అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎగుమతి అవకాశాలు ఉన్న దేశాలకు మొక్కలు పంపేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం స్వాట్ ఎనాలసిస్ (స్ట్రెంగ్త్, వీక్‌నెస్, ఆపర్చునిటీస్, త్రెట్) చేసి దానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎగుమతులు) జీఎస్ రావు వెల్లడించారు.



రైతులకు ప్రోత్సాహకాలు

ఒమన్, కువైట్, బెహ్రాయిన్, మాల్దీవులు, ఖతార్, టర్కీ, అరబ్ దేశాలకు కడియం నుంచి మొక్కలు ఎగుమతు అవుతున్నాయి. ఆయా దేశాల్లోని మార్కెట్ అవసరాలపై కడియం నర్సరీ రైతులకు పెద్దగా అవగాహన లేదు. ఈ కారణంగా ఎగుమతులకు అవకాశాలు ఉన్నా.. వాటిని అందిపుచ్చుకోవడంలో రైతులు వెనకబడుతున్నారు. ఈ దేశాలతోపాటు ఇతర దేశాల మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవడంతోపాటు తక్కువ వ్యయంతో మొక్కలను ఉత్పత్తి చేసే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే విధంగా ప్రోత్సహించనున్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ పథకాల ప్రయోజనాలను రైతులకు వివరించడంతో పాటు 2022-27 రాష్ట్ర ఎగుమతి ప్రోత్సాహక విధానం కింద పలు ప్రోత్సాహకాలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. విదేశీ ప్రదర్శనల్లో పాల్గొనే నర్సరీ రైతులకు 30 శాతం అద్దె రాయితీ, ఎగుమతుల్లో కీలకమైన జెడ్ఈడీ సర్టిఫికెట్ పొందడంలో 10 శాతం రాయితీతో పాటు ఎగుమతి నాణ్యతకు సంబంధించిన ధ్రువపత్రాలు పొందడానికి అయ్యే వ్యయాల్లో 50 శాతం రాయితీలను ఇవ్వాలని నిర్ణయించింది. అంతేకాకుండా నర్సరీ రైతులకు నైపుణ్యం కల్పించేందుకు స్కిల్ హబ్స్‌లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం కడియం నుంచి 15 మంది రైతులకు ఎగుమతి లైసెన్స్‌లు ఉండగా.. నాణ్యత, సర్టిఫికేషన్ వంటి అంశాలపై పెద్దగా అవగాహన లేకపోవడంతో అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. వీరికీ జిల్లా ఎక్స్‌పోర్ట్ హబ్ ద్వారా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

ఆన్‌లైన్ చదువుల 'యోగ'ం

- 'స్వయం' వేదికగా ఆన్‌లైన్ కోర్సులు
- రెగ్యులర్ కోర్సుల మాదిరిగానే క్రెడిట్ల కేటాయింపు
- 12 ప్రాంతీయ భాషల్లో యోగా పాఠ్యాంశాలు
- ఆన్‌లైన్ పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్న ఏఐసీటీఈ
- ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి..



సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మంజూరు, పర్యవేక్షణ, నియంత్రణ సంస్థ అయిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) తాజాగా భారతీయ ప్రాచీన విద్య అయిన యోగాపై కూడా దృష్టి సారించింది. ఇందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో యోగాను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ చర్యలతో యోగాకు అంతర్జాతీయంగా ఇప్పటికే ఎంతో గుర్తింపు వచ్చిన నేపథ్యంలో దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేలా ఏఐసీటీఈ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రొఫెషనల్ కోర్సులకు శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ వేదికగా ఈ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తోంది. కేంద్రం ఏర్పాటు చేసిన 'స్వయం' పోర్టల్ ద్వారా ఈ ఆన్‌లైన్ కోర్సును ప్రవేశపెట్టింది. ఈ కోర్సును అభ్యసించే వారికి క్రెడిట్లను కూడా అందించనుంది. వీటి ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో అదనపు ప్రయోజనాలు చేకూరనున్నాయి.

ఈ అంశాల్లోనూ క్రెడిట్ కోర్సులు..

యోగాతోపాటు విద్యార్థులకు ఉపయోగపడేలా మేధో హక్కులు, బేసిక్ రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ వంటి అంశాల్లో కూడా క్రెడిట్ కోర్సులను ప్రారంభించింది. కేంద్ర ఆవిష్కరణల విద్యా విభాగం, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), వివేకానంద యోగా అనుసంధాన సంస్థలు ఈ కోర్సులకు రూపకల్పన చేశాయి. యోగాను ప్రొఫెషనల్‌గా నిర్వహించే వారికి ఈ సర్టిఫికెట్ కోర్సుల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. రిమోట్ సెన్సింగ్, భూ పరిశీలన సెన్సార్స్, థర్మల్ రిమోట్ సెన్సింగ్, స్పెక్ట్రల్ సిగ్నేచర్స్, హైపర్ స్పెక్ట్రల్ రిమోట్ సెన్సింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు ఈ కోర్సుల ద్వారా పరిజ్ఞానం అలవడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఆ సర్టిఫికెట్ల ద్వారా వారికి అదనపు ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన పాఠ్యాంశాలను 12 ప్రాంతీయ భాషల్లోనూ ఏఐసీటీఈ అనువాదం చేయిస్తోంది. అంతేకాకుండా ఆయా మాధ్యమాల్లోనూ ఈ కోర్సులను అందుబాటులోకి తెస్తోంది.

ఇప్పటికే తెలుగులో ఇంజనీరింగ్ పుస్తకాలు..

కాగా 12 ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ కోర్సులను అందించేలా ఇప్పటికే ఆయా సంస్థలకు ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేస్తోంది. ఆయా భాషలకు విద్యార్థుల డిమాండ్‌ను అనుసరించి.. ప్రాధాన్యత క్రమంలో వీటిని అందుబాటులోకి తెస్తోంది. ఈ క్రమంలో 218 సబ్జెక్టుల్లోని పాఠ్యాంశాల అనువాదాన్ని ఏఐసీటీఈ చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే తెలుగు, కన్నడం, ఒడియా, గుజరాతీ, మరాఠీ తదితర భాషల్లో ఇంజనీరింగ్ పుస్తకాలను విడుదల చేసింది. విద్యార్థులు తమ మాతృభాషల్లో ఆయా భావనలను అర్థం చేసుకుంటే.. వారు వాటిని బాగా గుర్తుంచుకుని అన్వయించే అవకాశముంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు చాలామంది విద్యార్థులకు సమాధానం తెలిసినప్పటికీ.. ఇంగ్లిష్ పరిజ్ఞానం లేకపోవడం వల్ల పరీక్షలు రాయలేకపోయేవారని అంటున్నారు. ప్రాంతీయ భాషా పాఠ్యపుస్తకాల వల్ల వారికి ఈ ఇబ్బంది తొలగుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఆరో విడతలో 4.90 లక్షల మందికి

'జగనన్న తోడు'

- నేటి నుంచి 21 వరకు లబ్ధిదారులతో బ్యాంకర్ల సమావేశాలు
- కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ ఆదేశాలు
- చిరు వ్యాపారులకు వడ్డీ లేకుండా రూ. 10 వేలు రుణం
- సకాలంలో రుణాలు చెల్లించిన వారితో పాటు కొత్తవారికీ అవకాశం



సాక్షి, అమరావతి: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే 4,90,376 మందికి జగనన్న తోడు పథకం ద్వారా ఆరో విడతలో మళ్లీ రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు బుధవారం నుంచి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల, మునిసిపాలిటీల వారీగా బ్యాంకర్లు, లబ్ధిదారుల సమావేశాలు నిర్వహించనుంది. 25న జిల్లాల స్థాయిలో డీసీసీల సమావేశాలు నిర్వహించి బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాల పంపిణీ కార్యక్రమాలను సమీక్షించనున్నారు. దీనికి సంబంధించి గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ షాన్‌మోహన్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ పీడీల ఆధ్వర్యంలోనూ, మునిసిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,28,402 మందికి, పట్టణ ప్రాంతాల్లో 1,61,974 మందికి కలిపి మొత్తం ఈ విడతలో 4,90,376 మందికి ప్రభుత్వం రుణాలు ఇప్పిస్తోంది. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునేవారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపల్లో వస్తువులు అమ్మేవారు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు, ఆటోలపై సరుకులు పెట్టుకుని వ్యాపారం చేసే వారితో పాటు చేనేతలు, సంప్రదాయ చేతివృత్తిదారులకు ఎలాంటి ష్యూరిటీ అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సున్నావడ్డీకే జగనన్న తోడు పథకం ద్వారా రూ. 10 వేలు చొప్పున బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తుంది. ఇప్పటికే ఐదు విడతల్లో లబ్ధిదారులకు రుణాలు తీసుకోగా.. ఆరో విడత రుణ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ఈ నెల 11న లాంఛనంగా ఈ కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే. చిరు వ్యాపారులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి గత 6 నెలలకు వడ్డీ రూ. 15.17 కోట్ల మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం అదేరోజు జమ చేసింది. రుణాలు సకాలంలో చెల్లించిన వారికి బ్యాంకులు రుణ మొత్తాన్ని పెంచి మళ్లీ రుణాలిచ్చేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

సాటిలేని 'ఉప'కారం

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయలేదని నివేదిక పేర్కొంది. మిగతా రాష్ట్రాలు కేవలం వేల సంఖ్యలో మాత్రమే సాయానికి పరిమితమయ్యాయి. కర్నాటకలో 22,884 మంది ఎస్సీ కుటుంబాలకు ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా సాయం అందించగా మిగతా రాష్ట్రాలు అంతకంటే తక్కువ సంఖ్యకే పరిమితమయ్యాయి.

- ఈ ఆర్థిక ఏడాది తొలి ఆర్నెల్లలో దేశవ్యాప్తంగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 11,80,746 మంది ఎస్సీ విద్యార్థులు సాయం పొందగా అందులో ఆంధ్రప్రదేశ్‌లోనే 6.15 లక్షల మంది ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందుకోవడం గమనార్హం.

పేదలకు సాయం.. ఇళ్లు..
లక్ష్యానికి మించి వ్యవసాయ కనెక్షన్లు...

- దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి పట్టణ ప్రాంతాల్లోని 3.47 లక్షల పేద కుటుంబాలకు సహాయం అందించగా ఆంధ్రప్రదేశ్‌లోనే 3.28 లక్షల పట్టణ పేద కుటుంబాలకు సాయం అందినట్లు నివేదిక వెల్లడించింది.
- పట్టణ ప్రాంతాల్లో 24 రాష్ట్రాల్లో ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ కింద 3.29 లక్షల గృహాలను నిర్మించగా ఒక్క ఆంధ్రప్రదేశ్ 1,38,245 ఇళ్ల నిర్మాణంతో అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఆ తరువాత బిహార్ 99,718 గృహాలను నిర్మించింది. మిగతా రాష్ట్రాలు స్వల్ప సంఖ్యకే పరిమితమయ్యాయి.
- వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో ఏపీ చాలా మంచి పనితీరు కనపరిచినట్లు నివేదిక తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 24,852 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా తొలి ఆర్నెల్లలోనే లక్ష్యానికి మించి ఏకంగా 46,856 విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం గమనార్హం.
- ఏపీలో అంగన్‌వాడీలు, ఐసీడీఎస్‌లు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీలతో పాటు 257 ఐసీడీఎస్‌లు నూటికి నూరు శాతం పని చేస్తున్నట్లు పేర్కొంది.



ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు



రాష్ట్రం	ఎస్సీ విద్యార్థులు		
ఆంధ్రప్రదేశ్	6,15,504	మహారాష్ట్ర	35,235
పంజాబ్	1,94,122	ఛత్తీస్‌గఢ్	18,212
రాజస్థాన్	1,90,706	హరియాణ	14,048
తెలంగాణ	94,031	తమిళనాడు	0
		గుజరాత్	0

ప్రభుత్వ స్కూళ్ల డిజిటల్ బాట



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఇప్పటికే అనేక విప్లవాత్మక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తోంది. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు సైతం భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు అందుకునేలా డిజిటల్ విద్యను వారికి చేరువ చేస్తోంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులను అన్ని విషయాల్లో మేటిగా తీర్చిదిద్దుతోంది. ఈ క్రమంలో దశల వారీగా ఫౌండేషనల్ స్థాయి నుంచి ఇంటర్ స్థాయి అయిన హైస్కూల్ ప్లస్ స్కూళ్ల వరకు డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే అత్యున్నత ప్రమాణాలు ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సీబీఎస్ఈ బోధనకు అనుగుణంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) డిజిటల్ కంటెంట్‌ను ఇప్పటికే సిద్ధం చేసింది.

ముందుగా మనబడి నాడు-నేడు మొదటి దశ స్కూళ్లలో..

డిజిటల్ తరగతులను ముందుగా మనబడి: నాడు-నేడు కింద తొలిదశ పనులు పూర్తయిన స్కూళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి డిజిటల్ విద్యా బోధన చేస్తారు. విద్యాశాఖ అంచనాల ప్రకారం.. దశలవారీగా 45,328 స్కూళ్లలో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా వచ్చే జూన్ నాటికి 6,511 స్కూళ్లలో ఆయా ఆధునిక సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ స్కూళ్లలోని డిజిటల్ తరగతి గదులలో 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు అమరుస్తారు. ఇందుకోసం రూ.302.13 కోట్ల మేర ప్రభుత్వం వెచ్చించనుంది. కాగా, 13,301 నాడు-నేడు తొలివిడత స్కూళ్లలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా 65 ఇంచులతో ఉండే 10,038 స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తెస్తారు.

ప్రభుత్వ టీచర్లకు శిక్షణ

డిజిటల్ పరికరాల ద్వారా విద్యా బోధన, ఉపకరణాల వినియోగంపై పలువురు ప్రభుత్వ టీచర్లకు ఇప్పటికే అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో డిజిటల్ పరికరాలను సక్రమంగా వినియోగించడంలో 30 శాతం మంది పూర్తిస్థాయిలో విజయవంతమయ్యారు. 20 శాతం మందికి మరికొంత శిక్షణ అవసరమని గుర్తించారు. మిగతా వారందరికీ కూడా శిక్షణ అందించనున్నారు.

మూడు దశల్లో అన్ని స్కూళ్లు..

మొత్తం మూడు దశల్లో అన్ని ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయనున్నారు. తొలి దశ స్కూళ్లలో డిజిటల్ తరగతి గదుల ఏర్పాటును మార్చి, ఏప్రిల్ నాటికి పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులోకి తేనున్నారు. డిజిటల్ తరగతులకు అనుగుణంగా ఆయా స్కూళ్లకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. బ్రాడ్ బ్యాండ్ /లీజ్డ్ లైన్, టెలిఫోన్ లైన్ విత్ మోడెమ్, యూఎస్‌బీ మోడెమ్/డాంగిల్/పోర్టబుల్ హాట్‌స్పాట్, వీసాట్ తదితరాల ద్వారా ఇంటర్నెట్ సదుపాయాన్ని సమకూర్చనున్నారు.

నాణ్యమైన పరికరాల ఏర్పాటు..

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్ల నాణ్యతలో ఏమాత్రం రాజీ లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- తరగతి గదుల్లోని విద్యార్థులకు 170 డిగ్రీల యాంగిల్‌లో కూడా స్పష్టంగా కనిపించేలా 65 ఇంచుల స్క్రీన్‌తో ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లుంటాయి.
- యాంటీ గ్లేర్ టెక్నాలజీ
- కంపాటబుల్ ఆపరేటింగ్ సిస్టమ్ (ఆండ్రాయిడ్)
- వైఫై, హెచ్‌డీఎంఐ, లాన్, యూఎస్‌బీ, వీజీఏ కనెక్టివిటీ
- రికార్డెడ్ బోర్డు వర్క్
- డిజిటల్ బోర్డును బ్లాక్ లేదా గ్రీన్ బోర్డులుగా మార్చుకోవడానికి అవకాశం
- ఆడియో, వీడియోల ప్రదర్శనకు వీలు
- ప్యానల్‌లోనే స్పీకర్ల ఏర్పాటు
- స్పెసిఫికేషన్లలో ఇంటెల్‌కోర్ ఐ-5, ఏఎండీ రీజెన్5 ప్రాసెసర్
- 8 జీబీ రామ్.. 512 జీబీ ఎస్ఎస్‌డీ ఇంటర్నల్ స్టోరేజీ
- వైర్డ్, వైర్‌లెస్ కమ్యూనికేషన్ విధానం
- మైక్రోసాఫ్ట్ విండోస్ 10 ప్రో ఆపరేటింగ్ సిస్టమ్
- 5 ఏళ్ల వారంటీ

డిజిటల్ కంటెంట్ సిద్ధం

డిజిటల్ విద్యా బోధనకు వీలుగా విద్యాశాఖ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు డిజిటల్ కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. ఇప్పటికే 6, 7 తరగతులకు సంబంధించి ఈ-కంటెంట్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా రూపొందింపజేసింది. సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ఆ సిలబస్‌కు అనుగుణంగా మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ ఈ-కంటెంట్‌ను రూపొందిస్తోంది. ఇతర సబ్జెక్టులు ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలకు అనుగుణంగా రూపొందనున్నాయి. ఇతర తరగతుల్లోనూ సీబీఎస్ఈ విధానం ప్రకారం ఈ-కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. వీటిలో ఆడియో, వీడియోల తరహాలో కంటెంట్ ఉండనుంది.


LOVED IN 70 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
కొత్త PLATINA 110 ABS
ABS ఆన్ అయితే స్కిడ్ అవ్వడం గాన్*
సమర్పిస్తున్నాము ప్రపంచపు
అత్యంత సురక్షితమైన 110 cc
మోటర్‌సైకిల్#
ABS సురక్షషీల్డ్
సాటిలేని బ్రేకింగ్ | తక్కువ బ్రేకింగ్ దూరం | మెరుగైన నియంత్రణ మరియు స్థిరత్వం
ఎక్స్-షోరూమ్ ధర ₹72 864^/-
ఆకర్షణీయమైన డౌన్ పేమెంట్ ₹9 323^/-
PLATINA
కుదుపులు నిషేధం
72198 21111
BAJAJ FINANCE LTD - AF
BAJAJ SECURE
Authorised Dealers For Bajaj Auto Ltd.: Vijayawada VARUN BAJAJ 9885180282,9966383555 • Gudiwada VARUN BAJAJ 0866- 247285, 9885180311. Authorised Service Centre: I TOWN 9885180278, GANDHI NAGAR 9885180286, NUNNA 9885706839, KANURU 8297265444, BHAVANIPURAM 9885180307, MACHAVARAM 8297215333, AUTO NAGAR 8297544427, NANDIGAMA 9885180284, KANCHIKACHERLA 9885001463, IBRAHIMPATNAM 9885180274, MYLAVARAM 9052421177, TIRUVURU 9885180306, 9885810692, GAMPALAGUDEM 8297225444, NUZIVIDU 9885180296, VISSANNAPET 9391812551, 9391812629, JAGGAYYAPET 9885180279, AGIRIPALLI 8297913888, MACHILIPATNAM 9885110333, KAIKALURU 9885180281, KALIDINDI 8297066111, CHALLAPALLI 9885114445, AVANIGADDA 9703219996, VUYYURU 08676-236263, 9885107476, KANKIPADU 9885163222, GANNAVARAM 9885180263, HANUMAN JUNCTION 8297181666.



ఏ పని చెయ్యడం భయమో, ఆ పని అనవసరం అని మనసు చాలా కారణాలు చూపుతుంది.

– చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 17

ప్రాణాంతక పర్యాటకం

దారుణం... అందరినీ కన్నీరు పెట్టించిన అనూహ్య ప్రమాదం. సంక్రాంతి పూట ఆదివారం ఉదయం హఠాత్తుగా జరిగిన నేపాల్ విమాన ప్రమాదఘటన తీవ్రత అలాంటిది. ఆ హిమాలయ దేశంలోని రెండో అతి పెద్ద దేశీయ విమానయాన సంస్థ యతీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండింజన్ల ఏఆర్టీ–72 విమానం ప్రమాదానికి గురై, అయిదుగురు భారతీయులతో సహా అందులోని 72 మందీ ప్రాణాలు కోల్పోయారు. కాఠ్మండూకు పశ్చిమాన 125 కి.మీ.ల దూరంలో, పోఖరాలో కాసేపట్లో దిగాల్సిన విమానం వాతావరణం బాగున్నా ఇరుకు కొండమార్గంలో కూలిపోవడం దురదృష్టకరం.

నేపాల్‌లో గత మూడు దశాబ్దాల్లో అతి పెద్ద విమాన దుర్ఘటన ఇదేనట. వరుస ప్రమాదాలతో అపకీర్తిని మూటగట్టుకున్న నేపాల్ నిద్ర మేల్కొని నిర్లక్ష్యం వీడాలని ఇది గుర్తుచేస్తోంది. టేకాఫైన 20 నిమిషాల్లో అంతా అయిపోయింది. అప్పటి దాకా నవ్వుతూ, తుళ్ళుతూ సాగిన ప్రయాణం రెప్ప పాటున ఎగసిన అగ్నికీలల్లో ఆర్తనాదాల మధ్య దుఃఖభరితం కావడం దిగ్భ్రాంతికరం. విమానం కిందకు దిగుతున్న వేళ ప్రయాణికులు కొందరు ఫేస్‌బుక్ లైవ్ చేస్తుండడంతో యాదృచ్ఛికంగా ఈ ప్రమాద ఘటన దృశ్యాలు ప్రత్యక్షంగా సోషల్ మీడియాకు చిక్కాయి. విమానంలోని బ్లాక్ బాక్స్ దొరికింది గనక, దాని సమాచార విశ్లేషణతో ప్రమాద కారణాలు త్వరలోనే బయటపడవచ్చు.

మూడు దశాబ్దాల క్రితం 1992లో పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) విమానం కాఠ్మండు విమానాశ్రయానికి వస్తూ, ఘోర ప్రమాదానికి గురై 167 మంది ప్రాణాలను బలి తీసుకుంది. నేపాలీ విమానయాన చరిత్రలో ఆ పీఐఏ ప్రమాదం అతి పెద్దది. ఆ తర్వాత ఈ హిమాలయ ప్రాంతంలో అనేక విమాన ప్రమాదాలు జరిగినా, ప్రాణనష్టం, తీవ్రతల్లో తాజా ఘటన మళ్ళీ ఆ గత చరిత్రను గుర్తు చేసింది. నిజానికి, ఇలాంటి విషాదాలు నేపాల్‌కు కొత్త కావు. ఎనిమిది నెలల క్రితమే నిరుడు మే నెలలో తారా విమానం కూలి, 22 మంది మరణించారు. 2000 నుంచి చూస్తే 22 ఏళ్ళలో నేపాల్‌లో 18 విమాన ప్రమాదాలు జరిగాయి. 350కి పైగా ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ఈ పర్వత ప్రాంత దేశంలో మారుమూల ప్రాంతాలు, సంక్లిష్టమైన రన్‌వేలు, ఆ పక్కనే ఎత్తైన కొండలు, ఇరుకైన కొండ మలుపుల లాంటివి అనేకం. కొమ్ములు తిరిగిన పైలట్లకూ అక్కడ విమానాలు నడపడం సవాలే. ప్రపంచంలోని అతి ఎత్తైన 14 పర్వత శిఖరాల్లో 7 నేపాల్‌లోనే ఉన్నాయి. పర్వతారోహకులకు సవాలు విసిరే ప్రసిద్ధ ఎవరెస్ట్ సైతం ఈ చిన్న హిమాలయ దేశంలోనే నెలకొంది. ఎత్తైన పర్వతశిఖరాలకు తోడు అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు సరేసరి. కొన్నేళ్ళుగా నేపాల్‌లో జరిగినన్ని విమాన ప్రమాదాలు మరెక్కడా జరగలేదంటే ఇవే కారణం.

పర్వత ప్రాంత నేపాలీ పర్యాటకమే ఆకర్షణగా విదేశీ పర్వతారోహకుల తాకిడి కొన్నేళ్ళుగా బాగా పెరిగింది. ఫలితంగా, ఆ దేశంలోని సంక్లిష్ట ప్రాంతాలకు సైతం సరకులనూ, మనుషులనూ తీసుకెళ్ళే విమాన రంగం కొన్నేళ్ళుగా విస్తరించింది. అదే సమయంలో ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వద్ద లూక్లాలోని టెన్సింగ్– హిల్లరీ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోకెల్లా ప్రమాదభరితమైన వాటిలో ఒకటైంది. 1960 నుంచి 2019 ఏప్రిల్ వరకు జరిగిన ప్రమాదాలు, ప్రాణనష్టాల లెక్క చూస్తే లూక్లా, జామ్‌సమ్, సిమీకోట్, జుమ్లా, దోల్పాలు నేపాల్‌లో ప్రమాద భూయిష్ఠమైనవని తేల్చారు. పైపెచ్చు, నిర్వహణ లోపాలు, తగినంత శిక్షణ లేకపోవడం, ప్రమాణాలు పాటించకపోవడం, అలసిసొలసిన పైలట్లు – ఇలా అనేకం ఆ దేశ విమానయాన రంగాన్ని పట్టిపీడిస్తున్నాయి. వీటి నుంచి నేపాల్ పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. చివరకు యూరోపియన్ యూనియన్ సైతం భద్రతా కారణాల రీత్యా నేపాలీ విమానసర్వీసుల్ని నిషేధించాయంటే అర్థం చేసుకోవచ్చు.

వాతావరణ వైవిధ్యం, సంక్లిష్ట భౌగోళిక ప్రాంతమనేవి నేపాల్‌లో విమానయానానికి సవాళ్ళనీ, చిన్న విమానాలు తరచూ ప్రమాదాల పాలవుతున్నది అందుకేననీ నేపాల్ పౌర విమానయాన ప్రాధికార సంస్థ 2019లోనే తన నివేదికలో పేర్కొంది. అయితే, పరిష్కారానికి చేసిన ప్రయత్నాలే పెద్దగా లేవు. వరుస విమాన ప్రమాదాల పాపం నేపాల్ పాలకులదనేది అందుకే! ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ దర్యాప్తులు చేస్తూనే ఉన్నారు. దర్యాప్తు సంఘాలు నివేదికలు ఇస్తూనే ఉన్నాయి. కానీ, ఆ నివేదికల్లోని సిఫార్సుల అమలు శూన్యం. అందుకే, ప్రమాదాలు, ప్రాణనష్టం ఆగడమే లేదు.

తాజా ఘటనాస్థలమైన పోఖరా విమానాశ్రయ ప్రాంతం ప్రమాదభరితమే. నేపాల్‌ను చంక నెట్టుకోవాలని చైనా చేస్తున్న దోస్తీ భారత్‌కు మరింత ప్రమాదభరితం. చైనాతో ఒప్పందంతో ఏడేళ్ళలో ఈ ఎయిర్‌పోర్ట్ వచ్చింది. బీజింగ్ ఒత్తిడితో, నిపుణుల మాట తోసిపుచ్చి, సర్వసన్నద్ధం కాకుండానే ఈ ఎయిర్‌పోర్ట్‌ను ఇటీవలే ప్రారంభించారు. హిమాలయ శ్రేణుల్లో భారత్‌ను ఇరుకున పెట్టాలన్నది డ్రాగన్ వ్యూహం కాగా, ప్రయాణికుల ప్రాణాల కన్నా పర్యాటకమే ముఖ్యమన్నట్టు నేపాల్ ముందుకు సాగడం దుస్సహం. షార్ట్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (స్టోల్) విమానాలతో పర్యాటక వాణిజ్య లబ్ధికై విజువల్ ఫ్లైట్ నిబంధనల్ని కూడా ఆ దేశం గాలికొదిలేస్తోంది.

గత పదేళ్ళలో జరిగిన 19 ప్రమాదాల్లో 16 ఘటనలు స్టోల్ విమానాలవే గనక, భారత్ మన పర్యాటకుల్ని అప్రమత్తం చేయాలి. ప్రాణాలకు పూచీపడని పొరుగు దేశంపై ఒత్తిడి తేవాలి. అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ సైతం తన 193 సభ్య దేశాల్లో ఒకటైన నేపాల్ తన వైమానిక భద్రత పెంచుకొనేలా కట్టుదిట్టం చేయాలి. నివేదికల్ని బుట్టదాఖలు చేస్తున్న నేపాలీ పాలకులు తక్షణమే పూర్తిస్థాయి భద్రతే లక్ష్యంగా కఠినచర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రాణాలకు ప్రమాదం!

స్తబ్ధత నుంచి చైతన్యంలోకి...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ప్రాథమిక హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు బోధించేదీ, తమ దైనందిన జీవితాలను ఎలా తీర్చి దిద్దుకోవాలో చెప్పేదీ రాజ్యాంగమే అని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఆ రాజ్యాంగం పాలితులకు బోధలే కాదు, పాలకులకు హితబోధలూ చేసింది. కానీ వాటిని పెడచెవిన పెట్టడమే నేటి దేశ దుస్థితికి కారణం. మైనారిటీల ఉనికిని తక్కువ చేసేలా పౌర చట్టాన్ని సవరించే ప్రయత్నం ఇందుకు ఒక ఉదాహరణ. వందిమాగధులుగా ప్రవర్తించేవారినే గవర్నర్లుగా నియమించడం మరొక ఉదాహరణ. నిరసనకారులపై అక్రమ కేసులు బనాయించడం మరో ఉదాహరణ. అయితే దీనికి విరుగుడు మళ్లీ రాజ్యాంగంలోనే ఉంది. దాని వెలుగులో ప్రజలు స్తబ్ధత వదిలించుకోవడంలోనే ఉంది.

"మహాత్మాగాంధీ దేశంలో ఒక గ్రూపునకు వ్యతిరేకంగా మరో గ్రూపును రెచ్చగొట్టే పద్ధతిని ఎన్నడూ అనుసరించలేదు. ఆయన హిందువే కావొచ్చు, కానీ దేశ పౌరులయిన ముస్లింలను దేశ స్వాతంత్ర్యానికి ముందు కూడా ప్రేమించారు. గాంధీజీ అనుసరించిన విధానం న్యాయబద్ధమైన సంస్కృతికీ, పౌర నీతికీ, సహృదయంతో కూడిన జాతీయ సమైక్యతకూ నిదర్శనం. అలాంటిది ఇతర మైనారిటీల పట్ల నేడు అనుసరిస్తున్న ప్రభుత్వ వివక్షాపూరిత విధానాలకు భారతదేశం తలదించుకోవలసి వస్తోంది."

– నోబెల్ బహుమాన గ్రహీత, సుప్రసిద్ధ ఆర్థికవేత్త అమర్త్యసేన్ (15 జనవరి 2023)

'చింత చచ్చినా పులుపు' చావలేదు. రాజ్యాలు అంతరించినా, దేశ పాలకుల్లో తెచ్చిపెట్టుకున్న రాచరికపు లక్షణాలు చావడం లేదు. దేశంలోని అసంఖ్యాక మైనారిటీ జాతుల ఉనికిని, వారి ప్రయోజనాలను తక్కువ చేసేలా పౌర చట్టాన్ని కొత్తగా సవరిస్తూ రూపొందించడం ఇందుకు ఒక ఉదాహరణ. పార్లమెంటులో నిర్దుష్టమైన చర్చ జరక్కుండానే ఆమోదించినట్టు పాలకులు ప్రకటించిన మరునాడే, రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పొందినట్టు వెల్లడించారు. అయినా చట్టం అమలులోకి రాకుండా ఎందుకు ఉండిపోవాల్సి వచ్చింది? దానికి కారణం–కొత్త చట్టం కింద రూల్స్ రూపొందించలేక పోవడం!

కాగా, త్రిపురలోని ఏ వామపక్ష ప్రభుత్వాన్ని, అందులోనూ దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా దేశ పాలకులు కూలదోసి కులుకుతున్నారో– అదే ఢిల్లీ పాలకులకు నిద్ర లేకుండా చేస్తూ త్రిపురలోని అనేక ఆదివాసీ తెగలను సమీకరించి, 'గ్రేటర్ తిప్రాలాండ్' (బృహత్ త్రిపుర) పేరిట 'తిప్రహా దేశీయ అభ్యుదయ ప్రాంతీయ సమాఖ్య'ను ప్రద్యోదత్ విక్రమ్ మాణిక్య దెబ్రమా నెలకొల్పారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ సమాఖ్య ఏర్పడింది. ఈ బృహత్ త్రిపుర 19 తెగల ప్రజా బాహుళ్యం విస్తరించి ఉన్న ప్రాంతం. ఈ ఆదివాసీ ప్రజా బాహుళ్యానికి ప్రాథమిక హక్కులు ఉన్నప్పటికీ వాటికి రక్షణ లేకపోయినందునే తాజా బృహత్ ఉద్యమానికి వారు సిద్ధమయ్యారు. త్రిపుర రాష్ట్ర సరిహద్దులలోనే 'గ్రేటర్ తిప్రాలాండ్' నెలకొల్పుకోవడానికి పూనుకున్నారు. త్రిపురలో బీజేపీ–ఆరెస్సెస్ పాలనకు ఇప్పుడీ 'గ్రేటర్ తిప్రాలాండ్' 'దేవిడీమన్నా' చెప్పడంతో ఢిల్లీ పాలకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది.

మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ(24 నవంబర్ 2022)– చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని విమర్శకులు చెబితే సరిపోదనీ, నిజానికి భారతదేశ చరిత్రను తిరగ రాయాల్సిన సమయం వచ్చిందనీ చెప్పారు. ఈ దేశంలో 150 సంవత్సరాలకు మించి ఏ ప్రాంతంలో అయినా కనీసం 30 రాజ్యాలు పరిపాలించిన ఉదాహరణలతో పండితులూ, విద్యార్థులూ పరిశోధించి తెల్పడానికి ముందుకు రావాలని విన్నపాలు చేశారు. 'మన చరిత్ర వక్రీకరణలకు గురైంది. దాన్ని సరి చేయడానికి మనం కష్టపడి పనిచేసి చరిత్రను సరి చేయాలి' అని అమిత్ షా బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పాలకులు ఏది పలికినా శాసనమై కూర్చుంటే, ఇంక వేరే జనవాక్యానికి స్థానమేదీ?



రెండో మాట

అందుకే, అటు పాలకులకూ, ఇటు పాలితులకూ నైతిక విలువలు బోధించేది భారత లౌకిక రాజ్యాంగమేననీ, అదే సర్వులకూ నైతిక విధాన బోధిని అనీ దేశ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే జస్టిస్ డీవై చంద్రచూడ్ చెబుతూనే వస్తున్నారు.

'దేశ ప్రజల్ని స్తబ్ధతలో నుంచి చైతన్యంలోకి మేలుకొల్పి, ప్రాథమిక హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో బోధించి, తమ దైనందిన జీవితాలను ఎలా తీర్చిదిద్దుకోవాలో చెప్పే గైడ్' రాజ్యాంగమే అని ఆయన అన్నారు. అందువల్లే ప్రజల దైనందిన అవసరాలతో నిమిత్తం లేకుండా అర్ధంతరంగా పెద్ద నోట్లను రద్దు చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని నిశితంగా ఖండించారు. జమ్ము–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని (370వ అధికరణ) ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో, అవినీతికి దారులు తెరిచే ఎలక్టోరల్ బాండ్స్‌ను ఎందుకు ప్రవేశ పెట్టవలసి వచ్చిందో తెల్పాలని నిగ్గదీశారు. కొలీజియం వ్యవస్థను రద్దు చేయమని కోరే హక్కును ప్రభుత్వానికి ఎవరిచ్చారని సుప్రీంకోర్టు ప్రశ్నించాల్సిన అవసరం వచ్చిందంటే పాలకుల స్థాయిని అనుమానించవలసి వస్తోంది.

ఇక రాష్ట్రాల గవర్నర్ల నియామకంలో వారి ప్రవర్తనను కనిపెట్టి ఉండటంలో దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాటించిన న్యాయ సూత్రాలు ఇప్పుడు గాలికి ఎగిరిపోయాయి. పాలక పార్టీలకు వందిమాగధులుగా ప్రవర్తించే అవకాశవాద రాజకీయ శక్తులనే గవర్నర్లుగానూ, ఉపరాష్ట్రపతులుగానూ నియమించే దుఃస్థితికి పాలకులు దిగజారిపోవడాన్ని చూసి దేశం విస్తుపోతోంది. ఈ పరిస్థితుల్లో జస్టిస్ చంద్రచూడ్ దేశ ప్రధాన న్యాయమూర్తిగా రెండేళ్ల పాటు కొనసాగనుండటం 2024లో రాబోతున్న సాధారణ ఎన్నికల నిర్ణయాలపై పాలకుల ప్రభావానికి గండి కొట్టగల పరిణామంగానే భావించాలి.

అంతేకాదు... ఒకనాటి భీమా కోరెగావ్ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ దళిత ప్రజా బాహుళ్యం జరుపుకొన్న ఉత్సవాలలో పాల్గొన్న వామపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి వారిని ఏళ్ల తరబడి జైళ్లపాలు చేసి వేధించడం ప్రజలు గమనించారు. ఈ సమస్య కూడా దేశ ప్రధాన న్యాయమూర్తి దృష్టికి రాగానే ఆయన పాలక పద్ధతుల్ని విమర్శిస్తూ వామపక్ష రాజకీయ ఖైదీల్ని విడుదల చేయడమో, కఠిన శిక్షలను సడలించడమో జరుగుతోంది. అంతేగాదు, ఎల్గార్ పరిషత్, మావోయిస్టుల మధ్య సంబంధాల మిషతో పాలకులు బనాయించిన కేసు నుంచి ఆనంద్ తేల్‌తుంబ్డేను చంద్రచూడ్ కోర్టు విడుదల చేసింది. అంతకుముందే తేల్‌తుంబ్డే బెయిల్‌ను సవాలు చేస్తూ ఎన్ఐఏ పెట్టిన దరఖాస్తును సుప్రీం తోసిపుచ్చింది.

నేటి తాజా దేశ పరిస్థితుల్ని సమీక్షించుకోవాలంటే – ఎన్నికల కమిషనర్ల దగ్గర నుంచి రాష్ట్రాల గవర్నర్ల వరకు పాలక పక్ష నాయకుల్ని మినహాయించి మరొకర్ని నియమించే సంప్రదాయానికి స్వస్తి చెప్పారు. బహుశా అందుకే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 'రాజ్యాంగబద్ధమైన నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్ల, రాజకీయ ప్రయోజనాలకు స్థానం ఉండరాదని' స్పష్టం చేశారు. అయితే ఈ నిర్ణయానికి తూట్లు పొడవడానికి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రయత్నించిన ఫలితంగానే విరుద్ధ పరిణామాలకు చోటు దొరికింది. అలాగే న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకునే సంప్రదాయం మంచిది కాదనీ, కానీ ఇటీవలి కాలంలో ముగ్గురు సుప్రీం ప్రధాన న్యాయమూర్తులుగా వచ్చిన జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్ వల్ల కోర్టు స్వతంత్ర ప్రతిపత్తికి విలువ వచ్చిందనీ లా కమిషన్ మాజీ అధ్యక్షుడు, ఢిల్లీ, మద్రాసు హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తి అజిత్ ప్రకాష్ షా అభిప్రాయపడవలసి వచ్చింది.

బహుశా అందుకే కాబోలు ఓ మహాకవి మనలో అసలు జబ్బు ఎక్కడుందో చెబుతూ – ''మనల్ని చూసి మనం నవ్వుకోలేక పోవడమే ఏడుపంతటికీ కారణం/ ఇంకా ఎన్నాళ్ళీ ఏడుపు? ఇవాళ సమస్యల్ని పరిష్కరించలేక/ ఆధ్యాత్మికంలోకి పరుగెత్తుతారు/ పద్యాలచే పంటలు పండించగలవా?/ పప్పు రుబ్బించగలవా?'' అని ప్రశ్నిస్తారు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రద్దీ రహదారులు



ఢిల్లీలో జీ20 సదస్సును ప్లాన్ చేస్తున్నాం. మామూలు రోజుల్లోనే ఢిల్లీ ప్రజలు కుల, మత, వర్గాలకు అతీతంగా ట్రాఫిక్ రద్దీపై చాలా అసహనంతో ఉంటారు. అయినప్పటికీ పి.డబ్ల్యూ.డి. అసమర్థతను నిరసించే స్వరాలు వినిపించవు. వీధుల్లోకి రాకుండా వీధుల్ని సరిచేయించడం ఎలా?

– సుధీర్ చౌదరి, సంపాదకులు

రాణికోట రహస్యాలు



ప్రిన్స్ హ్యారీ ఆత్మకథ 'స్పేర్' విడుదల రోజే 10 లక్షల 40 వేల కాపీలకు పైగా అమ్ముడైంది! ఇక ఆయన భార్య మేఘన్ మార్కెల్ రాయబోయే పుస్తకం కోసం వేచి ఉండండి. అదొక అగ్నిపర్వతమే. రాజకుటుంబంలో హ్యారీ దంపతులను ద్వేషించినవారు, వీరిని విరోధులుగా భావించిన వారు ఏం కాబోతున్నారన్న ఆందోళన నన్ను నిలవనివ్వడం లేదు.

– డాక్టర్ షోలా మోస్, సామాజిక కార్యకర్త

'వాచ్'ని నమ్మొచ్చా?!



హ్యూమన్ రైట్స్ వాచ్ గురించి నిజంగా మెచ్చుకోదగిన విషయం ఏమిటంటే వారు ప్రతి ఒక్కరినీ విమర్శిస్తారు. నేను, ఇతరులు ఏళ్ల తరబడిగా ఆధారపడుతున్న హెచ్.ఆర్.డబ్ల్యు. నివేదికలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. అయితే నిర్దిష్ట అంశాలలో వారు వహించే మౌనం వారి విశ్వసనీయతనే దెబ్బతీసేలా ఉంటోంది.

– ముర్తజా హుస్సేన్, విశ్లేషకులు

అంతిమ ప్రార్థన



ఉదయం ప్రార్థనలకు ముందు 22 ఏళ్ల మొహమ్మద్ మెహదీ కరామీని సెక్యూరిటీ గార్డులు సెల్ నుంచి నిద్ర లేపి 'ఉరికి సిద్ధంగా ఉండమని చెప్పారు. కొద్దిసేపటికే ఆ యువకుడిని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఉరి తీసింది. అతడు చేసిన నేరం? స్వేచ్ఛను కోరుతూ శాంతియుతంగా నిరసన ప్రదర్శన జరుపుతున్నవారికి మద్దతునివ్వడం!

– మాసిహ్ అలినేజాద్, ఇరాన్ యాక్టివిస్ట్

'మండల్' అమలు వ్యూహం ఆయనదే!

నివాళి



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

దేశరాజధానిలో 2023 జనవరి 12న తీవ్రమైన గుండెపోటుతో కన్నుమూసిన శరద్ యాదవ్ (75) మృతి దేశ వ్యాప్తంగా ఆయన అనుయాయులను, ఆరాధకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఈ యువ ఎమర్జెన్సీ వ్యతిరేక విద్యార్థి నేత 1974 జయప్రకాష్ నారాయణ్ ఉద్యమ సమయంలో 27 ఏళ్ల ప్రాయంలోనే పార్లమెంటు స్థానంలో గెలుపొంది జాతీయ నేతగా మారారు. ఓబీసీ భావన, దాని వర్గీకరణ జాతీయ నిఘంటువుగా మారడానికి చాలాకాలానికి ముందే ఆయన శూద్ర, ఓబీసీ, సామాజిక శక్తుల ప్రతినిధిగా, సోషలిస్టు సిద్ధాంతవేత్తగా ఆవిర్భవించారు.

రామ్‌మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్ (బిహార్‌కి చెందిన క్షురక సామాజిక బృందానికి చెందిన నేత)ల సోషలిస్టు సిద్ధాంత భూమిక నుంచి ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించిన నూతన యువ శూద్ర, ఓబీసీ నేతల బృందంలో శరద్ యాదవ్ ఒక భాగమై ఉండేవారు. ఈ బృందంలోని ఇతర నేతలు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై పోగా, ఈయన మాత్రం జాతీయ ప్రముఖుడిగా మారారు. ఈ యువ బృందానికి చెందిన ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్‌లు జాతీయ రాజకీయాల నుంచి వెనుదిరిగి రాష్ట్ర రాజకీయాలకు పరిమితమైపోగా, శరద్ యాదవ్ మాత్రం పార్లమెంటులోనే ఉండిపోయారు. ఏడు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నెగ్గిన శరద్ యాదవ్ పార్లమెంటులో పేదల అనుకూల సమరాల్లో పోరాడుతూ వచ్చారు. హిందీలో చక్కటి వక్త, తార్కిక చింతనాపరుడైన శరద్ యాదవ్ రాజకీయ వ్యూహకర్తగా ఉండేవారు.

ఈయన రాజకీయ వ్యూహం ఫలితంగానే నాటి ఉప ప్రధాని, జాట్ నేత అయిన దేవీలాల్ నుంచి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలోనూ... మండల్ నివేదికలోని ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని వీపీ సింగ్ అమలు చేయవలసి వచ్చింది. జనతా దళ్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన పరిణామాల గురించి శరద్ యాదవ్ వివరించి చెప్పారు.

'మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాల్సిందిగా జనతా దళ్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి మేము సోషలిస్టు నేతలందరినీ సమీకరించడం ప్రారంభించాము. ఇది జరగకుండా శూద్రులకు నిజమైన న్యాయం కలగదని మేము బలంగా నమ్మాము. మండల్ కమిషన్ సిఫార్సులను వీపీ సింగ్ సన్నిహితులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీన్ని అధిగమించడానికి ఆయన ఉపప్రధాని, ప్రముఖ జాట్ నేత దేవీలాల్ చౌదరి అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు. చరణ్ సింగ్ జోక్యం కారణం గానే జాట్లను వెనుకబడిన వర్గాల జాబితాలో మండల్ చేర్చలేకపోయారని తనకు తెలుసు. అయినప్పటికీ అనేక మంది స్థానిక జాట్ నేతలు, బృందాలు రిజర్వేషన్ కేటగిరీలో తమను చేర్చాల్సిందిగా తమ తమ రాజకీయ నేతలను ఒత్తిడికి గురి చేశారు.



శరద్ యాదవ్

ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్న వీపీ సింగ్ గొప్ప ఎత్తు వేశారు. జాట్లను రిజర్వేషన్ జాబితాలో చేర్చడానికి తాను వ్యతిరేకమే అయినప్పటికీ, ప్రముఖ జాట్ నేత అయిన దేవీలాల్ జాట్లను చేర్చకుండా మండల్ సిఫార్సులను అమలు చేయబోరని వీపీ సింగ్‌కు కచ్చితంగా తెలుసు. జనతాదళ్ జనరల్ సెక్రెటరీ, పరిశ్రమల మంత్రీ అయిన చౌదరి అజిత్ సింగ్ కూడా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ప్రచారం ప్రారంభించారు. ఓబీసీ జాబితాలో జాట్లను చేర్చాల్సిందేనని నొక్కి చెప్పసాగారు. దీంతో దేవీలాల్ రాజకీయ డైలమాలో చిక్కుకున్నారు. జాట్లను వెనుకబడిన వర్గంగా చేర్చిన ఘనత అజిత్ సింగ్‌కు దక్కకూడదని ఆయన కోరుకున్నారు. మరోవైపు, జాట్లను ఓబీసీ జాబితాలో చేర్చకుంటే తన సొంత జాట్ కమ్యూనిటీ నుంచి ఆగ్రహాన్ని చవిచూసే ప్రమాదాన్ని కూడా దేవీలాల్ కోరుకోలేదు. కాబట్టి, ఇది మండల్ కమిషన్‌పై చర్చకు ముగింపు పలుకుతుందని వీపీ సింగ్ భావించారు.'

''1990 ఆగస్టు 3న, వీపీ సింగ్ నాకు కబురంపి 'సోదరా శరద్! చౌదరి దేవీలాల్‌ని ఇక ఏమాత్రం నేను సహించలేన'ని చెప్పారు. దేవీలాల్‌తో మాట్లాడతాననీ, ఈ అధ్యాయానికి శాశ్వతంగా ముగింపు పలుకుతాననీ నేను వీపీ సింగ్‌కు హామీ ఇచ్చాను. అయితే దేవీలాల్‌ని కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించవద్దని నేను వీపీ సింగ్‌ను అభ్యర్థించాను. కానీ అప్పటికే దేవీలాల్‌కి ఉద్వాసన పలుకుతున్న ఆదేశాన్ని తాను రాష్ట్రపతికి పంపేసినట్లు వీపీ సింగ్ సమాధాన మిచ్చారు. దీంతో నేను సంభాషణను ముగించాల్సి వచ్చింది. మరుసటి రోజు తన కార్యాలయానికి రావలసిందిగా వీపీ సింగ్ కబురంపారు. నేను వెళ్లాను. దేవీలాల్ గురించి చర్చించుకున్నాము. నన్ను విశ్వాసంలోకి తీసుకోవాలని వీపీ సింగ్ భావించారు. అలాగైతేనే నేను దేవీలాల్‌తో జతకట్టబోనని ఆయన భావించారు. దేవీలాల్ పక్షంలో నేను చేరినట్లయితే ప్రధానమంత్రిగా తాను ఎక్కువ కాలం కొనసాగలేనని వీపీ సింగ్ భావిస్తున్నారని దీనర్థం.

ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్న నేను మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేస్తున్నట్లు ప్రకటించాలని వీపీ సింగ్‌ను కోరాను. ఆయన 1990 ఆగస్టు 15న దీనిపై ప్రకటన వెలువరించడానికి మొదట అంగీకరించారు. కానీ ఆగస్టు 9వ తేదీనే ఆయన దాన్ని ప్రకటించాల్సి వచ్చింది. అలా ప్రకటించకపోయి ఉంటే నేను ఢిల్లీలో జరగనున్న దేవీలాల్ ర్యాలీలో చేరడం తప్ప మరొక అవకాశం నాకు ఉండేది కాదు. మండల్ సిఫార్సులను అమలు చేస్తే అవి సమానతా సమాజాన్ని విశ్వసించి, దానికోసం కలగన్న అంబేడ్కర్, కర్పూరీ ఠాకూర్, లోహియా, జయప్రకాష్ నారాయణ్ స్వప్నాలు సాకారమవుతాయని నేను భావించాను.


1990 ఆగస్టు 6న వీపీ సింగ్ నివాసంలో సాయంత్రం 6 గంటలకు క్యాబినెట్ సమావేశం జరిగింది. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు ఈ సమావేశ ప్రధాన ఎజెండా. సన్నిహితులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఆ మరుసటి రోజు అంటే 1990 ఆగస్టు 7న కేంద్ర ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లను ఓబీసీలకు కల్పిస్తూ మండల్ కమిషన్ చేసిన రికమండేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించింది. చివరకు 1990 ఆగస్టు 13న ఓబీసీ రిజర్వేషన్ అమలుకు కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఆగస్టు 10 నుంచే ఆధిపత్య కులాలు రిజర్వేషన్‌కి వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించాయి. నెలరోజుల పాటు విద్యార్థులు, బ్యూరోక్రాట్లు, టీచర్లు దేశవ్యాప్తంగా రిజర్వేషన్ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. రహదారులు దిగ్బంధనకు గురయ్యాయి.'' – 'ది శూద్రాస్– విజన్ ఫర్ ఎ న్యూ పాత్' అనే పుస్తకం నుంచి.

అయితే, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేలా వీపీ సింగ్ ప్రభుత్వాన్ని ప్రేరేపించడంలో; వీధుల్లో మండల్ అనుకూల, వ్యతిరేక పోరాటాలను రగుల్కొల్పడంలో నాటి యువ శరద్ యాదవ్ తగిన పాత్ర పోషించకపోయి ఉంటే, భారతీయ శూద్ర/ఓబీసీలు ఈ రోజు దేశంలో ఈ స్థాయికి చేరుకుని ఉండేవారు కాదు. ఆర్ఎస్ఎస్/బీజేపీ శక్తులను నియంత్రిస్తున్న ద్విజులు మండల్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఆనాడు శూద్ర/ఓబీసీలు భారీ స్థాయిలో మండల్ అనుకూల సామాజిక సమీకరణకు పూనుకోకపోయి ఉంటే, నేడు ఓబీసీలు తమకు నాయకత్వం వహించి, నరేంద్రమోదీ భారత ప్రధాని కావడానికి ద్విజులు అమోదించి ఉండేవారు కాదు. చివరగా, ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ శూద్ర/ఓబీసీ నేతలు నేటి తమ రాజకీయ ప్రతిపత్తికి గాను శరద్ యాదవ్ అనే గొప్ప పోరాటకారుడికి ఎప్పటికీ రుణపడి ఉంటారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

విదులోపాఖ్యానం

వ్యాస భారతం ఉద్యోగ పర్వంలో విదులోపాఖ్యానం అని ఒకటి ఉన్నది. కృష్ణుడు కౌరవుల వద్ద తన రాయబారం విఫలమయ్యాక తిరిగి వెళ్తూ కుంతిని చూడటానికి వస్తాడు. వచ్చి, 'నీ కొడుకుల్తో ఏమి చెప్పమంటావు అత్తా' అని అడుగుతాడు. 'యుద్ధం చేసి రాజ్యం సంపాదించుకోమని చెప్పు' అని అంటుంది. అలా అనడమే కాక, తన మాటను సమర్థించుకోవటానికి అన్నట్లు ఒక కథను జోడించి చెబుతుంది.



జ్యోతిర్మయం

''పూర్వం 'విదుల' అనే పేరు గల ఒక ప్రసిద్ధురాలైన క్షత్రియ కాంత ఉండేది. ఆమె కొడుకు, సంజయుడనే పేరు గలవాడు, యుద్ధంలో సింధు రాజు చేత ఓడింపబడి ఇంటికి పారిపోయి వస్తాడు, తన కొడుకు దీనదశలో పడి ఉండటం చూసి ఆమె అతణ్ణి నిందిస్తూ ఇలా అంటుంది...

'శత్రువులకు నీవు సంతోషం కలిగించవద్దు. బలహీనుడవనుకొని నిన్ను నీవు అవమాన పరచుకోవద్దు. లేచి నిలబడు. ఊక నిప్పులా పొగచూరే బదులు, కాసేపైనా భగ్గుమని వెలగాలి. విద్వాంసుడు తాను కోరిన ఫలం లభించినా, లభించకపోయినా దుఃఖించడు. నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఎవని పరాక్రమాన్నీ, ప్రవర్తననూ లోకులు గొప్పగా ప్రశంసించరో, ఏ మనుష్యుని చేత సంతానం మాత్రమే వృద్ధి చెందింపబడుతుందో, అట్టివాడు పురుషుడు కాడు, స్త్రీ కూడా కాదు. అందరికీ ఆశ్రయమిస్తూ పండ్లతో ఉన్న చెట్టులా బతకాలి మనిషి!'

విదుల ఈ విధంగా కొడుక్కి బోధించి, ఇంకా అతనికి యుద్ధంలో ఉత్సాహం కలిగేట్టు ఇలా అంటుంది– 'నీ పేరు సంజయుడు. ఎవని చేతనూ నీవు జయింపబడవు. యుద్ధంలో విజయం సాధించి నీ పేరు సార్థకం చేసుకో.'

ఇట్లా తల్లి చెప్పిన ఉపదేశ వాక్యాలు విని సంజయుడిలో ఉత్సాహం ఉరకలెత్తింది. జాతి గుర్రంలా విజృంభించి, తల్లి చెప్పినదంతా చేసి పెట్టాడు.'' ఈ విధంగా కుంతి, శ్రీకృష్ణునకు విదులోపాఖ్యానం చెప్పి అతని ద్వారా ధర్మరాజుకు తన సందేశం పంపుతుంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.దశమి ప.12.57 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: విశాఖ ప.2.24 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: సా.6.15 నుండి 7.48 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.51 నుండి 9.34 వరకు తదుపరి రా.10.53 నుండి 11.45 వరకు, అమృతఘడియలు: ఉ.5.48 నుండి 7.19 వరకు, తిరిగి రా.3.33 నుండి 5.06 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.42

● తమిళనాడులో ఆది, సోమవారాల్లో నిర్వహించిన తమిళుల సాహసక్రీడ జల్లికట్టు పోటీల్లో ఇద్దరు మృతిచెందారు. వందమందికిపైగా గాయపడ్డారు. పాలమేడు, సుర్రియూర్‌ల్లో సోమవారం జరిగిన ఈ పోటీల్లో ఎద్దులను నిలువరించేందుకు క్రీడాకారులు తీవ్రంగా ప్రయత్నించారు.

రైతులకు మరో రూ. 1,467 కోట్లు చెల్లింపు

సాక్షి, అమరావతి: ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించి పండుగ వేళ వారి ఇంట ఆనందాన్ని నింపింది. ధాన్యం రైతులకు సోమవారం మరో రూ.1,467 కోట్లు చెల్లించింది. ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. మిల్లర్లు, దళారీ వ్యవస్థను ప్రక్షాళన చేయడంతోపాటు రైతులపై భారం పడకుండా ధాన్యం రవాణా, హమాలీ, గోనె సంచులు ఖర్చులను సైతం భరిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసినప్పటి నుంచి 21 రోజుల్లో కచ్చితంగా చెల్లింపులు చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దింది. ఇప్పటి వరకు 4.73 లక్షల మంది రైతుల నుంచి 26.08 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఇందులో రూ.5,324.31 కోట్లకు గానూ, తాజాగా విడుదల చేసిన మొత్తంతో కలిపి రూ.4,779.85 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. మొత్తం 4.68 లక్షల



మంది రైతులు (90 శాతం) మద్దతు ధరను పొందారు. వీటితో పాటు రూ.21.87 కోట్లు రావాణా, హమాలీ ఖర్చులను అందించింది. మరో రూ.40 కోట్లు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో రికార్డు స్థాయిలో ఉత్పత్తి



సాక్షి, న్యూఢిల్లీ/ ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్(గోదావరి)-1లో ఆదివారం రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి జరిగింది. మూడు షిఫ్ట్‌లలో అత్యధికంగా 8,100 మెట్రిక్ టన్నుల హాట్ మెటల్‌ను ఉత్పత్తి చేసినట్లు కేంద్ర ఉక్కు శాఖ ప్రకటించింది. బ్లాస్ట్‌ఫర్నేస్-1 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉత్పత్తి కావడం విశేషం. అంతకుముందు 2022 ఫిబ్రవరి 18న బ్లాస్ట్‌ఫర్నేస్-1 నుంచి అత్యధికంగా 8,019 టన్నుల ఉత్పత్తిని సాధించారు. ఈ రికార్డును ఇప్పుడు అధిగమించారు. ఈ సందర్భంగా సిబ్బందిని సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం



తిరుమల: పవిత్రమైన ధనుర్మాసం శనివారం ముగియడంతో ఆదివారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో డిసెంబర్ 22వ తేదీ నుంచి 25 రోజుల పాటు జరిగిన అధ్యయనోత్సవాలు ఆదివారం ముగిశాయి. 'తన్నీరముదు' ఉత్సవం తిరుమలలో ఆదివారం ఘనంగా జరిగింది. కాకబలి కార్యక్రమం సోమవారం వైదికోక్తంగా జరిగింది. తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 76,307 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 29,573 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.41 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్యే హనుమంత షిండే, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ తదితరులు సోమవారం దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ఆదివారం దర్శించుకున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది.

గిరిజన దంపతుల దారుణ హత్య

చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం స్టాఫర్డ్‌పేటలో గిరిజన దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. సోమవారం జరిగిన ఈ ఘటనలో మిడియం లక్ష్మయ్య(54), మిడియం సింగమ్మ(52)ను గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చారు. చింతూరు ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాలు.. దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుఝామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాట్లాడే పనుందని లక్ష్మయ్యను నిద్రలేపారు. తమతో బయటకు రావాలని వారు కోరగా.. నిరాకరించిన లక్ష్మయ్య తిరిగి ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో లక్ష్మయ్యపై వారు కర్రలు, గునపంతో దాడి చేశారు. గమనించిన లక్ష్మయ్య భార్య సింగమ్మ బయటకొచ్చి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆమెపై కూడా దాడి చేయడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న కోడలు శాంతి తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కోడలు శాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేతబడి, భూ తగాదాలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

నేత్రపర్వంగా లీలా కల్యాణం



దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామికి స్వాగతం పలుకుతున్న మంత్రి సత్యనారాయణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సంక్రాంతి పర్వదినాన ఆదివారం పార్వతీ సమేత మల్లికార్జున స్వామివార్ల లీలా కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి దంపతులు స్వామి అమ్మవార్ల నూతన వస్త్రాలు, చెంచులు అడవి ఆకులతో తయారు చేసిన ఆభరణాలు సమర్పించారు. అంతకుముందు నందివాహన సేవ వైభవంగా జరిపారు. కనుమ రోజు సోమవారం స్వామి అమ్మవార్లకు కైలాస వాహనసేవ నిర్వహించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్, ఊహ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, ఉజ్జయిని పీఠం పీఠాధిపతి సిద్ధలింగ దేశికేంద్ర శివాచార్య మహాస్వామి, కాశీపురం పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య మహబూస్వామి, కాశీపురం ఉత్తరాధికార పీఠాదిపతి మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం వేదగోష్ఠి జరిపారు. దేవస్థాన ఈవో లవన్న పాల్గొన్నారు.

మల్లన్న సేవలో గణపతి సచ్చిదానంద స్వామి

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను మైసూరు అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పీఠాధిపతులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవస్థానం ఈవో ఎస్.లవన్న, స్వాగతం పలికారు.

శ్రీశైల దేవస్థానంలో భారత ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా శ్రీశైల వైభవంపై లైట్ అండ్ సౌండ్ షోను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం రాత్రి ప్రారంభించారు.

టీడీపీలో ప్రక్షాళన జరగాలి

- ఆ నలుగురికీ సీట్లిస్తే సహకరించేది లేదు
- ఎంపీ కేశినేని నాని



నందిగామ: తెలుగుదేశం పార్టీలో ప్రక్షాళన జరగాలన్నది తన కోరిక అని విజయవాడ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆదివారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి చేయడానికి తాను రాజకీయాల్లోకి రాలేదని, తన జీవితంలో ఎవరినీ మోసం చేయలేదని అన్నారు. 'మీకంటే మీ సోదరుడు చిన్ని యాక్టివ్‌గా ఉంటున్నారు కదా' అని కొందరు మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. 'మంచిదేగా' అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తిరిగే హక్కు ఉందని, ఎన్నికల్లో దావూద్ ఇబ్రహీం వంటి వారే కాకుండా కాల్‌మనీ చేసే వాళ్లకు కూడా పోటీచేసే హక్కు ఉందని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ గొప్ప ఆశయంతో టీడీపీని స్థాపించారని, అదే ఆశయంతో పని చేయాలని ఉంటే ఎవరైనా పోటీ చేయవచ్చని అన్నారు. తాను ఢిల్లీ స్థాయి నాయకుడినని, తన సేవలు కావాలంటే పార్టీ వాడుకోవచ్చన్నారు. తాను ఎంపీ కావడం వల్ల ఈ స్థాయికి రాలేదని, తనకంటూ ఒక గుర్తింపు ఉందని వ్యాఖ్యానించారు.

వాళ్లకు సీటిస్తే సహకరించేది లేదు

తన సోదరుడు చిన్నితో పాటు మరో ముగ్గురికి టికెట్ ఇస్తే వారికి తన మద్దతు ఉండదని కేశినేని స్పష్టం చేశారు. క్యారెక్టర్ ఉన్న పేదవాడికి సీటిచ్చినా తాను సపోర్ట్ చేస్తానని, చీటర్లకు సీటిస్తే తాను మద్దతు ఇవ్వనన్నారు. తన సోదరుడితోపాటు మరికొందరు నాయకులపైనా నాని పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

బాబు అండ్ కో కుట్రలు సాగనివ్వం

841వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: తమ రాజకీయ లబ్ధికోసం రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తున్న బాబు అండ్ కో కుట్రలు సాగనివ్వబోమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 841వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ అమరావతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యతిరేకం కాదని, అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి ఆయన ఆశయమన్నారు. గ్రాఫిక్స్ బొమ్మలు చూపించి రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో గడించిన కోట్ల రూపాయల అవినీతి ఎక్కడ బయటపడుతుందో అనే ఆందోళనతో అమరావతి ఉద్యమాన్ని అడ్డుపెట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల ఉగ్రవాదుల్లా మారడం సిగ్గుచేటని మండిపడ్డారు.

అమెరికా అందగత్తెకు...
విశ్వ సుందరి కిరీటం



వాషింగ్టన్: 2022 సంవత్సరం విశ్వ సుందరి కిరీటాన్ని అమెరికాకు చెందిన ఆర్.బోనీ గాబ్రియెల్ గెలుచుకున్నారు. అమెరికాలోని న్యూ ఆర్లీన్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భారత్‌కు చెందిన 2021 మిస్ యూనివర్స్ హర్నాజ్ సంధూ ఆమెకు కిరీటం తొడిగారు. వెనెజువెలా, డొమినికన్ రిపబ్లిక్ అందాల భామలు తొలి, రెండో రన్నరప్‌గా నిలిచారు. భారత్ నుంచి పోటీపడ్డ మంగళూరుకు చెందిన దివితా రాయ్‌కి 16వ స్థానం దక్కింది. గాబ్రియెల్ యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ చేశారు. ఫ్యాషన్ డిజైనర్‌గా, మోడల్‌గా చేస్తున్నారు. ఆర్.బోనీ నోలా పేరిట వస్త్ర పరిశ్రమ స్థాపించి కంపెనీకి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. భారత్ నుంచి 1994లో సుస్మితా సేన్, 2000లో లారా దత్తా, 2021లో హర్నాజ్ సంధూ మిస్ యూనివర్స్‌గా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా...

అమెరికాలో కాల్పులు ఆరుగురు దుర్మరణం

విసాలియా: అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని గోషెన్ అనే ప్రాంతంలో ఓ ఇంటి వద్ద సోమవారం తెల్లవారుజామున కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు మరణించారు. మృతుల్లో 17 ఏళ్ల తల్లి, ఆరు నెలల ఆమె బిడ్డ కూడా ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు కాల్పులకు పాల్పడినట్లు పోలీసులు అధికారులు భావిస్తున్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రెండు మృతదేహాలు వీధిలో, మరొకటి ఇంటి గుమ్మం వద్ద, మరో మూడు ఇంటి లోపల లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. ఇవి ఉద్దేశపూర్వకంగానే ఆ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని జరిపిన కాల్పులని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

అణ్వస్త్ర దేశమై ఉండి అడుక్కోవడం సిగ్గుచేటు

పాక్ ఆర్థిక సంక్షోభంపై ప్రధాని ఆవేదన

ఇస్లామాబాద్: అణ్వస్త్ర దేశంగా ఉండి కూడా ఇతరులను బిచ్చమెత్తుకోవాల్సి రావడం సిగ్గుపడాల్సిన విషయమని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వాపోయారు. మరిన్ని రుణాలు కావాలని అడగడం తనకు ఇబ్బందిగా మారిందన్నారు. దేశాన్ని ఆర్థికంగా చక్కదిద్దడానికి విదేశీ రుణాలు సరైన పరిష్కారం కాదన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడి.. 40 మంది దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్ నగరం డ్నీప్రో నగరంలోని ఓ అపార్టుమెంట్‌పై రష్యా క్షిపణి దాడిలో 40 మంది దుర్మరణం పాలయ్యారు. 75 మంది గాయపడ్డారు. 1,700 మంది ఉంటున్న ఈ భవనంపై శనివారం క్షిపణి దాడి జరిగింది. పౌర నివాసాలే లక్ష్యంగా నేరుగా రష్యా జరిపిన దాడి అమానవీయమని ఈయూ దుయ్యబట్టింది.

గృహిణులకు నెలకు 2 వేలు

కర్ణాటక ఓటర్లకు కాంగ్రెస్ హామీ

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే గృహిణులకు నెలకు రూ.2 వేలు చొప్పున అందజేస్తామని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా చెప్పారు. సోమవారం బెంగళూరులో మహిళల కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గృహ లక్ష్మి యోజన పథకంలో భాగంగా ఏడాదికి రూ.24 వేలు నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. కోటిన్నర మందికి దీంతో లబ్ధి కలుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మహిళలకు ప్రత్యేకంగా ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. కర్ణాటకలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం తెలిసిందే.

కాలిఫోర్నియాలో వరదలు.. 19 మంది దుర్మరణం

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా వాసులు వరుస తుపానులతో బిక్కుబిక్కుమంటున్నారు. భారీ వరదలు, మంచు కారణంగా శనివారం రాష్ట్రంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో రెండు రోజులు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాలిఫోర్నియా వరదలను విపత్తుగా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. శనివారం సియెర్రా నెవడా ప్రాంతంలో మూడడుగుల మేర మంచు కురిసింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వారం రోజులుగా ఏడడుగుల మేర మంచు పడిందని తెలిపింది. వరదల కారణంగా ప్రధాన రహదారులు, శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి.

భారత్ నానాటికీ బలోపేతం

ఆర్మీ డే వేడుకల్లో రాజ్‌నాథ్

బనశంకరి: భారతదేశం ఆర్థికంగా అంతర్జాతీయ స్థాయిలో రోజురోజుకు బలోపేతమౌతోందని, 2027 నాటికి ప్రపంచంలోనే ఆర్థిక వ్యవస్థల్లో మొదటి స్థానంలోకి రావడం తథ్యమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆదివారం బెంగళూరు ఏఎస్‌సీ సెంటర్‌లో నిర్వహించిన 75వ ఆర్మీ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్మీ డేను మొదటిసారిగా ఢిల్లీ బయట బెంగళూరులో నిర్వహిస్తున్నామని చెప్పారు.

1 శాతం మంది గుప్పిట్లో...
40% దేశ సంపద!

భారీగా పెరుగుతున్న పేద-ధనిక అంతరం

- ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడి
- కుబేరులపై అదనపు పన్నులేయాలి
- ఆ మొత్తాలను పేదలపై వెచ్చించాలి
- అప్పుడే అసమానతలు తగ్గుతాయి



దావోస్: ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం మంది చేతిలో ఉన్న సంపద అంతా కలిపితే ఎంతో తెలుసా? మిగతా వారందరి దగ్గరున్న దాని కంటే ఏకంగా రెట్టింపు! ఈ విషయంలో మన దేశమూ ఏమీ వెనకబడలేదు. దేశ మొత్తం సంపదలో 40 శాతానికి పైగా కేవలం 1 శాతం సంపన్నుల చేతుల్లోనే పోగుపడిందట!! మరోవైపు, ఏకంగా సగం మంది జనాభా దగ్గరున్నదంతా కలిపినా మొత్తం సంపదలో 3 వంతు కూడా లేదు! ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ అనే హక్కుల సంఘం వార్షిక అసమానతల నివేదికలో పేర్కొన్న చేదు నిజాలివి. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు తొలి రోజు సోమవారం ఈ నివేదికను ఆక్స్‌ఫాం విడుదల చేసింది. 2020 మార్చిలో కరోనా వెలుగు చూసినప్పటి నుంచి 2022 నవంబర్ దాకా భారత్‌లో బిలియనీర్ల సంపద ఏకంగా 121 శాతంపెరిగిందని అందులో పేర్కొంది. అంటే రోజుకు ఏకంగా రూ.3,608 కోట్ల పెరుగుదల! భారత్‌లో ఉన్న వ్యవస్థ సంపన్నులను మరింతగా కుబేరులను చేసేది కావడమే ఇందుకు కారణమని ఓక్స్‌ఫాం ఇండియా సీఈఓ అమితాబ్ బెహర్ అభిప్రాయపడ్డారు. ఫలితంగా దేశంలో దళితులు, ఆదివాసీలు, మహిళలు, అసంఘటిత కార్మికుల వంటి అణగారిన వర్గాల వారి వెతలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయన్నారు. భారత్‌లో పేదలు హెచ్చు పన్నులు, సంపన్నులు తక్కువ పన్నులు చెల్లిస్తుండటం మరో చేదు నిజమని నివేదిక తేల్చింది. ''2021–22లో వసూలైన మొత్తం రూ.14.83 లక్షల కోట్ల జీఎస్టీలో ఏకంగా 62 శాతం ఆదాయ సూచీలో దిగువన ఉన్న 50 శాతం మంది సామాన్య పౌరుల నుంచే వచ్చింది! టాప్ 10లో ఉన్న వారినుంచి వచ్చింది కేవలం 3 శాతమే'' అని పేర్కొంది. ''దీన్నిప్పటికైనా మార్చాలి. సంపద పన్ను, వారసత్వ పన్ను తదితరాల ద్వారా సంపన్నులు కూడా తమ ఆదాయానికి తగ్గట్టుగా పన్ను చెల్లించేలా కేంద్ర ఆర్థిక మంత్రి చూడాలి'' అని బెహర్ సూచించారు. ఈ చర్యలు అసమానతలను తగ్గించగలవని ఎన్నోసార్లు రుజువైందన్నారు. ''అపర కుబేరులపై మరింత పన్నులు వేయడం ద్వారానే అసమానతలను తగ్గించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోగలం'' అని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాబ్రియేలా బుచ్ అభిప్రాయపడ్డారు. ''భారత్‌లో నెలకొన్న అసమానతలు, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు సేకరించిన పరిమాణాత్మక, గుణాత్మక సమాచారాలను కలగలిపి ఈ నివేదికను రూపొందించాం. సంపద అసమానత, బిలియనీర్ల సంపద సంబంధిత గణాంకాలను ఫోర్బ్స్, క్రెడిట్‌సుసీ వంటి సంస్థల నుంచి సేకరించాం. నివేదికలో పేర్కొన్న వాదనలన్నింటికీ కేంద్ర బడ్జెట్, పార్లమెంటు ప్రశ్నోత్తరాలు తదితరాలు ఆధారం'' అని ఆక్స్‌ఫాం తెలిపింది.

కేంద్రానికి సూచనలు...

- అసమానతలను తగ్గించేందుకు ఏకమొత్త సంఘీభావ సంపద పన్ను వంటివి వసూలు చేయాలి. అత్యంత సంపన్నులైన 1 శాతం మందిపై పన్నులను పెంచాలి. పెట్టుబడి లాభాల వంటివాటిపై పన్ను పెంచాలి.
- వారసత్వ, ఆస్తి, భూమి పన్నులను పెంచాలి. నికర సంపద పన్ను వంటి వాటిని ప్రవేశపెట్టాలి.
- ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులను 2025 కల్లా జీడీపీలో 2.5 శాతానికి పెంచాలి.
- ప్రజారోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.
- విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులను ప్రపంచ సగటుకు తగ్గట్టుగా జీడీపీలో 6 శాతానికి పెంచాలి.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరికీ కనీస మౌలిక వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఈ కనీస వేతనాలు గౌరవంగా బతికేందుకు చాలినంతగా ఉండేలా చూడాలి.

నివేదిక విశేషాలు...



- భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 2020లో 102 ఉండగా 2022 నాటికి 166కు పెరిగింది.
- దేశంలో టాప్–100 సంపన్నుల మొత్తం సంపద ఏకంగా 660 బిలియన్ డాలర్లకు, అంటే రూ.54.12 లక్షల కోట్లకు చేరింది. ఇది మన దేశ వార్షిక బడ్జెట్‌కు ఒకటిన్నర రెట్లు!
- భారత్‌లోని టాప్ 10 ధనవంతుల సంపదలో 5 శాతం చొప్పున, లేదా టాప్ 100 ధనవంతుల సంపదలో 2.5 శాతం చొప్పున పన్నుగా వసూలు చేస్తే ఏకంగా రూ.1.37 లక్షల కోట్లు సమకూరుతుంది. ఇది కేంద్ర కుటుంబ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు కేటాయించిన మొత్తం నిధుల కంటే ఒకటిన్నర రెట్ల కంటే కూడా ఎక్కువ! ఈ మొత్తం దేశంలో ఇప్పటి దాకా స్కూలు ముఖం చూడని చిన్నారులందరి స్కూలు ఖర్చులకూ సరిపోతుంది.
- 2017–21 మధ్య భారత కుబేరుడు గౌతం అదానీ ఆర్జించిన (పుస్తక) లాభాలపై పన్ను విధిస్తే ఏకంగా రూ.1.79 లక్షల కోట్లు సమకూరుతుంది. దీనితో 50 లక్షల మంది టీచర్లను నియమించి వారికి ఏడాదంతా వేతనాలివ్వొచ్చు.
- వేతనం విషయంలో దిన కూలీల మధ్య లింగ వివక్ష ఇంకా ఎక్కువగానే ఉంది. పురుషుల కంటే మహిళలకు 37 శాతం తక్కువ వేతనం అందుతోంది.
- ఇక ఉన్నత వర్గాల కూలీలతో పోలిస్తే ఎస్సీలకు, పట్టణ కూలీలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల వారికీ సగం మాత్రమే గిడుతోంది.
- సంపన్నులపై, కరోనా కాలంలో రికార్డు లాభాలు ఆర్జించిన సంస్థలపై మరింత పన్ను విధించాలని 2021లో జరిపిన ఫైట్ ఇనీక్వాలిటీ అలియన్స్ ఇండియా సర్వేలో 80 శాతం మందికి పైగా డిమాండ్ చేశారు.
- అసమానతలను రూపుమాపేందుకు సార్వత్రిక సామాజిక భద్రత, ఆరోగ్య హక్కు తదితర చర్యలు చేపట్టాలని 90 శాతానికి పైగా కోరారు.

5 శాతం మందిపై పన్నుతో.. 200 కోట్ల మందికి పేదరికం నుంచి ముక్తి



ప్రపంచవ్యాప్తంగా ఒక్క శాతం సంపన్నుల వద్ద నున్న మొత్తం, మిగిలిన ప్రపంచ జనాభా సంపద కంటే రెండున్నర రెట్లు అధికంగా ఉన్నట్టు ఆక్స్‌ఫాం నివేదిక తెలిపింది. వారి సంపద రోజుకు ఏకంగా 2.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరుగుతున్నట్టు పేర్కొంది. అది ఇంకేం చెప్పిందంటే...

- ప్రపంచంలోని మల్టీ మిలియనీర్లు, బిలియనీర్లపై 5 శాతం పన్ను విధిస్తే ఏటా 1.7 లక్షల కోట్ల డాలర్లు వసూలవుతుంది. ఈ మొత్తంతో 200 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేయొచ్చు.
- 2020 నుంచి ప్రపంచమంతటా కలిసి పోగుపడ్డ 42 లక్షల కోట్ల డాలర్ల సంపదలో మూడింత రెండొంతులు, అంటే 26 లక్షల కోట్ల డాలర్లు కేవలం ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడింది!
- అంతేకాదు, గత దశాబ్ద కాలంలో కొత్తగా పోగుపడ్డ మొత్తం ప్రపంచ సంపదలో సగం వారి జేబుల్లోకే వెళ్లింది!!
- మరోవైపు పేదలు, సామాన్యులేమో ఆహారం వంటి నిత్యావసరాలకు సైతం అంగలార్చాల్సిన దుస్థితి నెలకొని ఉంది.
- వాల్‌మార్ట్ యజమానులైన వాల్టన్ కుటుంబం గతేడాది 850 కోట్ల డాలర్లు ఆర్జించింది.
- భారత కుబేరుడు గౌతం అదానీ సంపద ఒక్క 2022లోనే ఏకంగా 4,200 కోట్ల డాలర్ల మేరకు పెరిగింది!
- కుబేరులపై వీలైనంతగా పన్నులు విధించడమే ఈ అసమానతలను రూపుమాపేందుకు ఏకైక మార్గం.



ఢిల్లీలో రోడ్ షో సందర్భంగా ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం

మోదీపై విపక్షాలది దుష్ప్రచారమే

సుప్రీంకోర్టు తీర్పులే నిదర్శనం

బీజేపీ జాతీయ కార్యవర్గం తీర్మానం

న్యూఢిల్లీ: ''కేంద్రం ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీపై ప్రతిపక్షాల ఆరోపణలన్నీ దుష్ప్రచారాలు మాత్రమే. పలు కేసుల్లో ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల్లోనూ ఇదే స్పష్టమైంది'' అని బీజేపీ పేర్కొంది. సోమవారం బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీలో కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు ఈ మేరకు చేసిన రాజకీయ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియాకు ఈ మేరకు వెల్లడించారు. ''రఫేల్, పెగసస్, సెంట్రల్ విస్టా ప్రాజెక్టు, నోట్ల రద్దు, ఈడబ్ల్యూఎస్ కోటా తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర దుష్ప్రచారం సాగించాయి. కానీ వీటికి సంబంధించిన అన్ని కేసుల్లోనూ కేంద్రం వైఖరిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పులు వెలువరించింది. విపక్షాలు చెబుతున్నదంతా అబద్ధమేనని దీంతో తేలిపోయింది'' అని ఆమె అన్నారు. మోదీపై వారి నిరాధార ఆరోపణలను చట్టపరంగా తిప్పికొట్టామన్నారు. ''దేశం కోసం పనిచేస్తున్న మోదీకి ప్రపంచదేశాల్లో గౌరవం లభిస్తోంది. దేశ ప్రతిష్టను ఆయన పెంచారు'' అన్నారు.

2023 ఎన్నికలు కీలకం: నడ్డా

లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో ఎన్నికలు జరిగే 9 రాష్ట్రాల్లో ఒక్కదాన్నీ బీజేపీ కోల్పోరాదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపును చరిత్రాత్మకంగా ఆయన అభివర్ణించారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దూసుకుపోతోందని కొనియాడారు.

మోదీకి ఘన స్వాగతం

అంతకుముందు కార్యవర్గ సమావేశానికి వస్తున్న మోదీకి బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. పటేల్ చౌక్ నుంచి ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ దాకా పార్టీ కార్యకర్తలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి ప్రధానిపై పూలు చల్లారు. నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ విజయాలను తెలుపుతూ భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. వేదిక వద్ద మోదీకి నడ్డా స్వాగతం పలికారు.

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం
72 మంది దుర్మరణం!



దుర్ఘటన జరిగిన ప్రాంతం

కఠ్మాండు: నేపాల్లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 72 మంది ప్రయాణికులతో కఠ్మాండు నుంచి టూరిస్టు కేంద్రమైన పొఖారా బయల్దేరిన యతి ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండవడానికి కొద్దిసేపటి ముందు ఒక్కసారిగా కుప్పకూలింది. సెతీ నది ఒడ్డున పొఖారాలోని పాత, కొత్త విమానాశ్రయాలకు సరిగ్గా మధ్యలో నేలను తాకుతూనే భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ దారుణంలో అందరూ మరణించినట్టు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 69 మృతదేహాలను వెలికితీశారు. మిగతా ముగ్గురి కోసం మంగళవారం కూడా గాలింపు కొనసాగనుంది. తేలింది. మృతుల్లో ఐదుగురు భారతీయులు, నలుగురు రష్యన్లు, ఇద్దరు కొరియన్లతో పాటు ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, అర్జెంటీనా, ఇజ్రాయెల్ నుంచి ఒక్కొక్కరున్నారు. యతి ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ 9ఎన్–ఏఎన్‌సీ ఏటీఆర్–72 విమానం 15 ఏళ్ల నాటిదట. ఇందులోని ట్రాన్స్‌పాండర్ తదితరాలన్నీ మరీ పాతవని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 పేర్కొంది. ప్రమాద ప్రాంతంలో సోమవారం బ్లాక్ బాక్స్ దొరికింది. దాన్ని విశ్లేషించాకే ప్రమాద కారణం తెలిసే అవకాశముంది.

ఇళ్లమీద పడేది...!

విమాన కుప్పకూలిన చోటికి కూతవేటు దూరంలోనే పలు నివాస గృహాలున్నాయి. ప్రమాద ధాటికి విమానం రెక్కలు తమ ఇంటికి 12 మీటర్ల సమీపం దాకా దూసుకొచ్చాయని గీతా సునార్ అనే మహిళ తెలిపింది. విమానం నేలను సమీపిస్తుండగా అందులోని ప్రయాణికుల హాహాకారాలు స్పష్టంగా విన్పించాయని సమీపంలో ఆడుకోవడానికి వెళ్లిన పిల్లలు చెప్పారు.

భర్త బాటలోనే...

విమాన ప్రమాదంలో కో పైలట్ అంజూ ఖతీవాడా కూడా మరణించినట్టు భావిస్తున్నారు. ఆమె మృతదేహం ఇంకా దొరకాల్సి ఉంది. అంజూ భర్త పైలట్ దీపక్ పోఖ్రియాల్ కూడా విమాన ప్రమాదంలోనే మరణించారు! 16 ఏళ్ల కింద ఆయన నడుపుతున్న యతి ఎయిర్‌లైన్స్ విమానం ప్రమాదానికి గురై మరణించారు! అయినా వెరవక భర్త తాలూకు బీమా మొత్తంతో అమెరికాలో ఏవియేషన్ కోర్సు చేసి అంజూ కో పైలట్ అయింది. ఆదివారం నాటి ప్రయాణం ముగిస్తే ఆమె పైలట్‌గా పదోన్నతి పొందేది!

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి...

విమాన ప్రమాదంలో మరణించిన ఐదుగురు భారతీయులూ యూపీకి చెందినవారే. వీరిలో సోను జైస్వాల్ (35)కు ఇద్దరు ఆడపిల్లలే కావడంతో అబ్బాయి పుడితే నేపాల్లోని పశుపతినాథ్‌ను సందర్శిస్తానని మొక్కుకున్నాడు. అబ్బాయి పుట్టడంతో ముగ్గురు మిత్రులతో కలిసి మొక్కు తీర్చుకున్నాడు. తర్వాత పారా గ్లైడింగ్ కోసం కఠ్మాండు నుంచి బస్సులో పొఖారా వెళ్లాలనుకున్నారు. చివరి క్షణాల్లో ప్లాన్ మార్చుకుని విమానమెక్కి నలుగురూ మృత్యు ఒడిని చేరారు. ఇక ఐదో భారతీయున్ని సంజయ్ జైస్వాల్‌గా గుర్తించారు.

ఆర్‌వీఎంలకు ఒప్పుకోం

ఈసీ భేటీలో ప్రతిపక్షాల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రిమోట్ ఓటింగ్ మెషీన్(ఆర్‌వీఎం)లను అందుబాటులోకి తేవాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. వీటి అవసరమేమిటో ముందు తేలాలని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. 'ఆర్‌వీఎంలను మేం అంగీకరించం. ముందుగా ఈ అంశంపై అందరం ఏకాభిప్రాయానికి రావాలి. ఆ తర్వాతే ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటాం' అని మీడియాకు చెప్పారు. ఎన్నికల పట్ల పట్టణ ఓటర్ల నిరాసక్తతకు పరిష్కారం కనుగొనాలని ఈసీని కోరారు. వివిధ కారణాలతో పరాయి రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు దూరంగా ఉండే పోలింగ్ బూత్‌లో వేసిన ఓటు ఆర్‌వీఎం ద్వారా సొంత నియోజకవర్గంలో అభ్యర్థులకు పడుతుంది. ఆర్‌వీఎంల పనితీరు వివరించేందుకు ఆదివారం 8 జాతీయపార్టీలు, గుర్తింపు పొందిన 57 పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసింది. అన్ని జాతీయ పార్టీలతోపాటు 40 వరకు ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారని ఈసీ తెలిపింది. అంతకుముందు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష నేతలు సమావేశమై ఆర్‌వీఎంలను వ్యతిరేకించాలని నిర్ణయించాయి. ప్రభుత్వ రంగ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆర్‌వీఎంలను రూపొందించింది. ఒక్కో ఆర్‌వీఎం 72 నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. ఇంటర్నెట్‌తో అవసరం లేకుండానే ఇది పనిచేస్తుంది.

ఫిబ్రవరి 28 వరకు గడువు పెంపు

ఏకాభిప్రాయం వచ్చే వరకు ఆర్‌వీఎంలపై పనితీరు రాజకీయ పార్టీలతో సమావేశం ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. అంతేకాకుండా, ఆర్‌వీఎంలపై చట్ట పరమైన, పరిపాలన సంబంధం అంశాలపై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తెలిపేందుకు జనవరి 31వ తేదీ వరకు ఉన్న గడువును ఫిబ్రవరి 28 వరకు పొడిగించినట్లు పేర్కొన్నాయి. ఆర్‌వీఎంలను తీసుకొచ్చే విషయంలో చట్టపరంగా చేపట్టాల్సిన చర్యలు, మార్పులు చేర్పులపై అభిప్రాయాలను రాత పూర్వకంగా వెల్లడించాలని రాజకీయ పక్షాలను ఈసీ కోరుతోంది.

కొలీజియం కాక

కేంద్రం, న్యాయ వ్యవస్థ మధ్య ముదురుతున్న వివాదం



సుప్రీంకోర్టు కొలీజియం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ నడుమ వివాదంగా మారిన అంశం. కొలీజియం వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకం, బదిలీల్లో తమ పాత్ర లేకపోవడం ఏమిటంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కొలీజియం వ్యవస్థే రాజ్యాంగ విరుద్ధమంటూ పలువురు కేంద్ర మంత్రులు బాహాటంగా గళం విప్పుతున్నారు. కొలీజియం సభ్యులేమో సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకానికి తాము సిఫార్సులు మాత్రమే చేస్తామని, తుది నిర్ణయం కేంద్రానిదేనని అంటున్నారు.

ఏమిటీ కొలీజియం...?

సుప్రీంకోర్టు న్యాయమూర్తుతో పాటు దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల నియామకం, బదిలీలను సిఫార్సు చేయడానికి ఉద్దేశించినదే కొలీజియం వ్యవస్థ. సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి, మరో నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. న్యాయమూర్తుల నియామకం, బదిలీల విషయంలో కొలీజియంలో భిన్నాభిప్రాయాలు ఉంటే మెజార్టీ సభ్యులదే తుది నిర్ణయం. అయితే ప్రధాన న్యాయమూర్తిని తప్పనిసరిగా సంప్రదించి, ఆయన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కొలీజియం తన సిఫార్సులను కేంద్రానికి పంపుతుంది. ఇక హైకోర్టు కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులు సభ్యులు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు పంపుతుంది. ముఖ్యమంత్రి వాటిని కేంద్ర న్యాయ శాఖ మంత్రికి పంపిస్తారు. వాస్తవానికి రాజ్యాంగంలో కొలీజియం ప్రస్తావన లేదు. కొలీజియం చేసే సిఫార్సులపై కేంద్రం తన విచక్షణ మేరకు నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఒకే పేరును కొలీజియం రెండోసారి సిఫార్సు చేస్తే కేంద్రం ఆమోదించాల్సిందేనంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో తీర్పు వెలువరించింది.

రాజ్యాంగం ఏం చెబుతోంది?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీంకోర్టు జడ్జిలను రాష్ట్రపతి నియమించాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే సీజేఐ మినహా మిగతా నియామకాల్లో సీజేఐ అభిప్రాయం తెలుసుకోవాలి. ఆర్టికల్ 217 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో సీజేఐ, గవర్నర్, హైకోర్టు సీజేలను సంప్రదించాలి.

ఏమిటీ వివాదం?

1950 నుంచి 1973 వరకూ కేంద్రం, సీజేఐ కలిసి చర్చించుకుని ఏకాభిప్రాయంతో న్యాయమూర్తులను నియమించే విధానముండేది. సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిని సీజేఐగా నియమించడం ఆనవాయితీగా కొనసాగింది. 1973లో మాత్రం ముగ్గురు సీనియర్లను పక్కన పెట్టి జస్టిస్ ఎ.ఎన్.రేను సీజేఐగా అప్పటి ప్రభుత్వం నియమించింది. తర్వాత మరో సీజేఐ నియామకంలోనూ ఇలాగే జరగడం కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య వివాదానికి దారితీసింది. న్యాయమూర్తుల నియామకంలో కార్యనిర్వాహక వ్యవస్థ కంటే న్యాయ వ్యవస్థకే ఎక్కువ అధికారాలుంటాయని ఫస్ట్ జడ్జెస్ కేసు (1981), సెకండ్ జడ్జెస్ కేసు (1993), థర్డ్ జడ్జెస్ కేసు (1998)ల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఎలా ఏర్పాటైంది?

పార్లమెంట్ చట్టంగానీ, రాజ్యాంగ విధివిధానాలు గానీ లేకుండానే మన దేశంలో 1993లో కొలీజియం వ్యవస్థ మొదలైంది. న్యాయమూర్తుల నియామకంలో ఆర్టికల్ 124(2)లో ఉన్న 'సంప్రదింపుల అనంతరం' అర్థాన్ని 'సమ్మతించిన తర్వాత'గా మారుస్తూ తొమ్మిది మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. తద్వారా న్యాయమూర్తుల నియామకం, బదిలీల అధికారం సీజేఐ నేతృత్వంలోని వ్యవస్థ అయిన కొలీజియానికి దక్కింది.

ప్రత్యామ్నాయముందా?

కొలీజియంకు ప్రత్యామ్నాయంగా నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్(ఎన్‌జేఏసీ)ని కేంద్రం తెరపైకి తెచ్చింది. ఇది స్వతంత్ర కమిషన్.దీనికి సీజేఐ చైర్‌పర్సన్‌గా ఉంటారు. మరో ఇద్దరు అత్యంత సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర న్యాయ మంత్రి ఎక్స్–ఆఫీషియో సభ్యులుగా ఉంటారు. పౌర సమాజం నుంచి ఇద్దరు ప్రముఖులను సభ్యులుగా సీజేఐ, ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ నామినేట్ చేయాలి. ఈ ఇద్దరిలో కనీసం ఒకరు ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మైనార్టీ లేదా మహిళ అయి ఉండాలి. రాజ్యాంగ (99వ సవరణ) చట్టం–2014, నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్స్‌మెంట్ కమిషన్ చట్టం (2014) ద్వారా ఎన్‌ఏజేసీని కేంద్రం ప్రతిపాదించింది. సంబంధిత బిల్లులు 2014లోనే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. కానీ ఈ బిల్లుల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌జేఏసీని కోర్టు కొట్టేసింది. అయితే న్యాయమూర్తుల ఎంపికకు కొలీజియం స్థానంలో కేంద్రం మరో వ్యవస్థను తీసుకొస్తే అభ్యంతరం లేదని ఇటీవలే స్పష్టం చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కొలీజియంలో ప్రభుత్వ నామినీలు

సీజేఐకి కేంద్ర న్యాయ మంత్రి రిజిజు లేఖ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌లు, జడ్జిలను నియమించే కొలీజియం వ్యవస్థలో ప్రభుత్వం నామినేట్ చేసేవారికి సైతం చోటుండాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు పునరుద్ఘాటించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఆయన తాజాగా లేఖ రాశారు. ''జడ్జిల నియామకంలో పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రజలకు తెలియజేయడం అవసరం. అందుకే న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలి'' అని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కొలీజియం వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని కిరణ్ రిజిజు ఇటీవల విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య భారీగా పెరిగిపోవడానికి కొలీజియమే కారణమని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీజేఐకి ఆయన లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

న్యాయ వ్యవస్థకు విషగుళిక: జైరామ్ రమేశ్


న్యాయ వ్యవస్థను పూర్తిగా ఆక్రమించుకొనేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సోమవారం ఆక్షేపించారు. న్యాయ వ్యవస్థను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. సీజేఐకి రిజిజు లేఖను తప్పు పట్టారు. మంత్రి సూచన న్యాయ వ్యవస్థకు విషగుళిక అన్నారు. అయితే కొలీజియంలో సంస్కరణలు అవసరమేనని జైరాం అభిప్రాయపడ్డారు.



స్వర్ణముఖి చెంతన ఏటి పండుగ కోలాహలం

ఏటా కనుమ రోజున నిర్వహించే ఏటి పండుగ సంబరం తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో సోమవారం కోలాహలంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే సంబరాల్లో మొదటి రోజు స్వర్ణముఖి నదీతీరాన సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలసి ఈ వేడుకను అత్యంత వైభవంగా ప్రారంభించారు. పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అనేక మంది నది వద్దకు చేరుకుని ఆహ్లాదకర వాతావరణంలో పండుగ జరుపుకున్నారు. చిన్ననాటి స్నేహితులు, కొత్తగా పెళ్లైన జంటలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సందడి చేశారు. అనేక మంది మహిళలు మట్టితో చేసిన గొబ్బెమ్మల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వర్ణముఖి నదిలో నిమజ్జనం చేశారు. స్వర్ణముఖి నదిలో నీరు ప్రవహిస్తుండటంతో అనేక మంది నదిలో జలకాలాడారు. ఈ వేడుకల్లో ముస్లింలు సైతం పాల్గొన్నారు.. ఏటి పండుగ సంబరాలు మరో రెండు రోజులు నిర్వహించనున్నారు. ఏటి పండుగ వేడుకలకు బుల్లి తెర నటీనటులు, ప్రముఖ యాంకర్లు తరలివచ్చారు.

– నాయుడుపేట టౌన్



రమేష్‌బాబు

గుండుసూదిపై బంగారు నాగలి

కాకినాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు ఆరిపాక రమేష్‌బాబు సంక్రాంతి సందర్భంగా 30మిల్లీగ్రాముల బంగారంతో నాగలి తయారు చేశారు. నాలుగు మిల్లీమీటర్ల పొడవు, మూడు మిల్లీమీటర్ల ఎత్తున ఈ బంగారు నాగలిని రూపొందించి గుండుసూది తలపై అమర్చారు. ఇది మైక్రోస్కోప్‌లో మాత్రమే కనిపిస్తుంది. పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఈ నాగలిని రూపొందించానని రమేష్ తెలిపారు.

– బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ)



పోటాపోటీ.. ఎడ్ల పందేలకు లేదు సాటి

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.

- కొత్తపట్నం

అంబరాన్నంటిన ప్రభల సంబరం

- జగ్గన్నతోట తీర్థానికి నాలుగున్నర శతాబ్దాల చరిత్ర
- పొలాలు, కాలువలు దాటి భక్తులను పరవశింపజేసిన ఏకాదశరుద్రులు
- 52 అడుగుల ఎత్తున వాకలగరువు, తొండవరం ప్రభలు



పి.గన్నవరం మండలం కుందాలపల్లిలో పంట కాలువ దాటిస్తున్న ప్రభలు

సాక్షి అమలాపురం: సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపంగా నిలిచే ప్రభల తీర్థాలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అంబరాన్ని తాకాయి. రెండేళ్లుగా కరోనా ఆంక్షల కారణంగా పెద్దగా రాని జనం ఈసారి తీర్థాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జాతీయస్థాయిలో పేరొందిన అంబాజీపేట మండలం జగ్గన్నతోటతోపాటు, కొత్తపేట, మామిడికుదురు మండలం కొర్లగుంట, కాట్రేనికోన మండలం చెయ్యేరుల్లో ప్రభల తీర్థాలు సోమవారం ఘనంగా జరిగాయి. పెద్దపండుగ సంక్రాంతి నాడు కొత్తపేటలో ఆరంభమైన తీర్థాలు ముక్కనుమ వరకు జరుగుతాయనే విషయం తెలిసిందే. నాలుగున్నర శతాబ్దాల చరిత్ర ఉన్న జగ్గన్నతోట తీర్థం కనులపండువగా జరిగింది. ఏకాదశరుద్రులు (11 ప్రభలు) పంట పొలాలు, కాలువలు దాటి వచ్చి భక్తులను పరవశింపచేశాయి. గత ఏడాది ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించడం, ఈ నెలలో ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ శకటంపై జగ్గన్నతోట ప్రభల ప్రతిరూపం ఉంచేందుకు ఎంపిక కావడం ఈ తీర్థానికి మరింత వన్నెతెచ్చింది. మధ్యాహ్నం వరకు పలుచగా ఉన్న భక్తులు తరువాత తండోపతండాలుగా వచ్చారు. ఈ తీర్థానికి ఎన్‌ఆర్‌ఐలు, వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న స్థానికులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారి మిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ తీర్థానికి 50 వేలమందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. గూడు ఎడ్లబండ్లపై భక్తులు కుటుంబాలతో కలసి తరలివచ్చారు. ఇదే మండలంలో వాకలగరువు సరిహద్దులో జరిగిన ప్రభల తీర్థంలో వాకలగరువుకు చెందిన ఉమాసర్వేశ్వరస్వామి ప్రభ, తొండవరం ఉమాతొండేశ్వరస్వామి ప్రభ 52 అడుగుల ఎత్తున నిర్మించారు. ఈ ప్రభలు ఇక్కడ తీర్థాల్లో అతి ఎత్తయినవిగా గుర్తింపు పొందాయి. వీటితో పాటు మామిడికుదురు మండలం కొర్లగుంటలో 12 ప్రభలు తరలివచ్చాయి. కొత్తపేటలో సంక్రాంతి రోజు ఆదివారం బాణసంచా కాల్పులను చూసేందుకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. వీటితోపాటు కాట్రేనికోన, పి.గన్నవరం, ఆత్రేయపురం, అమలాపురం, ముమ్మిడివరం, మలికిపురం మండలాలతో పాటు జిల్లావ్యాప్తంగా 60 గ్రామాల్లో ప్రభల తీర్థాలు జరిగాయి. మూడురోజుల పండగతో కోనసీమలో సందడి నెలకొంది. ఈ ఏడాది కోనసీమలో గుండాట, అశ్లీల నృత్యాలు లేకపోవడంతో స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కుటుంబసభ్యులతో పండగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకొన్నారు.



జన సంద్రంగా మారిన జగ్గన్నతోట ప్రభల తీర్థం

ఉత్సాహంగా... ఉల్లాసంగా...

భోగి నుంచి కనుమ వరకు సంక్రాంతి వేడుకలు

ఆహ్లాదకర వాతావరణంలో మూడురోజులు

- రాష్ట్రవ్యాప్తంగా జాతరలా కోడిపందేలు
- బరులవద్ద డిజిటల్ స్క్రీన్లు
- సోషల్ మీడియాలో లైవ్
- వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు
- ఎంట్రీఫీజు వసూలుకు క్యూఆర్ కోడ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్రాంతి పండుగ వేడుకలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను శని, ఆది, సోమవారాల్లో వేడుకగా జరుపుకొన్నారు. అన్ని ఇళ్లకు బంధుమిత్రుల రాకతో గ్రామాలు కళకళలాడాయి. భోగిమంటలతో మొదలుపెట్టి పశువుల పండుగతో సంక్రాంతి వేడుకలు ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ పండుగలో ప్రధాన ఆకర్షణ అయిన కోడిపందేలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచే బరుల వద్దకు చేరుకున్న పోలీసులు ఇక ఆట చాలు.. అని నిర్వాహకులను అప్రమత్తం చేశారు. దీంతో అన్ని బరుల్లోను చీకటి పడేసరికి కోడిపందేలను నిలిపేసి సర్దుకున్నారు. మూడురోజులు కోడిపందేల జాతరలో మునిగితేలిన జనం తిరుగుముఖం పట్టారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఊరువాడా పెద్ద ఎత్తున కోడిపందేల జాతర సాగింది. రాష్ట్రంలో మరి కొన్ని ప్రాంతాల్లోను కోడిపందేలు నిర్వహించారు.



కృష్ణా జిల్లా ఈడుపుగల్లులో కోడిపందేలను తిలకించేందుకు వచ్చిన జనం

ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణాజిల్లాలో కోడిపందేల బరుల వద్ద ఈసారి పెద్ద ఎత్తున డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేసి లైవ్ ఇచ్చారు. సోషల్ మీడియాలోను లైవ్ ఇచ్చి ఆన్‌లైన్ పందేలను ప్రోత్సహించారు. వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు ఏర్పాటుచేసి ఎంట్రీ ఫీజు పెట్టారు. కోడిపందేల్లో పాల్గొనాలంటే తగిన రుసుము చెల్లిస్తేనే ఎంట్రీ ఇచ్చేలా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లింపుల ఏర్పాటు చేశారు. కోడిపందేల బరులవద్ద నిర్వాహకులు ప్రైవేటు బౌన్సర్లతో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. దాదాపు అన్ని బరులవద్ద నిర్వాహకులు ప్రత్యేకంగా కమిటీలు వేసి చెర్నాకోలా, వసిక్రర, చేతికర్రలతో ఘర్షణలు, వాగ్వాదాలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. పలుప్రాంతాల్లో వీఐపీలకు ఏర్పాట్లు కోసం కార్వాన్‌లు, ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేయడం విశేషం. కోడిపందేలతోపాటు పేకాట, గుండాట సైతం పెద్ద ఎత్తున సాగాయి. బరుల వద్ద ఏర్పాటు చేసిన మాంసాహార స్టాల్స్, తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ షాపులకు సైతం అనుమతి పేరుతో నిర్వాహకులు నగదు వసూలు చేశారు. బరుల వద్ద కారు పార్కింగ్‌కు రూ.వంద నుంచి రూ.250, బైక్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేశారు. అత్యధిక పందేల్లో విజయం సాధించిన వారికి కార్లు, బైక్‌లు వంటి అనేక బహుమతులు అందించి ప్రోత్సహించారు. వివాదాలు జరిగిన చోట పోలీసులు కేసులు నమోదు చేశారు.

తిరుగుముఖం పట్టిన అతిథులు



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద బారులుదీరిన కార్లు

సంక్రాంతి మూడురోజులపాటు సినిమా తారలతోపాటు సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు సామాన్య జనంతో మమేకమై కోడిపందేలు చూసి ఆనందించారు. ఏపీలోని బంధుమిత్రుల ఆహ్వానం అందుకుని తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసారి కేరళ నుంచి కూడా పలు కుటుంబాలవారు కోడిపందేలు, సంక్రాంతి సంబరాలు తిలకించేందుకు వచ్చారు. సంక్రాంతి కోసం ఎన్‌ఆర్‌ఐలు సైతం తమ స్వగ్రామాలకు వచ్చి అయినవారి మధ్య సంక్రాంతి సందడి చేశారు. మూడురోజుల వేడుకలు ముగియడంతో వారంతా సోమవారం సాయంత్రం నుంచి తిరుగుముఖం పట్టారు. ఏపీలోని తమ వారి అతిథి మర్యాదలను మదినిండా నింపుకొని వెళ్లలేక.. ఉండలేక.. వచ్చే సంక్రాంతికి వస్తామంటూ శెలవు తీసుకున్నారు.

టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

కంచికచర్ల(నందిగామ): తెలుగు పండుగ సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకున్న వారంతా సోమవారం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర స్వర్ణటోల్ ప్లాజా వద్ద కార్లు, బస్సులు, ఇతర వాహనాలు బారులు తీరాయి. రోజూ ఆరు వేల కార్లు రాకపోకలు సాగిస్తుంటాయని, సోమవారం ఒక్క రోజే పది వేల కార్లు హైదరాబాద్ వైపు వెళ్లాయని టోల్‌ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు. ఫాస్టాగ్ విధానం వల్ల టోల్‌ప్లాజా వద్ద వాహనాలు మూడు సెకన్లకు మించి సమయం ఆగకుండా వెళ్తున్నాయని చెప్పారు.

కోలాహలంగా పశువుల పండుగ



పోట్ల గిత్తలను పట్టుకునేందుకు పోటీ పడుతున్న యువకులు

చంద్రగిరి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం కనుమ పండుగను తిరుపతి జిల్లా ఎ.రంగంపేట గ్రామంలో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల కొమ్ములకు రంగులువేసి నల్లరంగు పట్టాను నడుముకు కట్టి అందంగా ముస్తాబు చేశారు. పశువుల కొమ్ములకు పలకలను కట్టి పందేలకు సిద్ధం చేశారు. జిల్లాలోనే ఎడ్లపందేల (జల్లికట్టు)కు అత్యంత ప్రాధాన్యత ఉన్న గ్రామం రంగంపేట. ఈ గ్రామంలో జల్లికట్టును వీక్షించడానికి జిల్లా నలుమూలల నుంచేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. గ్రామం ఇసుకవేస్తే రాలనంతగా జనంతో నిండిపోయింది. మహిళలు మేడలు, మిద్దెలు ఎక్కి ఆసక్తిగా జల్లికట్టును వీక్షించారు. పౌరుషంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. ఎద్దులకు కట్టిన పలకలను సొంతం చేసుకునేందుకు పోటీపడ్డారు. ఎద్దుకు కట్టిన పలకలను సొంతం చేసుకున్న యువకులను ఆ ఏడాది పొడవునా గ్రామ హీరోగా భావిస్తారు. కోడెగిత్తలకు కట్టిన పలకలను సొంతం చేసుకున్న యువకులు విజయగర్వంతో చిందులేశారు. అక్కడక్కడ చెదురుమదురు గొడవలు తప్ప ఎడ్లపందేలు ప్రశాంతంగా ముగిశాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు తిరుపతి రూరల్ ఎంపీపీ మోహిత్‌రెడ్డి ఎ.రంగంపేటలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేసి కొద్దిసేపు పందేలను తిలకించారు.

గోదావరిలో నీటిలభ్యత ఎంత?

శాస్త్రీయంగా అధ్యయనం చేసి తేల్చండి.. సీడబ్ల్యూసీకి గోదావరి బోర్డు ప్రతిపాదన

- ఇప్పటికే ఏడుసార్లు సీడబ్ల్యూసీ అధ్యయనం
- 2019లో 3,334.39 టీఎంసీల లభ్యత ఉన్నట్లు వెల్లడి

సాక్షి, అమరావతి: గోదావరిలో నీటిలభ్యత ఎంత అనేది శాస్త్రీయంగా అధ్యయనం చేసి తేల్చాలని కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) గోదావరి బోర్డు ప్రతిపాదించింది. ఈ నెల 3న జరిగిన 14వ సర్వసభ్య సమావేశంలో 50 ఏళ్ల ప్రవాహాలను ఆధారంగా చేసుకుని నీటిలభ్యతను శాస్త్రీయంగా లెక్కగట్టాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లింది. నీటిలభ్యతను శాస్త్రీయంగా తేలిస్తేనే కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లను పరిశీలించి.. సాంకేతిక అనుమతి కోసం సీడబ్ల్యూసీకి సిఫార్సు చేసే అవకాశం తమకు ఉంటుందని గోదావరి బోర్డు పేర్కొంది. గత నవంబర్ 15న జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి సమావేశంలోను.. గోదావరి బేసిన్ పరిధిలోని రాష్ట్రాల డిమాండ్ మేరకు నీటిలభ్యతను శాస్త్రీయంగా తేల్చాలని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ ఓరాను కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో గోదావరిలో నీటిలభ్యతను శాస్త్రీయంగా తేల్చే ప్రక్రియను ప్రారంభించేందుకు సీడబ్ల్యూసీ సిద్ధమైంది.

వంద లేదా 50 ఏళ్ల ప్రవాహాలను తీసుకుంటేనే..

మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద పురుడుపోసుకునే గోదావరి 1,465 కిలోమీటర్ల పొడవున ప్రవహించి మన రాష్ట్రంలోని అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో 3,12,150 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ నదీపరివాహక ప్రాంతం (బేసిన్) ఉంది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 9.5 శాతంతో సమానం. పరివాహక ప్రాంతంలో ఏడాదికి గరిష్ఠంగా 1,493, కనిష్ఠంగా 877 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. గోదావరి బేసిన్‌ను ఉప పరివాహక ప్రాంతాలు (సబ్ బేసిన్లు)గా విభజించిన సీడబ్ల్యూసీ 2019లో నీటిలభ్యతపై పునఃపరిశీలన చేసింది. 1985–86 నుంచి 2014–15 మధ్య 30 ఏళ్ల వర్షపాతాన్ని, ప్రవాహాలను ఆధారంగా తీసుకుని గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా 3,334.39 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తేల్చింది. దీనిపై పరివాహక ప్రాంతంలోని రాష్ట్రాలు అసంతృప్తి వ్యక్తంచేశాయి. వందేళ్ల లేదా కనీసం 50 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాలను ఆధారంగా చేసుకుని అధ్యయనం చేస్తే శాస్త్రీయంగా ఉంటుందని స్పష్టంచేశాయి. ఈ క్రమంలో తాజాగా చేస్తున్న అధ్యయనంలోనైనా గోదావరిలో నీటిలభ్యతను సీడబ్ల్యూసీ పక్కాగా తేలుస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.



ఎనిమిదోసారి అధ్యయనం

గోదావరి చరిత్రలో నీటిలభ్యతపై సీడబ్ల్యూసీ ప్రస్తుతం చేస్తున్న అధ్యయనం ఎనిమిదోది. స్వాతంత్ర్యానికి పూర్వం 1901–03లో ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్ అధ్యయనం చేసి 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరిలో 3,306.64 టీఎంసీల నీటిలభ్యత ఉందని అంచనా వేసింది. 1962లో కృష్ణా, గోదావరి కమిషన్ నీటిలభ్యతపై అధ్యయనం చేసి.. 75 శాతం లభ్యత ఆధారంగా 3,341.47 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తేల్చింది. దాని ఆధారంగానే పరివాహక ప్రాంతంలోని రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేస్తూ 1980 జూలై 8న బచావత్ ట్రిబ్యునల్ తీర్పిచ్చింది.

గోదావరిలో నీటి లభ్యతపై ఇప్పటివరకు చేసిన అధ్యయనాలు, తేల్చిన నీటిలభ్యత వివరాలు..

సంవత్సరం	అధ్యయనం చేసిన సంస్థ	75% లభ్యత ఆధారంగా తేల్చిన నీటి లభ్యత(టీఎంసీలలో)
1901-03	ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్	3,306.64
1949	ఖోస్లా ఎంపిరియల్ ఫార్ములా	3,554.72
1960	సీడబ్ల్యూ అండ్ పీసీ	3,266.14
1962	కృష్ణా, గోదావరి కమిషన్	3,341.47
1988	సీడబ్ల్యూసీ	3,341.47
1993	సీడబ్ల్యూసీ	3,130.49
2019	సీడబ్ల్యూసీ	3,334.39

చంద్రగిరి ప్రజలకు 'చెవిరెడ్డి' సంక్రాంతి కానుక

- 1.60 లక్షల కుటుంబాలకు బట్టలు పంపిణీ
- కుటుంబం కంటే ఎక్కువగా తన ప్రజలను ప్రేమించడం చెవిరెడ్డికే సాధ్యం: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- జగనన్న స్ఫూర్తితో ప్రజలందరికీ కానుకలు: చెవిరెడ్డి



సంక్రాంతి కానుక అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి (తిరుపతి): తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్, తిరుపతి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంక్రాంతి కానుకను అందించారు. నియోజకవర్గంలో మొత్తం 1.60 లక్షల కుటుంబాలకు సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో ఇంటింటికీ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి చంద్రగిరిలో కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా కానుకలు పంపిస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తన నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తయారు చేస్తూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించే చెవిరెడ్డికి భగవంతుని ఆశీస్సులు నిత్యం కలగాలని ఆకాంక్షించారు. ఆపద వచ్చినా, ఆనందం కలిగినా తన నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లాంటి ఎమ్మెల్యే దొరకడం చంద్రగిరి ప్రజల అదృష్టమని సుబ్బారెడ్డి ప్రశంసించారు. తన కుటుంబ సభ్యుల కంటే గొప్పగా నియోజకవర్గ ప్రజలను ప్రేమించడం ఆయనకు మాత్రమే సాధ్యమన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పండుగ జరుపుకోలేని పేదలకు అన్నీ తానై సంతోషాన్ని పంచే చెవిరెడ్డి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో శానిటైజర్లు, మాస్కులు, పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు, విటమిన్ టాబ్లెట్లు, మల్టీ విటమిన్ సిరప్‌లు, హోమియో మందులు, ఆయుర్వేద మందులు, ఆనందయ్య మందు, యోగా, ప్రాణాయామం పుస్తకాలు, ఆస్పత్రులకు ఆక్సిజన్ సిలిండర్లు పంపిణీ చేశారు.

అదే ఆత్మసంతృప్తి: చెవిరెడ్డి

నా సంపాదనలో 70 శాతం చంద్రగిరి నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నాను.. అదే నాకు ఆత్మ సంతృప్తి కలిగిస్తోంది అని చెవిరెడ్డి పేర్కొన్నారు. కష్టాలు వచ్చినపుడు మాత్రమే కాదు ఆనందంలో కూడా భాగస్వామిని కావాలని కానుకలు పంపుతున్నానని వెల్లడించారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరికీ మంచి చేయాలన్న ముఖ్యమంత్రి జగనన్న స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరికీ కానుకలు అందిస్తున్నట్లు చెవిరెడ్డి తెలిపారు.



కర్నూలులోని 10వ వార్డులో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

క్లుప్తంగా...

మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

- కాన్వాయ్‌లోని రెండో వాహనాన్ని ఢీకొట్టిన కారు
- ఆరుగురికి స్వల్ప గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

రాయచోటి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌కి ప్రమాదం తప్పింది. అన్నమయ్య జిల్లా రాయచోటి రింగురోడ్డు చెన్నముక్కపల్లి వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో కాన్వాయ్‌లోని రెండో వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సెక్యూరిటీ సిబ్బంది సహా ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పండుగ సందర్భంగా పీలేరు నుంచి రాయచోటి మీదుగా వీరబల్లి మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిలు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలు ముందు వాహనంలో వెళ్తుండగా.. వెనుక ఎంపీ వాహనంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. ప్రమాద ఘటనపై రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. గాయపడిన వారిని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. కాగా గాయపడి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గన్‌మెన్లు, సిబ్బందిని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు.

అంబులెన్స్‌కు దారివ్వని 'చంద్రబాబు'



ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108అంబులెన్స్

చంద్రగిరి/భాకరాపేట(తిరుపతి జిల్లా): టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ నాయకులు దారి ఇవ్వకపోవడంతో ఓ అంబులెన్స్ వాహనాల మధ్యలో నిలిచిపోయింది. సోమవారం నారావారిపల్లె నుంచి పీలేరుకు వెళ్తూ.. చంద్రబాబు భాకరాపేటకు చేరుకున్నారు. అదే సమయంలో 108 అంబులెన్స్ పీలేరు వైపు నుంచి తిరుపతి వెళ్తోంది. చంద్రబాబుతో పాటు ఆయన వెంట వచ్చిన టీడీపీ నాయకుల వాహనాలు, కార్యకర్తలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో.. అంబులెన్స్ పైలట్ సైరన్ మోగించి దారి ఇవ్వాలని కోరాడు. అయినా కూడా టీడీపీ నాయకులు అడ్డు తొలగలేదు. దీంతో అంబులెన్స్ పైలట్ కిందకు దిగి.. రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని.. అడ్డు తొలగాలని వేడుకున్నాడు. అయినా వారు పట్టించుకోలేదు. ఇంతలో ఈ పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడకు చేరుకుని.. వాహనాలను జరిపించి.. అంబులెన్స్‌ను ముందుకు పంపించారు. టీడీపీ నాయకుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాగాలమ్మకు పూజలు

సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉదయం నారా, నందమూరి కుటుంబసభ్యులు చంద్రగిరిలోని నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చంద్రబాబు తల్లిదండ్రులు అమ్మణమ్మ, ఖర్జూరనాయుడుల సమాధుల వద్ద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ తెలంగాణ హైకోర్టుకు బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దుపిటిషన్‌ను సుప్రీంకోర్టు.. తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది. మెరిట్స్‌పై విచారించి బెయిల్ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించి రిజర్వు చేసిన తీర్పును జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ సి.టి.రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం వెలువరించింది. కేసు విచారణను కడపలోని సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి హైదరాబాద్ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేసిన నేపథ్యంలో గంగిరెడ్డి బెయిల్ రద్దుపిటిషన్‌ను కూడా ఏపీ హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్టు తెలిపింది.

ఇక 'పీఏసీఎస్' పెట్రోల్ బంకులు

తొలిదశలో 96 పీఏసీఎస్‌ల్లో ఏర్పాటుకు సన్నాహాలు

- ముందుకొచ్చిన హెచ్‌పీసీఎల్ ఆయిల్ కంపెనీ
- పైలట్ ప్రాజెక్టుగా మూడు పీఏసీఎస్‌లలో ఏర్పాటు
- ఉగాది కల్లా మిగిలిన పీఏసీఎస్‌ల పరిధిలో ఏర్పాటుకు కసరత్తు

సాక్షి, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఆర్థిక పరిపుష్టిపై దృష్టి సారించాయి. ఇప్పటి వరకు రైతులకు వ్యవసాయ ఆర్థిక అవసరాలు తీర్చడంతో పాటు వివిధ రకాల వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. మొదటి సారి ఇంధన రంగంలోకి ప్రవేశించాయి. సహకార పెట్రోలు బంకులు ఏర్పాటు చేసి తమ ఆర్థిక పరపతిని పెంచుకునే దిశగా అడుగులేస్తున్నాయి.



ఏలూరు జిల్లా కే.జగ్గవరం, ముల్లకుంటలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు

ఒక్కో బంకు రూ.25లక్షలతో ఏర్పాటు

ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు అనుబంధంగా 1,992 పీఏసీఎస్‌లున్నాయి. వాటిలో 1,450 పీఏసీఎస్‌లు లాభాల్లో ఉన్నాయి. మిగిలిన వాటిని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు ఆప్కాబ్ చేయూత నిస్తోంది. బహుళ సేవా కేంద్రాలు (ఎంఎస్‌సీ)గా వీటిని తీర్చిదిద్దేందుకు ఆప్కాబ్ చర్యలు చేపట్టింది. స్థలాలు అందుబాటులో ఉండి స్థానికంగా ఫీజుబులిటీ కలిగిన పీఏసీఎస్‌ల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో బంకు రూ.25లక్షల అంచనాతో ఏర్పాటు చేస్తున్నారు. స్థలాలు చూపిస్తే చాలు ఫీజుబులిటీ రిపోర్టు ఆధారంగా పైసా ఖర్చు లేకుండా పీఏసీఎస్‌లకు డీలర్‌షిప్‌లు మంజూరు చేసేందుకు హెచ్‌పీసీఎల్ ముందు కొచ్చింది. బంకు నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ హెచ్‌పీసీఎల్ సమకూర్చనుంది. నిర్వహణ బాధ్యతలను పీఏసీఎస్‌లకు అప్పగిస్తారు. నిర్వహణ ఖర్చులు పోనూ నెలకు రూ.లక్షకు పైగా మిగులుతుందని అంచనా వేస్తున్నారు.

బంకుల ఏర్పాటుకు అనువుగా 96 పీఏసీఎస్‌లు

తొలిదశలో బంకుల ఏర్పాటుకు అనువైన స్థలాలున్న 130 పీఏసీఎస్‌లను గుర్తించారు. వాటిలో 96 పీఏసీఎస్‌ల పరిధిలో బంకుల ఏర్పాటుకు ఫీజుబులిటీ ఉందని ఆయిల్ కంపెనీలు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చాయి. వాటిలో ఇప్పటికే 77 పీఏసీఎస్‌లకు ఆయిల్ కంపెనీలు లెటర్ ఆఫ్ ఇంటెంట్స్ జారీ చేశాయి. కాగా 18 పీఏసీఎస్‌ల పరిధిలో బంకుల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక తదితర శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)లు వచ్చాయి. ప్రకాశం జిల్లాలో ఒకటి, ఏలూరు జిల్లా పరిధిలోని కె.జగ్గవరం, ముల్లకుంట పీఏసీఎస్‌ల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయగా, మిగిలిన 15 పీఏసీఎస్‌ల్లో జనవరి నెలాఖరులోగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫీజుబులిటీ ఆధారంగా మిగిలిన పీఏసీఎస్‌ల పరిధిలో బంకుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

లాభాల బాట పట్టించడమే లక్ష్యం

నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌లను లాభాల బాట పట్టించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేశాం. స్థలాలు అందుబాటులో ఉండి, ఫీజుబులిటీ ఉన్న పీఏసీఎస్ పరిధిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనుమతినిస్తాం. బంకులే కాదు..వారు ఏ తరహా వ్యాపారం చేసేందుకు ముందుకొచ్చినా ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఆప్కాబ్ సిద్ధంగా ఉంది.

–ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఎండీ, ఆప్కాబ్

పండుగ పూట.. జైలుకొచ్చా

- పీలేరు సబ్‌జైలులో టీడీపీ నేతలకు చంద్రబాబు పరామర్శ
- పోలీసుల తీరు ఉగ్రవాదులను తలపిస్తోంది

మదనపల్లె: 'పండుగ చేసుకోకుండా కార్యకర్తల కోసం నేను జైలుకు రావాల్సి వచ్చింది. నీ పని, నీ పార్టీ పని అయిపోయింది జగన్‌రెడ్డి' అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చిందులు తొక్కారు. ఫ్లెక్సీల వివాదంలో అరెస్టై సబ్‌జైలులో ఉన్న టీడీపీ నాయకులను పరామర్శించేందుకు సోమవారం ఆయన అన్నమయ్య జిల్లా పీలేరు వచ్చారు. అనంతరం సబ్‌జైలు ఎదుట మీడియాతో మాట్లాడారు. రొంపిచర్ల ఫ్లెక్సీ వివాదంలో అమాయకులపై కేసులు పెట్టారని, రాష్ట్రంలో మైనారిటీలకు మనుగడ లేదని, పోలీసుల తీరు ఉగ్రవాదులను తలపిస్తోందని విమర్శించారు. 'ఎంతమందిని జైలులో పెడతారు? మీరు 60 వేల మంది ఉంటే మాకు 60 లక్షల మంది సైన్యం ఉంది. మమ్మల్ని లోపల పెట్టాలంటే మీ జైళ్లు సరిపోవు. టీడీపీ ఫ్లెక్సీలను చించివేస్తుంటే పోలీసులు గాడిదలు కాస్తున్నారా? ఏకపక్షంగా వ్యవహరిస్తూ మాపైనే కేసులు పెడతారా? మీకు బుద్ధి రాలేదు.. నేను తెప్పిస్తా... మిమ్మల్ని ఎవరినీ వదిలిపెట్టేది లేదు. అరెస్టు చేసిన వ్యక్తులను మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరచకుండా



మభ్యపుచ్చుతున్నారు. పోలీసు వ్యవస్థ భ్రష్టు పట్టింది.. నాశనమైపోయింది. మీ పరువు కాపాడే బాధ్యతను టీడీపీ తీసుకుంటుంది' అని మండిపడ్డారు. మీరు ఎలా తప్పించుకుంటారో చూస్తానంటూ కల్లూరు సీఐ, రొంపిచెర్ల ఎస్ఐనుద్దేశించి బాహాటంగానే హెచ్చరించారు. పుంగనూరు నియోజకవర్గంలో వందల మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయన్నారు. పోలీసుల పహారాలో కోడి పందేలు, పేకాట, గుండాటతోపాటు మహిళలతో క్యాబరే డ్యాన్స్‌లు నిర్వహిస్తూ రాష్ట్రాన్ని గ్యాంబ్లింగ్ సెంటర్‌గా మార్చారని ధ్వజమెత్తారు.

పెద్దిరెడ్డి పని అయిపోయింది..

తనను పీలేరు రాకుండా అడ్డుకోవాలని ప్రయత్నించారని చంద్రబాబు ఆరోపించారు. తప్పుడు కేసులు ఇకపై సహించేది లేదన్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి పని అయిపోయిందని, నీ జెండా పీకేయడానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. ఒక సైకో నియోజకవర్గానికో సైకోని తయారు చేస్తున్నాడంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, సుగుణమ్మ, దొమ్మలపాటి రమేష్, శంకర్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే పుంగనూరులో పోటీ చెయ్

చంద్రబాబుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవాల్

- మా నాయకుడు ఆదేశిస్తే కుప్పం నుంచి పోటీ చేస్తా
- చిత్తూరు జిల్లాలో ఎప్పుడైనా మెజారిటీ సీట్లు సాధించావా?
- 14 ఏళ్ల నీ పాలనలో ప్రజలకు గుర్తుండే ఒక్క మంచిపనైనా చేశావా?

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'చంద్రబాబూ.. నిన్ను సవినయంగా ఆహ్వానిస్తున్నా.. నీకు దమ్ముంటే పుంగనూరు నుంచి పోటీ చెయ్.. పుంగనూరు, కుప్పంలో ఎక్కడి నుంచి పోటీ చేసినా నిన్ను ఓడించి తీరుతాం. మా నాయకుడు ఆదేశిస్తే నేను రెండు చోట్లా పోటీకి సిద్ధమే' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవాల్ విసిరారు. సోమవారం తిరుపతిలో ఆయన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలుగువారు ఎంతో పవిత్రంగా, ఘనంగా నిర్వహించే సంక్రాంతి పండుగకు సొంతూరు వచ్చిన చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

జగన్‌ను, తనను గుర్తు చేసుకుంటూ తమపై పడి ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. మంత్రి పెద్దిరెడ్డి ఇంకా ఏమన్నారంటే..

ఒక్క మంచి పని చేశావా?

- నీ హయాంలో చిత్తూరు జిల్లాలో ఏనాడైనా మెజారిటీ సీట్లు సాధించావా చంద్రబాబూ? జిల్లా ప్రజలు చెప్పుకోవడానికి ఒక్క మేలైనా చేశావా? మీ పార్టీ కార్యకర్తలను గూండాలుగా మార్చి రెచ్చగొట్టే నీచానికి దిగావు. చివరికి న్యాయమూర్తులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కుటిల నైజాన్ని చాటుకున్నావు. సీఎం జగన్ కుప్పానికి ఎంతో మేలు చేశారు. మున్సిపాల్టీ, రెవెన్యూ డివిజన్ చేసిన విషయం గుర్తులేదా? 20 వేల మందికి ఉచితంగా ఇంటి స్థలాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇస్తున్నారు.
- 'నేను నిన్ననే చెప్పా.. చంద్రబాబూ నీ పని అయిపోయింది. కుప్పంలో కూడా నీ జెండా పీకేసి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తాం. అక్కడ కూడా మా అభ్యర్థే గెలుస్తారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఇంత ఆరాట పడాల్సిన పనిలేదు. ఇప్పటికే ఆయన గాడి తప్పారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి తన కుటుంబం కోసం మినహా ప్రజల కోసం ఎప్పుడూ పనిచేయలేదు. చివరికి సొంత మామకు కూడా వెన్నుపోటు పొడిచాడు. అలాంటి ప్రజా కంటకుడు మా గురించి మాట్లాడటం విడ్డూరం.
- హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో నాడు విద్యుత్తు కోసం పోరాడిన రైతులను కాల్చి చంపింది ఎవరు? అంగన్‌వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించింది ఎవరు? ప్రజాస్వామ్యం, మంచి పాలన గురించి చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటు. చంద్రబాబుకు వయసు మళ్లి, అల్జీమర్స్‌తో మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది.

బాబు చేతిలో మండలి మాజీ చైర్మన్‌కు ఘోర అవమానం

- ముస్లిం నేతల పరామర్శలో అహ్మద్ షరీఫ్‌కు దక్కని గౌరవం
- పీలేరు సబ్ జైలు బయట పలకరించి లోపలకు తీసుకెళ్లని చంద్రబాబు
- బయటకు వచ్చిన తర్వాతా పట్టించుకోని వైనం
- తీవ్ర మనస్తాపానికి గురైన షరీఫ్
- తమను పిలవడం దేనికంటూ అనుచరుల ఆగ్రహం

మదనపల్లె : ముస్లింలపై చంద్రబాబుది కపట ప్రేమేనని మరోసారి రుజువైంది. చంద్రబాబు సోమవారం అన్నమయ్య జిల్లా పీలేరు సబ్ జైలు వద్ద మైనారిటీ రాష్ట్ర నాయకుడు, శాసన మండలి మాజీ చైర్మన్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పార్టీ క్రమశిక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు కూడా అయిన మహ్మద్ అహ్మద్ షరీఫ్‌ను ఘోరంగా అవమానించారు. సబ్ జైలులో ఉన్న ముస్లిం నేతల పరామర్శకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనారిటీ నాయకులందరూ పెద్ద సంఖ్యలో పీలేరుకు రావాలని టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు కోరడంతో అహ్మద్ షరీఫ్ కూడా సోమవారం గుంటూరు నుంచి అక్కడకు వెళ్లారు. చంద్రబాబు రాక ముందే పీలేరు సబ్ జైలు వద్దకు వచ్చారు. ఇంతలో పోలీసు అధికారులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రమే లోనికి అనుమతిస్తామని చెప్పారు. అందులో షరీఫ్ పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు అసహనం వ్యక్తంచేశారు. అక్కడ ఉన్న టీడీపీ నాయకులు కనీసం పట్టించుకోలేదు. గంట తర్వాత చంద్రబాబు



ముస్లిం యువకుల పరామర్శకు తీసుకెళ్లకపోవడంతో నిరాశగా వెలుపలకు వస్తున్న మండలి మాజీ చైర్మన్ షరీఫ్

వచ్చారు. కార్యకర్తలను పలకరిస్తూ జైలు వద్దకు వెళ్లారు. షరీఫ్‌ను చూసి దగ్గరకు వచ్చి వేలు చూపించి వస్తావా అన్నట్లు సైగ చేశారు. వస్తానని చెప్పి ముందుకు వస్తుంటే.. పట్టించుకోకుండా తన అనుచరగణంతో గబగబా లోపలకు వెళ్లిపోయారు. అక్కడ ఉన్న కార్యకర్తలు ఆయన్ని నెట్టివేయడంతో మనస్తాపానికి గురయ్యారు. సబ్ జైలు నుంచి దూరంగా వెళ్లిపోయారు. ఆయన అనుచరులు టీడీపీ నాయకులను నిలదీసేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించిన టీడీపీ నాయకులు ఆయన్ని అక్కడికి తీసుకొచ్చారు. అరగంట తర్వాత చంద్రబాబు బయటకు వచ్చాక షరీఫ్‌ను ఆయన పక్కన నిల్చోబెట్టారు. బాబు ప్రసంగం తర్వాత మైనారిటీల నాయకుడిగా ఆయనకు మాట్లాడే అవకాశం ఇస్తారని అందరూ భావించారు. ఇక్కడా భంగపాటే ఎదురైంది. ప్రసంగం అవగానే చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలు పట్టనట్లే వెళ్లిపోయారు. దీంతో షరీఫ్ అనుచరులు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. గుంటూరు నుంచి రమ్మని టెలీకాన్ఫరెన్స్‌లో ఆహ్వానించి, తీరా వచ్చాక అవమానించడం దేనికంటూ వాపోయారు. టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, ఇతర మైనారిటీ నాయకులకు కూడా ఇదే భంగపాటు ఎదురైంది.

సీఎం కప్ టోర్నీకి కసరత్తు

ఈనెల 25 నాటికి జిల్లా స్థాయి పోటీలు ముగించేలా ప్రణాళికలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సీఎం కప్ టోర్నీ నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ నెల 25 నాటికి జిల్లా స్థాయి పోటీలను ముగించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం 14 క్రీడాంశాల్లో సుమారు 4 వేల మందికి పైగా క్రీడాకారులు పోటీ పడనున్నారు. వచ్చే నెలలో తిరుపతిలో అన్ని క్రీడాంశాలకు ఒకే చోట ఫైనల్స్ నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. గుంటూరు, తిరుపతి, కాకినాడ, విశాఖ, ఏలూరు, నెల్లూరులో క్రీడాంశాల వారీగా జిల్లా స్థాయి పోటీలకు శాప్ వేదికలను ప్రకటించింది. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, హాకీ, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ విభాగాల్లో ఒక్కో జిల్లా నుంచి 330 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ క్రమంలోనే సీఎం కప్ ఓపెన్ టోర్నీకి జట్లను సిద్ధం చేయాలని ఆయా జిల్లాల క్రీడా ప్రాధికార సంస్థలతో పాటు చీఫ్ కోచ్‌లను శాప్ ఆదేశించింది.

రైతులకు 25 ఏళ్లు ఉచిత విద్యుత్

- ఉచిత విద్యుత్ పథకం వ్యవసాయానికి ఎంతో మేలు
- సెకీ నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు రాష్ట్రం నిర్ణయం
- విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలనే లక్ష్యంతో రానున్న 25ఏళ్లపాటు రైతులకు నమ్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. అదేవిధంగా డాక్టర్ వైఎస్సార్ 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాపై అధికారులతో మంత్రి సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్‌కు కేవలం రూ.2.49 చొప్పున కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. వచ్చే ఏడాది సెప్టెంబరులో మొదటి విడత 3వేల మెగావాట్లు, 2025లో రెండవ విడత 3 వేల మెగావాట్లు, 2026లో మూడో విడత వెయ్యి మెగావాట్లు చొప్పున సెకీ విద్యుత్ సరఫరా చేస్తుందని వివరించారు. ఆక్వా కల్చర్‌కు సబ్సిడీ ధరపై విద్యుత్ సరఫరా చేయడంతోపాటు వారికి ఆర్థికంగా మరింత మేలు కలిగేలా రైతు భరోసా వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.



చెల్లింపులు ఆలస్యమైనా సరఫరా ఆగదు : విజయానంద్

డిస్కంల పనితీరును మెరుగుపరచడానికి, వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పథకాన్ని అమలు చేస్తోందని ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ తెలిపారు. ప్రస్తుతానికి డిస్కంలు వ్యవసాయానికి సంవత్సరానికి 12 వేల మిలియన్ యూనిట్లను సరఫరా చేస్తున్నాయని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.8,400 కోట్ల సబ్సిడీని భరిస్తోందని వివరించారు. డీబీటీ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాలో అమలు చేస్తున్నామని, 28,684 వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లను అమర్చామని చెప్పారు. అక్కడ వ్యవసాయ వినియోగానికి సంబంధించిన నెలవారీ బిల్లింగ్ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోందని, ఒకవేళ చెల్లింపులు సకాలంలో అందకపోయినా డిస్కంలు రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తాయని విజయానంద్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీజెన్‌కో ఎండీ బి.శ్రీధర్, ట్రాన్స్‌కో జేఎండీ ఐ.పృథ్వీ తేజ్, డిస్కంల సీఎండీలు జె.పద్మ జనార్దనరెడ్డి, కె.సంతోషరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్–విశాఖ వందే భారత్ రైలు ప్రారంభం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ నుంచి జెండా ఊపి ప్రారంభించిన మోదీ
- వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో హాల్ట్
- ఆదివారం మినహా ప్రతి రోజూ రాకపోకలు

సాక్షి, హైదరాబాద్/తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ రోజు ఆదివారం ఉదయం సికింద్రాబాద్– విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ నుంచి ఆయన జెండా ఊపగా, సికింద్రాబాద్ స్టేషన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిలు ప్రత్యక్షంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ పండగ వేళ రెండు తెలుగు రాష్ట్రాల



సోమవారం ఉదయం విశాఖ నుంచి బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజలకు ఇది గొప్ప కానుకగా నిలవనుందని పేర్కొన్నారు. దేశీయంగా సొంత పరిజ్ఞానంతో అద్భుతంగా రూపొందిన ఈ రైలు ప్రారంభం అవుతున్న సందర్భంగా రెండు రాష్ట్రాల ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ రైలు వల్ల యాత్రికులతో పాటు తీర్థయాత్రికులకు కూడా బాగా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నవ భారత సామర్థ్యానికి, దీక్షకు ఒక చిహ్నం. బానిస మనస్తత్వానికి స్వస్తి పలికి ఆత్మనిర్భర్ వైపు భారత్ వేగంగా అడుగులేస్తోందనటానికి నిదర్శనం' అని అభివర్ణించారు. ఇదివరకే ప్రారంభమైన ఏడు వందే భారత్ రైళ్లు 23 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించాయని, 40 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యం చేర్చాయని తెలిపారు. సికింద్రాబాద్‌లో బయలుదేరిన ఈ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి మీదుగా విశాఖపట్నం చేరుకుంది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ (20833) బయలుదేరింది. మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో (20834) ప్రతి రోజు (ఆదివారం మినహా) సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంది.

తెలంగాణ

ఎనిమిదో నిజాం ముకరంజా బహదూర్ కన్నుమూత

ఈ నెల 14న టర్కీలో తుదిశ్వాస


సాక్షి, హైదరాబాద్/చార్మినార్: నిజాం కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. 8వ నిజాం రాజు మీర్ బర్కత్ అలీఖాన్ ముకరంజా బహదూర్ (89) శనివారం రాత్రి టర్కీలోని ఇస్తాంబుల్‌లో కన్నుమూశారు. అనారోగ్యంతో కొన్నాళ్లుగా చికిత్స పొందుతున్న ముకరంజా పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయం మంగళవారం హైదరాబాద్ చేరుకుంటుందని నిజాం ట్రస్ట్ సభ్యులు ప్రకటించారు. తన అంతిమ సంస్కారాలను హైదరాబాద్ మక్కా మసీదులోని అసఫ్‌జాహీ సమాధుల వద్ద నిర్వహించాలన్న ఆయన కోరిక మేరకు పార్థివ దేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. హైదరాబాద్ సంస్థానం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ మనుమడే ముకరంజా. 1933 అక్టోబర్ 6న ఫ్రాన్స్‌లో ఆయన జన్మించారు. డెహ్రాడూన్‌లో పాఠశాల విద్య, లండన్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.

1967లో ఎనిమిదవ నిజాంగా..

నిజాం చారిటబుల్ ట్రస్ట్, ముకరంజా ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్‌కు ముకరంజా చైర్మన్‌గా వ్యవహరించారు. ఏడో నిజాం వారసుడిగా 1967లో భారీ సంపదను ముకరంజా వారసత్వంగా పొందారు. భారత యూనియన్‌లో హైదరాబాద్ చేరిన తర్వాత, ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1950 జనవరి 26 నుంచి 1956 అక్టోబర్ 31 వరకు రాష్ట్ర రాజ్ ప్రముఖ్‌గా పని చేశారు. 1967 ఫిబ్రవరిలో ఆయన మరణానంతరం 1967 ఏప్రిల్ 6న ఎనిమిదవ అసఫ్ జాహీగా ముకరంజాకు పట్టాభిషేకం చేశారు. కాగా, మక్కా మసీదులోని అసఫ్‌జాహీ సమాధుల ప్రాంగణంలో ముకరంజా ఖననం కోసం నిజాం ట్రస్టు సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చౌమహల్లా ప్యాలెస్‌లో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించడానికి ప్రజలను అనుమతించనున్నారు.

పాలమూరు బరిలో అమిత్ షా!

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలంగాణ నుంచి పార్లమెంటు బరిలో దిగనున్నట్లు ఆ పార్టీ కోర్ గ్రూపు నుంచి సంకేతాలు అందుతున్నాయి. కేంద్రంలో 'హ్యాట్రిక్ సర్కార్' ఏర్పాటుతో రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. ఈసారి దక్షిణాది నుంచి కూడా ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలని భావిస్తోంది. ఆ ప్రయత్నాల్లో భాగంగానే పార్టీలో, ప్రభుత్వంలో నంబర్ టూ గా ఉన్న అమిత్‌షాను రాష్ట్రం నుంచి పోటీకి దింపాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే పలుమార్లు నిర్వహించిన సర్వేలు, అధ్యయనాలను బట్టి.. మహబూబ్‌నగర్ నుంచి బరిలోకి దింపే అవకాశం ఉందని అంటున్నారు.



ఈ నెల 8న నగర శివార్లలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ఆరెస్సెస్, సంఘ్‌పరివార్ నేతలతో బీజేపీ జాతీయ, రాష్ట్ర పార్టీల ముఖ్యుల భేటీ సందర్భంగా ఈ అంశంపై చర్చించినట్టు తెలుస్తోంది. కాగా, అమిత్‌షా ఈ నెల 28న రాష్ట్రానికి రానున్నారని, 29న పార్టీ ముఖ్య నేతలతో రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తారని పార్టీ వర్గాల సమాచారం.

స్పృహ

**అద్భుతదీపం దొరికితే అద్భుతాలు సృష్టించవచ్చు.
అది కథల్లో తప్ప బయట దొరకదని
మనకు తెలుసు!
అయితే అలీన అలమ్‌కు 'పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్'
రూపంలో అద్భుతదీపం దొరికింది.
ఆ అద్భుతదీపంతో వ్యాపారంలో
ఓనమాలు తెలియని అలీన
సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది.
నిస్సహాయత తప్ప ఏమీ లేని వారికి అండగా ఉండి
ముందుకు నడిపిస్తోంది...**


దివ్యాంగులతో అలీన అలమ్

అలీన అద్భుతదీపం

కోల్‌కత్తాకు చెందిన అలీన అలమ్‌కు హైస్కూల్ రోజుల్లో బాగా నచ్చిన మాట... పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్. రోడ్డు దాటుతున్న వృద్ధురాలికి సహాయపడినప్పుడు, ఆకలితో అలమటిస్తూ దీనస్థితిలో పడి ఉన్న వ్యక్తికి తన పాకెట్‌మనీతో కడుపు నిండా భోజనం పెట్టించినప్పుడు, పిల్లాడికి స్కూల్ ఫీజు కట్టలేక సతమతమవుతున్న ఆటోడ్రైవరుకు తనవంతుగా సహాయం చేసినప్పుడు..

'పవర్ ఆఫ్ పాజిటివ్ యాక్షన్' అనేది తన అనుభవంలోకి వచ్చింది.

'ఒక మంచి పని చేస్తే అది ఊరకే పోదు. సానుకూల శక్తిగా మారి మనల్ని ముందుకు నడిపిస్తుంది' అనే మాట ఎంత నిజమో తెలిసి వచ్చింది.

అలీన తల్లి గృహిణి. తండ్రి ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగి.

'డబ్బే ప్రధానం' అనే ధోరణిలో వారు పిల్లల్ని పెంచలేదు.

బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీలో మాస్టర్స్ చేసింది అలమ్. అక్కడ చదుకునే రోజుల్లో ఎన్నో డాక్యుమెంటరీలను చూసింది. తన ఆలోచనలు విశాలం కావడానికి,



కొత్తగా ఆలోచించడానికి, కొత్తమార్గాన్ని అన్వేషించడానికి అవి కారణం అయ్యాయి.

'రోమన్ చక్రవర్తి నీరోపై తీసిన ఒక డాక్యుమెంటరీ చూసి చలించిపోయాను. యుద్ధఖైదీల పట్ల అతడు క్రూరంగా వ్యవహరిస్తాడు. అయితే ఆ క్రూరత్వం అనేది ఆ చక్రవర్తికి మాత్రమే పరిమితమై లేదు. అతడితో అంతం కాలేదు. రకరకాల రూపాల్లో అది కొనసాగుతూనే ఉంది. క్రూరత్వంపై మానవత్వం విజయం సాధించాలి' అంటుంది అలీన.

23 సంవత్సరాల వయసులో 'మిట్టీ' పేరుతో కేఫ్ ప్రారంభించింది అలీన. 'ఏదైనా మంచి ఉద్యోగం చేయకుండా ఇదెందుకమ్మా' అని తల్లిదండ్రులు నిట్టూర్పలేదు. ఆశీర్వదించారు తప్ప అభ్యంతర పెట్టలేదు. ఇది లాభాల కోసం ఏర్పాటు చేసిన కేఫ్ కాదు. మానసిక వికలాంగులు, దివ్యాంగులకు ధైర్యం ఇచ్చే కేఫ్.

'మిట్టీ' అనే పేరును ఎంచుకోవడానికి కారణం అలమ్ మాటల్లో...

'మనం ఈ నేల మీదే పుట్టాం. చనిపోయిన తరువాత ఈ నేలలోనే కలుస్తాం. నేలకు ప్రతి ఒక్కరూ సమానమే'

నిజానికి 'మిట్టీ' మొదలు పెట్టడానికి ముందు తన దగ్గర పెద్దగా డబ్బులు లేవు. దీంతో ఒక ఆలోచన చేసింది. 'దివ్యాంగులకు మిట్టీ కేఫ్ ద్వారా సహాయ పడాలనుకుంటున్నాను. నాకు అండగా నిలవండి' అంటూ కరపత్రాలు అచ్చువేసి కర్నాటకలోని కొన్ని పట్టణాల్లో పంచింది.

అయితే పెద్దగా స్పందన లభించలేదు.

ఒక అమ్మాయి మాత్రం అలీనకు సహాయంగా నిలవడానికి ముందుకు వచ్చింది.

'ఒక్కరేనా! అనుకోలేదు. ఈ ఒక్కరు చాలు అనుకొని ప్రయాణం మొదలుపెట్టాను' అని గతాన్ని గుర్తుకు తెచ్చుకుంది అలీన.

కొందరు ఆత్మీయుల ఆర్థిక సహకారంతో హుబ్లీ(కర్నాటక)లోని బీవీబీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో 'మిట్టీ' తొలి బ్రాంచ్ ప్రారంభించింది.

ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు.

నాలుగు సంవత్సరాలలో బెంగళూరు, కర్నాటకాలలో 17 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారికి ధైర్యం ఇచ్చి, తగిన శిక్షణ ఇచ్చి ఈ కేఫ్‌లలో ఉపాధి కల్పించడం ప్రారంభించింది అలీన.

'మిట్టీ' సక్సెస్‌ఫుల్ కేఫ్‌గానే కాదు దివ్యాంగుల హక్కులకు సంబంధించి అవగాహన కేంద్రంగా కూడా ఎదిగింది.

'మిట్టీ కేఫ్‌లోకి అడుగుపెడితే చాలు చెప్పలేనంత ధైర్యం వస్తుంది' అంటుంది కోల్‌కతాకు చెందిన 22 సంవత్సరాల కీర్తి.

దివ్యాంగురాలిగా కీర్తి అడుగడుగునా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంది. అయితే మిట్టీ కేఫ్ తనలో ఎంతో ధైర్యాన్ని నింపింది.

ఇలాంటి 'కీర్తి'లు ఎంతో మందికి అండగా నిలుస్తోంది మిట్టీ కేఫ్.

వైరల్

తండ్రీ... నీ ఆశీర్వాదం

కూతురు పైలెట్.. తండ్రి ప్రయాణికుడు. మరి కాసేపట్లో విమానం గాల్లో ఎగరాలి. కూతురు కాక్‌పిట్ నుంచి బయటికొచ్చి తండ్రి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంది. తండ్రి ఆనందంతో తబ్బిబ్బు అయ్యాడు. తల్లిదండ్రుల ఆశీర్వాదం మరిచి నేను ఏ పనీ చేయను అంటున్న భారతీయ పైలెట్ కతద్న్యా సోషల్ మీడియాలో మెటికలు విరిచే ఆశీర్వాదం పొందుతోంది.


తండ్రి ఆశీర్వాదం తీసుకుంటున్న పైలెట్ కతద్న్యా



'ఈ రోజు కోసం నేను 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్నా' అని ఇన్‌స్టాలో రాసుకుంది పైలెట్ కృతద్న్యా హాలె తన తండ్రితో పాటు ఉన్న తన ఫొటోను పోస్ట్ చేస్తూ.

'నేను పైలెట్ అవ్వాలని కలలు కంటున్నప్పుడు మా నాన్న తప్ప ఎవరూ నా మీద విశ్వాసం ఉంచలేదు. నా కెరీర్ మొదలెట్టి 13 ఏళ్లు అయింది. ఇవాళ మా నాన్నను ఆకాశం మీదుగా గమ్యాన్ని చేర్చే అవకాశం వచ్చింది' అని కూడా రాసుకుంది కృతద్న్యా.

ముంబై నుంచి స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కి ఎయిర్‌బస్ 320 తరచూ నడిపే కృతద్న్యా తన తండ్రిని బహుశా స్వదేశం తీసుకు వస్తూనో లేదా స్పెయిన్ తీసుకువెళుతూనో ఒక వీడియో పోస్ట్ చేసింది. విమానం ఎగిరే ముందు కాక్‌పిట్ నుంచి బయటకు వచ్చి పాసింజర్ సీట్‌లో కూచుని ఉన్న తండ్రి కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంది. ఆయన్ను హత్తుకుంది. తబ్బిబ్బవుతూ తండ్రి ఆమెను ఆశీర్వదించాడు.

ఆ వీడియోను కృతద్న్యా పోస్ట్ చేస్తూ 'తల్లిదండ్రుల ఆశీర్వాదం లేకుండా నేను ఏ పని చేయను. ఒక్కోసారి డ్యూటీకి నేను తెల్లవారుజాము మూడుకో నాలుక్కో ఇంటి నుంచి బయట పడాల్సి వచ్చినా నా తల్లిదండ్రులు గాఢనిద్రలో ఉన్నా వారి పాదాలు తాకి వెళ్లడం అలవాటు' అని రాసింది.

ఈ వీడియోను ఆమె పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే దానికి దాదాపు ఐదు లక్షల లైకులు వచ్చాయి. ఇన్‌స్టాలో చాలామంది నెటిజన్లు ఉద్వేగానికి లోనయ్యారు. 'నిన్ను, మీ నాన్నను చూసి కన్నీరు ఆగడం లేదు' అని ఒకరు రాస్తే 'ఇది అసలు సిసలు భారతీయ సంస్కృతి' అని మరొకరు రాశారు. 'నీలాంటి అమ్మాయిలే మాకు రోజూ స్ఫూర్తినిస్తున్నారు' అని మరొక మహిళ కామెంట్ చేసింది.

భారతీయ కుటుంబాల్లో తండ్రీ కూతురు అనుబంధం ప్రత్యేకమైనది. కొందరు కూతుళ్లు అమ్మ కూచిలుగా కాకుండా నాన్న బిడ్డలుగా ఉంటారు. నాన్నతో క్లోజ్‌గా ఉంటారు. నాన్నలు వారి కోసం ప్రాణం పెడతారు. కృతద్న్యా, ఆమె తండ్రిలో అలాంటి తండ్రీ కూతుళ్లు తమను తాము పోల్చుకోవడంతో ప్రస్తుతం ఈ వీడియో యమా వైరల్‌గా మారింది.

న్యూస్ మేకర్

జీవితం ఆమెతో ఫుట్‌బాల్ ఆడింది



పొలమి అధికారి

**మొన్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో
మన పురుషుల టీం కనిపించిందా?
పురుషుల టీమ్‌ను తయారు చేసుకోలేని మనం
స్త్రీల టీమ్‌ను మాత్రం ఏం పట్టించుకుంటాం?
అసలు ఫుట్‌బాల్ ఆడే అమ్మాయిలకు మన దేశంలో
ఏం మర్యాద, ప్రోత్సాహం ఉన్నాయి?
కోల్‌కటా ఫుట్‌బాల్ క్రీడాకారిణి
పొలమి అధికారి ఒకప్పుడు దేశ జట్టులో ఆడింది.
ఇప్పుడు?
జరుగుబాటు కోసం జొమాటోలో డెలివరి గర్ల్‌గా పని చేస్తోంది.
గత రెండు మూడు రోజులుగా ఈమె జీవిత అవస్థ గురించి
సోషల్ మీడియాలో, మీడియాలో ఆవేదన వ్యక్తం అవుతోంది.**

జొమాటో అని రాసి ఉన్న ఎర్రటి టీ షర్ట్ తొడుక్కుని కోల్‌కటాలో సైకిల్ మీద ఫుడ్ డెలివరీ చేస్తున్న 24 ఏళ్ల పొలమి అధికారి ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి అని ఎవరూ ఊహించరు. గత కొంత కాలంగా ఇల్లు గడవడానికి పొలమి ఫుడ్ డెలివరీ చేస్తోంది. కోల్‌కటాకే చెందిన సంజుక్త చౌధురి అని ట్విటర్ యూజర్ పొలమి గురించి చిన్న వీడియో తీసి ట్విటర్‌లో ఉంచడంతో గత రెండు మూడు రోజుల్లోనే చాలా రెస్పాన్స్‌లు వచ్చాయి. విస్తృతంగా కామెంట్స్ కూడా వచ్చాయి. ఒక ఫుట్‌బాల్ క్రీడాకారిణి నిస్సహాయ స్థితిలో ఉండటం ఏ మాత్రం సరికాదనే అభిప్రాయాలు వెల్లడయ్యాయి.

అబ్బాయి అనుకునేవారు

కోల్‌కటాలోని బెహలా ప్రాంతంలో నివసించే పొలమి బాల్యంలోనే తల్లిని కోల్పోయింది. తండ్రి టాక్సీ డ్రైవర్‌గా పని చేస్తుంటే మేనత్త పెంచి పెద్ద చేసింది. చిన్నప్పటి నుంచే పొలమి ఫుట్‌బాల్ ఆడేది. అయితే అబ్బాయిలాగా కనిపించే పొలమిని చూసి అందరూ అబ్బాయి అనుకుని ఆడించేవారు. 'ఆ తర్వాత నేను అమ్మాయి అని తెలిశాక ఆటలో రానివ్వలేదు. అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడితే వారికి ఏ మర్యాద లేదు. నేను ఫుట్‌బాల్ మానేసి కొన్నాళ్లు హాకీ ఆడాను. అయితే మా ప్రాంతంలోని అనిత సర్కార్ అనే ఫుట్‌బాల్ కోచ్ నన్ను చూసి ఫుట్‌బాల్‌లో ట్రయినింగ్ ఇచ్చింది. నేను మంచి ప్లేయర్‌ని అయ్యాను' అంటుంది పొలమి. పదిహేను ఏళ్లు వచ్చేసరికే పొలమి మంచి ఫుట్‌బాల్ క్రీడాకారిణి అయ్యింది. దేశం తరఫున అండర్ 16 జట్టుకు ఎంపికయ్యి 2013లో జరిగిన అండర్ 16 ఛాంపియన్‌షిప్ కోసం శ్రీలంక వెళ్లి ఆడింది. అయితే ఆ సమయంలో తగిలిన గాయాల నుంచి కోలుకోవడం కష్టమైంది. ఇంటివాళ్లుగాని, క్రీడా సంస్థలు గాని సరైన వైద్యం, ఫిట్‌నెస్ ట్రయినింగ్ ఇప్పించక పోవడంతో వెనుకబడింది. మళ్లీ కోలుకుని 2016లో జరిగిన స్ట్రీట్ 'హోమ్‌లెస్ ఫుట్‌బాల్ వరల్డ్‌కప్' కోసం దేశం తరఫున గ్లాస్‌గో వెళ్లి ఆడింది. ఆ తర్వాత కూడా ఆమెకు ఫుట్‌బాల్ అసోసియేషన్ నుంచి ఎటువంటి మద్దతు, ప్రోత్సాహం లభించలేదు.

వెంటాడిన పేదరికం

2017లో తండ్రి చేస్తున్న డ్రైవర్ ఉద్యోగం పోయింది. ఇంకో చెల్లెలు, తను తప్ప సంపాదనకు ఎవరూ లేరు. 2019 నాటికి బతకడం దుర్భరమైంది. 'అప్పుడే నేను జొమాటోలో చేరాను. ఆ రోజుల్లో రోజుకు 500 సంపాదించేదాన్ని. లాక్‌డౌన్ ఎత్తేశాక చాలామంది ఈ ఉద్యోగంలోకి వచ్చారు. ఆర్డర్లు తక్కువ. పైగా నాకు సైకిల్ తప్ప బండి లేదు. దాంతో దగ్గరి ఆర్డర్లే తీసుకుంటాను. అందువల్ల రోజుకు 400 వస్తాయి. ఒక్కో ఆర్డర్ మీద 20 లేదా 30 రూపాయలు వస్తాయి. ఒక్కోసారి రోజుకు 300 రూపాయలకు మించి రావు. నాకు వేరే దారి లేదు... ఈ పని తప్ప' అంది పొలమి. రోజుకు 12 గంటలు పని చేస్తూ కూడా ఒక్కోసారి ఫుట్‌బాల్‌ను సాధన చేస్తుంటుంది పొలమి. బి.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నదిగాని అది కూడా నత్తనడకన సాగుతున్నది.

వెల్లువెత్తిన స్పందన

పొలమి కథనానికి స్పందన వెల్లువెత్తింది. దేశంలో ఫుట్‌బాల్ క్రీడాకారుల స్థితి ఆ మాటకొస్తే ఏ కొద్ది మందో తప్ప అందరు క్రీడాకారుల స్థితి ఇలాగే ఉందనే స్పందన వచ్చింది. ఫుట్‌బాల్ ఆటను ఇలా నిర్లక్ష్యం చేయడం వల్ల ఇన్ని కోట్ల మంది భారతీయులు ఉన్నా పురుషులలో గాని, స్త్రీలలోగాని ప్రపంచ దేశాలతో తలపడే మెరుగైన టీమ్‌లు తయారు కావడం లేదనే విమర్శలు వచ్చాయి. 'నాకు ఇప్పుడు కుదురైన ఉద్యోగం, ప్రాక్టీసు చేయడానికి మంచి స్పైక్స్ కావాలి' అంటున్న పొలమిలాంటి వారిని ఆ స్థితిలో ఉంచడం విషాదం.

ఇప్పుడు వచ్చిన స్పందనతో ఆమెకు ఎలాంటి సహాయం అందుతుందో చూడాలి.


జొమాటో గర్ల్‌గా... పొలమి అధికారి ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా...

వైరల్

సత్తా చాటి స్వర్ణం గెలిచిన బంగారు బామ్మ


క్యారమ్స్ టోర్నమెంట్‌లో వసంతి ఉత్తుకర్

'ఖాన్‌తో గేమ్స్ ఆడవద్దు' అని ఒక సినిమాలో హెచ్చరించారు బ్రహ్మానందం. ఈ బామ్మ మాత్రం 'నాతో గేమ్స్ ఆడండి' అని అందరినీ ఆహ్వానిస్తుంటుంది. ఆటలో తన శక్తి యుక్తులను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉంటుంది. 'బామ్మతో క్యారమ్స్ ఆడడం బహు కష్టం సుమీ' అనిపించేలా ఉంటుంది ఆమె ఆట నైపుణ్యం.

మహారాష్ట్రలోని పుణెలో జరిగిన క్యారమ్ టోర్నమెంట్స్‌లో యూత్ ఎక్కువగా పాల్గొంది. అంతమాత్రాన వసంతి ఉత్తుకర్ బామ్మ సైలెంట్‌గా ఉంటుందా ఏమిటి! తన సత్తా చాటడానికి క్యారమ్స్ బరిలోకి దిగింది. డబుల్స్ విభాగంలో స్వర్ణపతకం, సింగిల్స్‌లో కాంస్య పతకం గెలుచుకొని 'నువ్వు బంగారం బామ్మ' అంటూ జేజేలు అందుకుంది. 'ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్ సుమీ' అనే వాస్తవాన్ని మరోసారి ఘనంగా గుర్తు చేసింది. వసంతి బామ్మ క్యారమ్స్ ఆడుతున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే వైరల్‌గా మారింది.

కిచెన్ టిప్స్



- కూరల్లో కారం ఎక్కువ పడితే కొంచెం టమాటా కలిపి తక్కువ మంట మీద కాసేపు ఉంచాలి.
- కొద్దిగా పంచదార కలిపినా సరి పోతుంది.
- అదే చికెన్, సీ ఫుడ్ అయితే కొద్దిగా నిమ్మరసం కలపవచ్చు.

బ్యూ టిప్స్

బొప్పాయి... తేనె ఫేస్ ప్యాక్

బొప్పాయిలో ఉండే ఎంజైమ్స్ చర్మంపై చక్కటి ప్రభావాన్ని చూపుతాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా మార్చడంతోపాటు చర్మంపై ఉండే మృతకణాలను తొలగించి చర్మాన్ని అందంగా మారుస్తాయి. తేనెలోని గుణాలు చర్మానికి పోషణనిస్తాయి. బాగా మగ్గిన బొప్పాయి పండు ముక్క తీసుకొని బాగా మెత్తగా చేసుకోవాలి. దీనికి చెంచా తేనె కలిపి.. రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.



నిమ్మరసం.. కీర దోస.. రోజ్ వాటర్

నిమ్మరసంలో సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలుంటాయి. ఇవి ట్యాన్‌ను పోగొట్టి చర్మాన్నిమెరిపిస్తాయి. దీనికి రోజ్ వాటర్, కీర దోస రసం కూడా కలిపితే.. చర్మానికి జీవకళ అందుతుంది. ఈ మిశ్రమం చర్మంపై ఉన్న డార్క్ స్పాట్స్‌ను సైతం తగ్గిస్తుంది. టేబుల్ స్పూన్ చొప్పున నిమ్మరసం, కీర దోస రసం, రోజ్ వాటర్ తీసుకోవాలి. ఈ మూడింటిని గిన్నెలో వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో కాటన్ బాల్ ముంచి ముఖానికి రాసుకోవాలి. పావుగంట లేదా ఇరవై నిమిషాల తర్వాత ముఖాన్ని ఫ్రిజ్‌లో ఉంచిన నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.






‘మళ్లీ మైదానంలో కలుద్దాం’

కారు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఈ కష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. ప్రమాదం తర్వాత తొలిసారి తన ట్విటర్ అకౌంట్ ద్వారా స్పందిస్తూ... ‘నా శస్త్రచికిత్స విజయవంతమైందని చెప్పటం ఆనందంగా ఉంది. కోలుకునే ప్రక్రియ మొదలైంది. రాబోయే సవాళ్లకు సిద్ధంగా ఉన్నా. అండగా నిలిచిన అభిమానులు, జట్టు సహచరులు, డాక్టర్లకు కృతజ్ఞతలు. మళ్లీ మైదానంలో కలుద్దాం’ అని వ్యాఖ్యానించాడు.

పంజాబ్ కింగ్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా...

ఈ ఏడాది ఐపీఎల్ టి20 టోర్నీలో పంజాబ్ కింగ్స్ జట్టుకు భారత మాజీ క్రికెటర్ సునీల్ జోషి స్పిన్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. కర్ణాటకకు చెందిన 52 ఏళ్ల సునీల్ జోషి భారత జట్టు తరఫున 1996 నుంచి 2001 మధ్య కాలంలో 15 టెస్టులు ఆడి 41 వికెట్లు... 69 వన్డేలు ఆడి 69 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున ఆడిన సునీల్ జోషి గతంలో హైదరాబాద్ రంజీ జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశాడు.



రూ. 951 కోట్లు...

- భారీ మొత్తానికి మహిళల ఐపీఎల్ మీడియా హక్కులు విక్రయం
- సొంతం చేసుకున్న వయాకామ్ 18
- ఈ ఏడాది మార్చిలో డబ్ల్యూఐపీఎల్



న్యూఢిల్లీ: మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఐపీఎల్) కొబ్బరికాయ కొట్టకముందే కోట్లు కొల్లగొట్టింది. ప్రత్యక్ష ప్రసార హక్కులు (మీడియా రైట్స్) ఎవరూ ఊహించనంత ధర పలికాయి. ఏకంగా రూ. 951 కోట్లు ప్రసార హక్కుల ద్వారానే వచ్చాయి. ఫ్రాంచైజీల రేసులో పురుషుల ఐపీఎల్ యాజమాన్యాలే ఉండటం, కార్పొరేట్ల కన్ను మహిళల ఆటపై కూడా పడటం చూస్తుంటే ఇక ముందు ముందు ఇంకెన్ని కోట్లు కురుస్తాయో చెప్పలేం. ఇంకా... టైటిల్ స్పాన్సర్‌షిప్, ఫ్రాంచైజీ నగరాల కైవసంతో బోర్డు ఖజానాలో మరికొన్ని కోట్లు వచ్చిపడనున్నాయి. మొత్తానికి భారత్ అమ్మాయిల మెరుపులు కూడా ప్రపంచం దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఐదు జట్లతో తొలి డబ్ల్యూఐపీఎల్ టి20 టోర్నీ జరగనుంది. కొన్నేళ్లుగా బీసీసీఐ పురుషుల ఐపీఎల్ టోర్నీ చివర్లో మూడు జట్లతో మహిళల టి20 చాలెంజ్ టోర్నీని (నాలుగు మ్యాచ్‌లు) నిర్వహిస్తోంది. అయితే వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో ప్రత్యేకంగా మహిళలకు టి20 లీగ్‌లు జరుగుతుండటంతో భారత్‌లోనూ ప్రత్యేకంగా డబ్ల్యూఐపీఎల్ నిర్వహించాలని డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది అది కార్యరూపం దాల్చనుంది.

మ్యాచ్‌కు రూ. 7 కోట్ల 9 లక్షలు

ఐదేళ్ల పాటు 2023–27 సీజన్లకు సంబంధించిన మీడియా రైట్స్‌ను వేర్వేరు రీజియన్ల వారిగా కాకుండా గ్లోబల్ (వరల్డ్ వైడ్)గా కట్టబెట్టింది. దీన్ని రూ. 951 కోట్లకు బిడ్ వేసిన ‘వయాకామ్ 18’ దక్కించుకుంది. అన్నీ తన వద్దే ఉండాలని పోటీపడిన ‘స్టార్ నెట్‌వర్క్’కు శృంగభంగం తప్పలేదు. బరిలో ప్రముఖ బ్రాడ్‌కాస్టర్ సోనీ సంస్థ ఉన్నప్పటికీ రిలయన్స్‌కు చెందిన ‘వయాకామ్ 18’ గ్లోబల్ మీడియా రైట్స్‌ను చేజిక్కించుకుంది. అంటే మ్యాచ్‌కు రూ. 7 కోట్ల 9 లక్షలు చొప్పున బీసీసీఐ ఖాతాలో పడనున్నాయి. టీవీ, డిజిటల్, ఉమ్మడి (ఈ రెండు కలిపి) మూడు కేటగిరీలుగా బిడ్లను ఆహ్వానించగా, వయాకామ్ ఉమ్మడి హక్కులు కైవసం చేసుకోవడంతో ‘స్టార్ నెట్‌వర్క్’కు నిరాశ ఎదురైంది. సుమారు రూ.వెయ్యి కోట్లు అమ్మాయిల లీగ్‌కు రావడం పట్ల బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, దిగ్గజ క్రికెటర్లు వీవీఎస్ లక్ష్మణ్, మిథాలీ రాజ్, జులన్ గోస్వామి హర్షం వ్యక్తం చేశారు.

వయాకామ్ కొత్తకాదు

ఐపీఎల్ ప్రసార హక్కులు వయాకామ్‌కు కొత్తకాదు. గతేడాది తెరమీదికి వచ్చిన ఈ ‘బ్రాడ్‌కాస్టింగ్’ సంస్థ పురుషుల ఐపీఎల్ లీగ్‌లో రూ.23,758 కోట్లతో డిజిటల్ రైట్స్‌ను, రూ. 1058 కోట్లతో ఆస్ట్రేలియా–న్యూజిలాండ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మూడు రీజియన్లకు సంబంధించిన డిజిటల్, టీవీ రైట్స్‌ను సొంతం చేసుకుంది. దీంతో ‘డిస్నీ స్టార్ నెట్‌వర్క్’ కేవలం టీవీ రైట్స్‌కే పరిమితమైంది.

కింగ్ కోహ్లి జోర్‌దార్...

భారత్ తీన్‌మార్...

ఒక్కసారి ఆ పరుగుల ప్రవాహం మొదలైందంటే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదని మరోసారి రుజువైంది. పరుగులు, రికార్డులను చూసీ చూసీ క్రికెట్ ప్రపంచం అలసిపోతోంది కానీ అతను మాత్రం కాదు. మంచినీళ్ల ప్రాయంలా అనడం కూడా చిన్న మాటనే! తనకే సాధ్యమైన అద్భుతమైన షాట్లు అలవోకగా కొడుతూ విరాట్ కోహ్లి కెరీర్‌లో 46వ శతకంతో చెలరేగాడు. సెంచరీల సెంచరీ దిశగా మరో అడుగు ముందుకేశాడు. తొలి వన్డేతో పోలిస్తే ఈ సారైతే చెమట చుక్క చిందించకుండా భారీ స్కోరుతో చెలరేగిపోయాడు. మరోవైపు సెంచరీతోనే యువ శుబ్‌మన్ గిల్ తన సత్తా ప్రదర్శించాడు. ఫలితంగా వన్డే క్రికెట్ చరిత్రలోనే భారత్ ఖాతాలో అతి పెద్ద విజయం చేరగా... పేలవ ఆటతో శ్రీలంక జట్టు చిత్తయి సిరీస్‌ను 0–3తో కోల్పోయింది.

- చివరి వన్డేలో టీమిండియా ‘రికార్డు’ విజయం
- 317 పరుగులతో శ్రీలంక చిత్తు
- కోహ్లి, గిల్ సెంచరీలు
- సిరాజ్‌కు నాలుగు వికెట్లు
- 3–0తో సిరీస్ క్లీన్‌స్వీప్

తిరువనంతపురం: శ్రీలంకతో వన్డే సిరీస్‌ను భారత్ భారీ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన చివరి వన్డేలో టీమిండియా 317 పరుగుల తేడాతో లంకను ఓడించింది. పరుగుల పరంగా వన్డే క్రికెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద విజయం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 390 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’, ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ విరాట్ కోహ్లి (110 బంతుల్లో 166 నాటౌట్; 13 ఫోర్లు, 8 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (97 బంతుల్లో 116; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. అనంతరం లంక 22 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. నువనిదు (19)దే అత్యధిక స్కోరు. హైదరాబాద్ బౌలర్ సిరాజ్ (4/32) ప్రత్యర్థిని దెబ్బకొట్టగా... కుల్దీప్, షమీ చెరో 2 వికెట్లు తీశారు. తాజా ఫలితంతో సిరీస్ 3–0తో భారత్ సొంతమైంది. రేపటి నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో భారత్ బరిలోకి దిగుతుంది.

గిల్ బౌండరీల జోరు...


గిల్ సెంచరీ అభివాదం

తొలి మూడు ఓవర్లలో వచ్చింది 5 పరుగులే... ఇది చూస్తే పిచ్ స్వభావంపై సందేహాలు వచ్చాయి. అయితే అసలు ఆట ఆ తర్వాత మొదలైంది. కుమార ఓవర్లో రోహిత్ శర్మ (49 బంతుల్లో 42; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) సిక్స్‌తో మొదలు పెట్టగా... గిల్ వరుసగా 4 ఫోర్లు బాది తానేంటో చూపించాడు. ఆ తర్వాత రజిత ఓవర్లోనూ వరుసగా 6, 6, 4 కొట్టి దూకుడు పెంచిన రోహిత్ అదే జోరులో ఆడబోయి బౌండరీ వద్ద చిక్కాడు. అనంతరం 52 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గిల్, కోహ్లి భాగస్వామ్యంలో భారత్ దూసుకుపోయింది. వీరిద్దరు చక్కటి సమన్వయంతో ఆడుతూ ఒకరితో మరొకరు పోటీ పడి చకచకా పరుగులు సాధించారు. నువనిదు ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి 90ల్లోకి చేరుకున్న గిల్... అతని తర్వాతి ఓవర్లో లాంగాన్ దిశగా సింగిల్ తీసి కెరీర్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాతా తగ్గకుండా వాండర్సె ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను, రజిత బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి క్లీన్‌బౌల్డ్ కావడంతో చక్కటి ఇన్నింగ్స్ ముగిసింది.

విరాట్ విశ్వరూపం...

48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి... గిల్ అవుటయ్యే సమయానికి 58 పరుగుల వద్ద ఉన్నాడు. మరోవైపు నుంచి శ్రేయస్ అయ్యర్ (32 బంతుల్లో 38; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా కోహ్లికి తగిన సహకారం అందించాడు. 40వ ఓవర్ ముగిసేసరికి కోహ్లి స్కోరు 82 పరుగులు కాగా... 9 ఫోర్లే కొట్టాడు. ఆ తర్వాత అతని విధ్వంసం మొదలైంది. ముందుగా కరుణరత్నే ఓవర్లో లాంగాన్ దిశగా సింగిల్ తీసి అతను సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత రజిత ఓవర్లో సిక్స్ కొట్టిన కోహ్లి... కరుణరత్నే తర్వాతి ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. రజిత మరో ఓవర్లోనూ కోహ్లి 2 సిక్స్‌లు, ఫోర్ రాబట్టాడు. కుమార వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లోనూ ఇదే తరహాలో 2 సిక్స్‌లు, ఫోర్ బాది విరాట్ అజేయంగా నిలిచాడు. ఆఖరి 10 ఓవర్లలో భారత్ 116 పరుగులు చేయగా... కోహ్లి ఒక్కడే 34 బంతులు మాత్రమే ఆడి 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 84 పరుగులు సాధించడం విశేషం!

టపటపా...

కొండంత లక్ష్యం చూడగానే ఆటకు ముందే చేతులెత్తేసిన లంక కనీస స్థాయి ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయింది. సిరాజ్ పదునైన బౌలింగ్ ముందు తలవంచిన జట్టు బ్యాటర్లు వరుసగా వికెట్లు అప్పగించేశారు. తొలి 5 వికెట్లలో 4 వికెట్లు పడగొట్టిన సిరాజ్... తన బౌలింగ్‌లో షాట్ కోసం ముందుకొచ్చి సరైన సమయంలో క్రీజ్‌లోకి వెళ్లలేకపోయిన కరుణరత్నేను రనౌట్ చేసి ఆరో వికెట్ పతనంలోనూ కీలకపాత్ర పోషించాడు. అతి కష్టమ్మీద నువనిదు, రజిత (13 నాటౌట్), షనక (11) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. సిరాజ్ స్పెల్ చివర్లో అతను తొలి ఐదు వికెట్ల ఘనత అందుకునేందుకు సహచరులంతా ప్రయత్నించారు. ఇతర బౌలర్లు బ్యాటర్‌కు దూరంగా బంతులు వేస్తూ వికెట్ తీయకుండా జాగ్రత్తపడ్డారు. అయితే అదృష్టం కలిసి రాక సిరాజ్ 4 వికెట్లకే పరిమితమయ్యాడు.


వన్డే సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ రోహిత్ శర్మ

ఆటగాళ్ల ‘ఢీ’

మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 43వ ఓవర్ ఐదో బంతిని కోహ్లి పుల్ షాట్ ఆడగా బంతి బౌండరీ వైపు దూసుకుపోయింది. జెఫ్రీ వాండెర్సె బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి ఎడమ వైపునకు, ఆషెన్ బండారా డీప్ మిడ్ వికెట్ నుంచి కుడి వైపునకు బంతిని ఆపేందుకు దూసుకొచ్చారు. ఈ క్రమంలో నియంత్రణ కోల్పోయిన వీరిద్దరు ఒకరినొకరు ఢీ కొట్టారు. బాధగా ఇద్దరూ కొద్దిసేపు విలవిల్లాడగా, స్ట్రెచర్‌పై బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. వాండెర్సె స్థానంలో వెలలాగే ‘కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్’గా ఆడగా, బండార బ్యాటింగ్‌కు దిగలేకపోయాడు. ఈ బౌండరీతో 99కు చేరిన కోహ్లి తర్వాతి బంతికే సెంచరీ పూర్తి చేసుకున్నా... ఎలాంటి సంబరాలు ప్రదర్శించలేదు.



46 కోహ్లి సెంచరీల సంఖ్య. అత్యధిక వన్డే శతకాల జాబితాలో సచిన్ టెండూల్కర్ (49 సెంచరీలు)కు కోహ్లి దగ్గరయ్యాడు. భారత్‌లో అత్యధిక సెంచరీలు చేసిన (21) బ్యాటర్‌గా సచిన్ (20)ను దాటిన కోహ్లి... ఒక జట్టుపై అత్యధిక సెంచరీలు (10 ; శ్రీలంకపై) చేసిన ఆటగాడిగా నిలిచాడు.

5 వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో కోహ్లి ఐదో స్థానానికి (12,754) చేరుకున్నాడు.

317 పరుగుల పరంగా వన్డేల్లో అతి పెద్ద విజయాన్ని భారత్ (317 పరుగులు) నమోదు చేసింది. గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్ జట్టు పేరిట ఉండేది. 2008లో ఐర్లాండ్‌పై న్యూజిలాండ్ 290 పరుగుల తేడాతో గెలిచింది.

96 శ్రీలంకపై భారత్ విజయాల సంఖ్య. వన్డే క్రికెట్‌లో ఒక జట్టుపై ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన జట్టుగా ఆస్ట్రేలియా (95 - న్యూజిలాండ్‌పై) పేరిట ఉన్న రికార్డును భారత్ తిరగరాసింది.

3 స్వదేశంలో శ్రీలంకతో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను భారత్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది మూడోసారి. గతంలో భారత్ 1982లో 3-0తో... 2014లో 5-0తో వన్డే సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అవిష్క (బి) కరుణరత్నే 42; గిల్ (బి) రజిత 116; కోహ్లి (నాటౌట్) 166; శ్రేయస్ (సి) (సబ్) ధనంజయ (బి) కుమార 38; కేఎల్ రాహుల్ (సి) వెలలాగె (బి) కుమార 7; సూర్యకుమార్ (సి) అవిష్క (బి) రజిత 4; అక్షర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 390. వికెట్ల పతనం:** 1–95, 2–226, 3–334, 4–364, 5–370. **బౌలింగ్:** రజిత 10–1–81–2, కుమార 10–1–87–2, హసరంగ 10–0–54–0, వాన్‌డర్సే 7–0–59–0, కరుణరత్నే 8–0–58–1, షనక 3–0–19–0, నువనిదు 2–0–22–0.

శ్రీలంక ఇన్నింగ్స్: అవిష్క (సి) గిల్ (బి) సిరాజ్ 1; నువనిదు (బి) సిరాజ్ 19; మెండిస్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; అసలంక (సి) అక్షర్ (బి) షమీ 1; షనక (బి) కుల్దీప్ 11; హసరంగ (బి) సిరాజ్ 1; కరుణరత్నే (రనౌట్) 1; వెలలాగె (సి) కుల్దీప్ (బి) షమీ 3; రజిత (నాటౌట్) 13; కుమార (బి) కుల్దీప్ 9; బండార (ఆబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 73. వికెట్ల పతనం:** 1–7, 2–22, 3–31, 4–35, 5–37, 6–39, 7–50, 8–51, 9–73. **బౌలింగ్:** షమీ 6–2–20–2, సిరాజ్ 10–1–32–4, కుల్దీప్ 5–1–16–2, శ్రేయస్ 1–0–2–0.

యువ భారత్ జోరు...

- అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్‌లో రెండో విజయం
- అదరగొట్టిన షఫాలీ, శ్వేత


షఫాలీ


శ్వేత

బెనోని (దక్షిణాఫ్రికా): టాప్ ఆర్డర్ బ్యాటర్లు మరోసారి చెలరేగడంతో... తొలిసారి నిర్వహిస్తున్న మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో సోమవారం గ్రూప్ ‘డి’ లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 122 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. మొదట భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ షఫాలీ వర్మ (34 బంతుల్లో 78; 12 ఫోర్లు, 4 సిక్సర్లు), శ్వేత సెహ్రావత్ (49 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు) ధాటిగా ఆడారు. ఆరంభం నుంచి చెలరేగిన ఓపెనర్లు తొలి వికెట్‌కు 8.3 ఓవర్లలోనే 111 పరుగులు జోడించారు. రిచా ఘోష్ (29 బంతుల్లో 49; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, తెలుగమ్మాయి గొంగడి త్రిష (11; 2 ఫోర్లు) డెత్ ఓవర్లలో ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుటైంది. యూఏఈ బౌలర్లలో ఇందుజా, మహిక, సమైరా తలా ఒక వికెట్ తీశారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. ఓపెనర్ లావణ్య కెనీ (54 బంతుల్లో 24), మహిక (26 బంతుల్లో 26; 2 సిక్సర్లు) 20 పైచిలుకు స్కోరు చేశారు. భారత బౌలర్లలో తెలుగమ్మాయి షబ్నమ్, టిటాస్, మన్నత్, పర్షవి తలా ఒక వికెట్ తీశారు. గ్రూప్ ‘డి’లో 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న భారత జట్టు రేపు జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడుతుంది.

హైదరాబాద్‌లో వన్డే సందడి

- రేపు భారత్, న్యూజిలాండ్ పోరు
- పూర్తిగా అమ్ముడుపోయిన టికెట్లు

సాక్షి, హైదరాబాద్: నాలుగు నెలలలోపే భాగ్యనగర క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ వచ్చేసింది. భారత్, న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో భాగంగా బుధవారం ఉప్పల్‌లో జరిగే తొలి పోరులో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇందుకోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. నాలుగు రోజుల పాటు ‘ఆన్‌లైన్’లో టికెట్లు అందుబాటులో ఉంచగా, పూర్తిగా అమ్ముడుపోవడంతో స్టేడియం ‘హౌస్‌ఫుల్’ కావడం ఖాయమైంది. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి టికెట్లను ‘ఆన్‌లైన్’కే పరిమితం చేయడంతో టికెట్ల అమ్మకం విషయంలో ఎలాంటి గందరగోళం, రచ్చ జరగలేదు. పాకిస్తాన్ పర్యటన నుంచి శనివారమే నేరుగా హైదరాబాద్ వచ్చిన కివీస్ జట్టు రెండు రోజులుగా ప్రాక్టీస్ చేస్తుండగా... లంకతో మూడో వన్డే తర్వాత సోమవారం సాయంత్రం టీమిండియా నగరానికి చేరుకుంది. మంగళవారం ఇరు జట్లు పూర్తి స్థాయిలో సాధన చేస్తాయి. గతంలో ఉప్పల్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య 2 టెస్టులు జరగ్గా... కివీస్ జట్టు వన్డే ఆడనుండటం ఇదే మొదటిసారి కానుంది.


డరైల్ మిచెల్ బ్యాటింగ్ ప్రాక్టీస్

సిరాజ్ తొలిసారి...

సొంతగడ్డపై హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలిసారి భారత్ తరఫున మ్యాచ్ ఆడనున్నాడు. గతంలో ఐపీఎల్‌లో ఆడినా... అతని 42 అంతర్జాతీయ మ్యాచ్‌ల కెరీర్‌లో హైదరాబాద్‌లో మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. ఇప్పుడు అద్భుతమైన ఫామ్‌తో భారత జట్టులో కీలకంగా ఎదిగిన దశలో ఉప్పల్ మైదానంలో తన ఆటతో చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంకతో సిరీస్‌లో కేవలం 10.22 సగటుతో 9 వికెట్లు తీసిన సిరాజ్‌పై ‘అరుదైన ప్రతిభగలవాడు’ అంటూ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసలు కురిపించాడు.

భారత్ 0 ఇంగ్లండ్ 0

పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీ



రూర్కెలా: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీ పూల్ ‘డి’లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్ జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ 0–0తో ‘డ్రా’గా ముగించింది. భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు... ఇంగ్లండ్ జట్టుకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం పూల్ ‘డి’లో భారత్, ఇంగ్లండ్ జట్ల ఖాతాలో చెరో నాలుగు పాయింట్లు ఉన్నాయి. 19న జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో వేల్స్‌తో భారత్, స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడతాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో మలేసియా 3–2తో చిలీపై, నెదర్లాండ్స్ 4–0తో న్యూజిలాండ్‌పై, ఫ్రాన్స్ 2–1తో దక్షిణాఫ్రికాపై గెలుపొందగా... అర్జెంటీనా–ఆస్ట్రేలియా మ్యాచ్ 3–3తో ‘డ్రా’గా ముగిసింది.

శ్రమించి... శుభారంభం


రాఫెల్ నాదల్

- రెండో రౌండ్‌లోకి రాఫెల్ నాదల్
- తొలి రౌండ్‌లో 3 గంటల 41 నిమిషాల్లో బ్రిటన్ ప్లేయర్‌పై గెలుపు

మెల్‌బోర్న్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్‌కు తొలి రౌండ్‌లోనే గట్టిపోటీ ఎదురైంది. బ్రిటన్‌కు చెందిన ప్రపంచ 40వ ర్యాంకర్ జాక్ డ్రేపర్‌తో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రాఫెల్ నాదల్ 7–5, 2–6, 6–4, 6–1తో నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. 3 గంటల 41 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో నాదల్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఏకంగా 46 అనవసర తప్పిదాలు చేసిన నాదల్ 41 విన్నర్స్ కొట్టి పైచేయి సాధించాడు. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న డ్రేపర్ 13 ఏస్‌లతో అదరగొట్టాడు. అయితే 46 అనవసర తప్పిదాలు చేయడం... కీలకదశలో తడబడటంతో డ్రేపర్‌కు ఓటమి తప్పలేదు. నాదల్ సర్వీస్‌ను 11 సార్లు బ్రేక్ చేసే అవకాశం వచ్చినా డ్రేపర్ నాలుగుసార్లు మాత్రమే సద్వినియోగం చేసుకున్నాడు. మరోవైపు నాదల్ ఆరుసార్లు డ్రేపర్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు.

మెద్వెదెవ్ అలవోకగా...

పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరో సీడ్ ఫీలిక్స్ అలియాసిమ్ (కెనడా), పదో సీడ్ హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. మెద్వెదెవ్ 6–0, 6–1, 6–2తో మార్కోస్ గిరోన్ (అమెరికా)పై, సిట్సిపాస్ 6–3, 6–4, 7–6 (8/6)తో క్వెంటిన్ హేల్స్ (ఫ్రాన్స్)పై, అలియాసిమ్ 1–6, 7–6 (7/4), 7–6 (7/3), 6–3తో పోస్‌పిసిల్ (కెనడా)పై, హుర్కాజ్ 7–6 (7/1), 6–2, 6–2తో పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)పై గెలిచారు. అయితే 2014 చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 4 గంటల 22 నిమిషాల్లో 7–6 (7/3), 3–6, 6–1, 6–7 (2/7), 4–6తో అలెక్స్ మొల్కాన్ (స్లొవేకియా) చేతిలో... ప్రపంచ 23వ ర్యాంకర్ బోర్నా చోరిచ్ (క్రొయేషియా) 3–6, 3–6, 3–6తో జిరీ లెహెక్కా (చెక్ రిపబ్లిక్) చేతిలో... ప్రపంచ 19వ ర్యాంకర్ ముసెట్టి (ఇటలీ) 4–6, 1–6, 7–6 (7/0), 6–2, 6–7 (4/10)తో హ్యారిస్ (దక్షిణాఫ్రికా) చేతిలో ఓడిపోయారు.

స్వియాటెక్ కష్టపడి...

మహిళల సింగిల్స్ విభాగం తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్) గంటా 59 నిమిషాల్లో 6–4, 7–5తో జూల్ నెమియర్ (జర్మనీ)పై శ్రమించి గెలిచింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ పెగూలా (అమెరికా) 6–0, 6–1తో జాక్వెలిన్ (రొమేనియా)పై, ఆరో సీడ్ సాకరి (గ్రీస్) 6–1, 6–4తో యు యువాన్ (చైనా)పై, ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 6–4తో సినియకోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచారు.

సింధు సత్తాకు సవాల్

- నేటి నుంచి ఇండియా ఓపెన్ టోర్నీ
- బరిలో లక్ష్య సేన్, ప్రణయ్, శ్రీకాంత్

న్యూఢిల్లీ: స్వదేశంలో మరోసారి సత్తా చాటుకోవాలనే లక్ష్యంతో భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్, సైనా నెహ్వాల్ నేటి నుంచి మొదలయ్యే ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో బరిలోకి దిగనున్నారు. మాజీ చాంపియన్ పీవీ సింధు నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ సుపనిద కటిథోంగ్ (థాయ్‌లాండ్)తో... ప్రపంచ 31వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో సైనా నెహ్వాల్ తలపడనున్నారు. గత ఏడాది ఇదే టోర్నీ సెమీఫైనల్లో సుపనిద చేతిలో సింధు ఓడిపోగా... మియా బ్లిచ్‌ఫెల్ట్‌తో గతంలో ఆడిన రెండుసార్లూ సైనాకు ఓటమి ఎదురైంది. ఈ నేపథ్యంలో సింధు, సైనాలకు తొలి రౌండ్‌లోనే కఠిన పరీక్ష ఎదురుకానుంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్య సేన్ భారత్‌కే చెందిన ప్రణయ్‌తో తొలి రౌండ్‌లో ఆడనున్నాడు. గతవారం మలేసియా ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లో వీరిద్దరు తలపడగా ప్రణయ్ పైచేయి సాధించాడు. బుధవారం జరిగే మరో తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో కిడాంబి శ్రీకాంత్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో శ్రీకాంత్ 3–9తో వెనుకంజలో ఉన్నాడు.


సింధు, ప్రణయ్

విజేత కుశాగ్ర మోహన్

సాక్షి, హైదరాబాద్: బిషన్ సింగ్ స్మారక ఆలిండియా ఓపెన్ ‘ఫిడే’ రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన కుశాగ్ర మోహన్ విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో కుశాగ్ర మోహన్, ఎం.చక్రవర్తి రెడ్డి (తెలంగాణ), హిమల్ గుసైన్ (పశ్చిమ రైల్వేస్) ఎనిమిది పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... కుశాగ్ర మోహన్‌కు అగ్రస్థానం దక్కింది. చక్రవర్తి రెడ్డి రన్నరప్‌గా నిలువగా, హిమల్‌కు మూడో స్థానం లభించింది. వి4 చెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో చాంపియన్ కుశాగ్ర మోహన్‌కు రూ. లక్ష ప్రైజ్‌మనీ, చక్రవర్తి రెడ్డికి రూ. 70 వేలు, హిమల్‌కు రూ. 40 వేలు ప్రైజ్‌మనీ లభించాయి. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన కుశాగ్ర ఏడు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను ‘డ్రా’ చేసుకొని అజేయంగా నిలిచాడు.

విన్నర్, రన్నరప్ ట్రోఫీలతో కుశాగ్ర, చక్రవర్తి



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
168	62
60,093	17,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	11,079	△ 78
డోజోన్స్	34,303	△ 112
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,860	△ 16
డాక్స్	15,134	△ 48
షాంఘై	3,228	△ 32
నికాయ్	22,822	▽ 298

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,883
బంగారం (99.5 స్వచ్ఛత)	56,655
వెండి (కిలో)	69,167

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.50	82.17
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	98.20	101.48
€	యూరో	ఒకటి	86.81	89.89
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.79	64.88
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.86	58.26
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.79	62.80
SAR	సౌదీ రియాల్	ఖాతాదారుల	20.77	22.44
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాదారుల	21.32	23.12
¥	చైనా యువాన్	ఖాతాదారుల	11.00	13.03

టోకు ధరలు కూల్.. కూల్!

- డిసెంబర్ ద్రవ్యోల్బణం 4.95 శాతమే..
- 22 నెలల కనిష్ట స్థాయి
- ఫుడ్ ఆర్టికల్స్ ధరలు తగ్గుదల



న్యూఢిల్లీ: దేశ ఎకానమీకి ధరల తగ్గుదల ఊరటనిస్తోంది. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంకెల దిగువ బాటలోనే టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు కూడా నడిచాయి. డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం కేవలం 4.95 శాతంగా (2021 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 22 నెలల కాలంలో (2021 ఫిబ్రవరిలో 4.83 శాతం) ఇంత తక్కువ స్థాయి గణాంకాల నమోదు ఇదే తొలిసారి. ఫుడ్ ఆర్టికల్స్ ప్రత్యేకించి కూరగాయలు, ఆయిల్‌సీడ్స్ ధరలు తగ్గడం మొత్తం టోకు ద్రవ్యోల్బణం గణాంకల తగ్గుదలకు కారణం. 2022 సెప్టెంబర్ వరకు వరుసగా 18 నెలలు టోకు ద్రవ్యోల్బణం రెండంకెలపైన కొనసాగింది. అక్టోబర్ నుంచి గడచిన మూడు నెలల్లో రెండంకెల దిగువకు చేరింది. డిసెంబర్‌లో ఫుడ్ బాస్కెట్ ధర తగ్గడం మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిన సంగతి తెలిసిందే. నవంబర్‌లో 5.88 శాతంగా నమోదుకాగా, డిసెంబర్‌లో మరింత తగ్గి 5.72%కి (2021 డిసెంబర్‌తో పోల్చి) చేరడం ఎకానమీకి ఊరటనిచ్చింది.

బీవైడీ టాప్ గేర్..

- ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో నంబర్ వన్
- అంతర్జాతీయంగా టెస్లాకు దీటుగా పోటీ
- భారత్‌లోనూ కార్యకలాపాల విస్తరణ

సాక్షి, బిజినెస్ డెస్క్: బిల్డ్ యువర్ డ్రీమ్స్.. మీ కలలను సాకారం చేసుకోండి. ఇదేదో ట్యాగ్‌లైన్ కాదు. ఓ చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ పేరు. సంక్షిప్త రూపం బీవైడీ. ఈ బీవైడీనే ఇప్పుడు అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాను కలవరపెడుతోంది. అంతటి పెద్ద కంపెనీని కూడా డిస్కౌంట్ల బాట పట్టించింది. ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్ కంపెనీగా నిల్చింది. ఇప్పుడు భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ మరింతగా విస్తరిస్తోంది.

రెండు దశాబ్దాలుగా..

ప్రాథమికంగా రీచార్జబుల్ బ్యాటరీల ఫ్యాక్టరీగా బీవైడీ కంపెనీని వాంగ్ చాన్‌ఫు 1995లో ప్రారంభించారు. ఆ తర్వాత ఆటోమొబైల్స్, మొబైల్ ఫోన్స్ పరికరాల విభాగాల్లోకి విస్తరించారు. ఆ క్రమంలోనే కార్ల తయారీ లైసెన్సు ఉన్న క్విన్‌చువాన్ ఆటోమొబైల్ కంపెనీని 2002లో కొనుగోలు చేసి దాన్ని 2003లో బీవైడీ ఆటో కంపెనీగా బీవైడీ మార్చింది. ప్రస్తుతం బీవైడీ కంపెనీలో బీవైడీ ఆటోమొబైల్, బీవైడీ ఎలక్ట్రానిక్ అని రెండు అనుబంధ సంస్థలు ఉన్నాయి. బీవైడీ ఆటోమొబైల్.. ప్యాసింజర్ కార్లు, బస్సులు, ట్రక్కులు, ఎలక్ట్రిక్ సైకిళ్ల వంటి పూర్తి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ), ప్లగ్ ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలను (పీహెచ్ఈవీ) తయారు చేస్తోంది. పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టేందుకు గతేదాది మార్చి నుంచి పెట్రోల్ వాహనాలను నిలిపివేసింది. 2021 ఆఖరు నాటికి పీహెచ్ఈవీ, బీఈవీ విభాగంలో ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద కంపెనీగా ఎదిగింది. 2022లో దాదాపు 19 లక్షల పైగా విద్యుత్ వాహనాలు (హైబ్రిడ్ కూడా కలిపి) విక్రయించడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల విక్రయంలో ప్రపంచంలోనే నంబర్ వన్ సంస్థగా నిల్చింది.



బఫెట్ పెట్టుబడులు..

మార్కెట్ క్యాప్‌పరంగా టెస్లా ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీగా ఉండగా.. అమ్మకాలపరంగా మాత్రం బీవైడీ అగ్రస్థానాన్ని ఆక్రమించింది. టెస్లా మార్కెట్ వేల్యుయేషన్ 386 బిలియన్ డాలర్లుగా ఉండగా బీవైడీది సుమారు 100 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. లాభాలు, ఆదాయాలపరంగా టెస్లా ఇంకా గ్లోబల్ లీడర్‌గానే ఉన్నప్పటికీ బీవైడీ వేగంగా దూసుకొస్తోంది. యూరప్, ఆస్ట్రేలియా మొదలైన మార్కెట్లలోకి కూడా ఎగుమతులు మొదలుపెడుతోంది. అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ గురు వారెన్ బఫెట్ .. టెస్లాలో కాకుండా చైనా కంపెనీ బీవైడీలో పెట్టుబడులు పెట్టారు. ఇతర ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలతో పోలిస్తే బీవైడీకి ఓ ప్రత్యేకత ఉంది. బ్యాటరీ, ఎలక్ట్రిక్ మోటార్, ఎలక్ట్రిక్ కంట్రోల్ అనే మూడు రకాల ఎన్ఈవీలకు సంబంధించిన టెక్నాలజీల్లోనూ నైపుణ్యం ఉంది. ఇలా వినూత్న టెక్నాలజీల్లోనే కాకుండా ధరపరంగా కూడా టెస్లాకు బీవైడీ గట్టి పోటీ ఇస్తోంది. బీవైడీ కార్ల ధరలు చైనా మార్కెట్లో 30,000 డాలర్ల లోపే ఉంటుండగా, టెస్లా చౌకైన కారు మోడల్ 3 ప్రారంభ ధరే 37,800 డాలర్ల పైచిలుకు ఉంటోంది. 25,000 డాలర్ల రేంజీలో కారును కూడా తెస్తామంటూ టెస్లా ప్రకటించింది.

భారత్‌లోనూ బీవైడీ జోరు..

2030 కల్లా భారత్‌లో అమ్ముడయ్యే ప్రతి మూడు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్‌దే ఉంటుందనే అంచనాల నేపథ్యంలో మన మార్కెట్‌పై బీవైడీకి భారీ లక్ష్యాలే ఉన్నాయి. 2030 నాటికల్లా దేశీ ఈవీ మార్కెట్లో 40 శాతం వాటాను దక్కించుకోవాలని కంపెనీ నిర్దేశించుకుంది. 2007లోనే బీవైడీ ఇండియా విభాగం ఏర్పాటైంది. గతేదాది భారత్‌లో అటో 3 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ, ఈ6 ఎలక్ట్రిక్ ఎంపీవీలను ప్రవేశపెట్టింది. సీల్ పేరిట మరో కారును ఈ ఏడాది ప్రవేశపెడుతోంది. ఇప్పుడు విక్రయిస్తున్న కార్ల రేట్లు రూ. 29 లక్షల నుంచి ఉంటుండగా 700 కి.మీ. వరకు రేంజి ఉండే సీల్ రేటు దాదాపు రూ. 70 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. దిగుమతి సుంకాల భారాన్ని తగ్గించుకునే క్రమంలో ప్రస్తుతం చెన్నైలోని ప్లాంటులో ఎలక్ట్రిక్ వాహనాలను సెమీ నాక్డ్–డౌన్ కిట్స్ (ఎస్‌కేడీ)లాగా అసెంబుల్ చేస్తోంది. రెండో దశలో డిమాండ్‌ను బట్టి పూర్తి స్థాయిలో ఇక్కడే అసెంబుల్ చేసే అవకాశాలనూ పరిశీలిస్తోంది. ప్రస్తుతం దాదాపు 20 డీలర్లు ఉండగా ఈ ఏడాది ఆఖరు నాటికి భారత్‌లో తమ డీలర్‌షిప్‌ల సంఖ్యను 53కి పెంచుకునే యోచనలో ఉంది. గతేదాది సుమారు 700 వాహనాలు విక్రయించగా ఈ ఏడాది ఏకంగా 15,000 పైచిలుకు అమ్మకాలను కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

తెలుగు కనెక్షన్..

తెలుగు రాష్ట్రాల కంపెనీతో కూడా బీవైడీకి అనుబంధం ఉంది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తో బీవైడీకి సాంకేతిక భాగస్వామ్యం ఉంది. బీవైడీ సాంకేతికత సహకారంతో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేస్తోంది. ఇక భారత్‌లో సొంత ఉత్పత్తుల విస్తరణలో భాగంగా కంపెనీ హైదరాబాద్‌తో పాటు వైజాగ్, విజయవాడ తదితర ప్రాంతాల్లోనూ స్టోర్స్ ఏర్పాటు చేసింది.

లాభాల నుంచి నష్టాల్లోకి

సెన్సెక్స్ 168 పాయింట్లు డౌన్



ముంబై: ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 168 పాయింట్లు క్షీణించి 60,093 వద్ద నిలిచింది. నిఫ్టీ 62 పాయింట్ల నష్టంతో 17,895 వద్ద ముగిసింది. వెరసి సాంకేతికంగా కీలకమైన 18,000 స్థాయి దిగువన స్థిరపడింది. అయితే తొలుత మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 326 పాయింట్లు ఎగసి 60,587కు చేరింది. మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో 297 పాయింట్లు నీరసించింది. 60,000 దిగువన 59,964ను తాకింది. ఈ బాటలో నిఫ్టీ సైతం 18,050- 17,854 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. గత కొద్ది రోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాలను వీడకపోవడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు నిపుణులు పేర్కొన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల జోరు

ఎన్ఎస్ఈలో మెటల్, మీడియా, ప్రయివేట్ బ్యాంక్స్, ఆటో 1.4–0.7% మధ్య వెనకడుగు వేయగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 1.7%, ఐటీ 1.1% చొప్పున లాభపడ్డాయి. యుకో, ఐవోబీ, యూనియన్, పీఎస్‌బీ, సెంట్రల్, మహారాష్ట్ర, పీఎన్‌బీ, బీవోఐ 9–1.5% మధ్య జంప్‌చేశాయి. క్యూ3లో ప్రోత్సాహకర ఫలితాలతో ఇటీవలే లిస్టయిన శూల వైన్‌యార్డ్స్ 15 శాతం దూసుకెళ్లింది. రూ. 374 వద్ద ముగిసింది.

ధరలు పెంచిన మారుతీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ అన్ని మోడళ్ల ధరలను 1.1 శాతం పెంచింది. జనవరి 16 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చాయని కంపెనీ ప్రకటించింది. ముడి సరుకు వ్యయాలు అధికం కావడం, ఏప్రిల్ 1 నుంచి అమలయ్యే నూతన ఉద్గార ప్రమాణాలకు అనువుగా వాహనాల తయారీ చేపట్టనుండడం కారణంగా ధరలను పెంచుతున్నట్టు గతేదాది డిసెంబర్‌లో మారుతీ సుజుకీ వెల్లడించింది. 2022 ఏప్రిల్‌లో ధరలను సవరించిన తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రెండోసారి.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్యూ3 గుడ్

నికర లాభం రూ. 12,698 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం జంప్‌చేసి రూ. 12,698 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 19 శాతం బలపడి రూ. 12,260 కోట్లయ్యింది. ఈ కాలంలో 20 శాతం రుణ వృద్ధి కారణంగా నికర వడ్డీ ఆదాయం 25 శాతం ఎగసి రూ. 22,988 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.1 శాతంగా నమోదయ్యాయి. ఇతర ఆదాయం రూ. 300 కోట్లు పెరిగి రూ. 8,540 కోట్లకు చేరింది.



రుణ నాణ్యత అప్: క్యూ3లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) నిలకడను చూపుతూ 1.23%గా నమోదైంది. నిర్వహణ వ్యయాలు 27 శాతం పెరిగి రూ. 12,464 కోట్లకు చేరగా.. 4,000 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,66,890ను తాకింది. . కాగా.. అనుబంధ సంస్థలలో హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నికర లాభం రూ. 258 కోట్ల నుంచి రూ. 203 కోట్లకు తగ్గింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం రూ. 304 కోట్ల నుంచి రూ. 501 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1% బలహీనపడి రూ. 1,586 వద్ద ముగిసింది.

సంపన్నులకు మక్కువ ఈక్విటీలే

- వాణిజ్య రియల్టీకి ద్వితీయ ప్రాధాన్యం
- సంపన్నుల ఐశ్వర్యం ఈ ఏడాది పైపైకే
- నైట్ ఫ్రాంక్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని అధిక ధనవంతులు ఎక్కడ ఇన్వెస్ట్ చేస్తారు? చాలా మందికి దీన్ని తెలుసుకోవాలని ఉంటుంది. ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్' సర్వే పరిశీలిస్తే.. అల్ట్రా హై నెట్ వర్త్ వ్యక్తులకు (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ/అధిక ధనవంతులు) అత్యంత ఇష్టమైన పెట్టుబడి సాధనం ఈక్విటీలే అని తెలుస్తోంది. 34% పెట్టుబడులను ఈక్విటీలకే కేటాయిస్తున్నారు. ఆ తర్వాత వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో 25 శాతం, బాండ్లలో 16 శాతం, ప్రైవేటు ఈక్విటీ/వెంచర్ క్యాపిటల్ రూపంలో 10 శాతం, బంగారంలో 6 శాతం, ఇతర ఇష్టమైన వస్తువులపై (కళాకృతులు, కారు) 4% చొప్పున పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిసింది. నైట్ ఫ్రాంక్ సంస్థ అంతర్జాతీయంగా సర్వే నిర్వహించి 'ద వెల్త్ రిపోర్ట్ అవుట్‌లుక్ 2023'పేరుతో విడుదల చేసింది.

సర్వే ఫలితాలు..

- దీర్ఘకాలంలో ఎంతో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ 88 శాతం మంది భారతీయ అధిక ధనవంతుల సంపద 2022లో వృద్ధి చెందింది.
- గతేదాది 10 శాతానికి పైగా తమ సంపద పెరిగినట్టు 35 శాతం మంది చెప్పారు.
- ఈ ఏడాది కూడా తమ సంపద కనీసం 10 శాతం వృద్ధి చెందుతుందని 53 శాతం మంది అధిక ధనవంతులు అభిప్రాయపడుతున్నారు
- 47 శాతం మంది 10 శాతానికి పైనే పెరగొచ్చన్న అంచనాతో ఉన్నారు.
- అంతర్జాతీయంగా.. సంపన్నుల కంటే ధనవంతులే ఈక్విటీల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్నారు.
- మన దేశంలో అధిక ధనవంతులు కనీసం ఒక్కొక్కరు 5 నివాస ఆస్తులను కలిగి ఉన్నారు. అంతర్జాతీయంగా ఇది 4.2గానే ఉంది.
- 2022లో 14 శాతం మంది అధిక ధనవంతులు ఇంటిని కొనుగోలు చేయగా, 2023లో 10 శాతం మంది ఇంటిని కొనుగోలు చేస్తారని అంచనా.
- యూకే, యూఏఈ, యూఎస్‌ఏ ఇళ్ల కొనుగోలుకు ప్రాధాన్య ప్రాంతాలుగా ఉన్నాయి.



విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌డీఏ-పుణెలో 251 గ్రూప్ సీ పోస్టులు

పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ).. గ్రూప్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 251
» **పోస్టుల వివరాలు:** పెయింటర్, కుక్, ఫైర్‌మ్యాన్, ఎంటీఎస్, ఎల్‌డీసీ, బ్లాక్‌స్మిత్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/12 వతరగతి/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్, స్కిల్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన వెలువడిన 21రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://ndacivrect.gov.in

నీట్ ఎండీఎస్-2023

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్)–2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)ను నిర్వహిస్తోంది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ డిగ్రీ(బీడీఎస్) ఉత్తీర్ణతతోపాటు 31.03.2023 నాటికి ఇంటర్న్‌షిప్/ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తిచేసి ఉండాలి.
» **ఎంపిక విధానం:** అభ్యర్థులను రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
» **పరీక్ష తేది:** 01.03.2023.
» **వెబ్‌సైట్:** https://natboard.edu.in

నీట్ పీజీ-2023

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్).. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో ప్రవేశాలకు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష నిర్వహిస్తోంది. దీనిద్వారా ఎండీ/ఎంఎస్/పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **అర్హత:** ఎంబీబీఎస్ డిగ్రీ/ప్రొవిజనల్ ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. 31.03.2023 నాటికి ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** ఈ పరీక్షలో 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. దీనికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1 రుణాత్మక మార్కు ఉంటుంది. పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో జరుగుతుంది. ఈ పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. పరీక్షా సమయం 3 గంటల 30 నిమిషాలు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.01.2023.
» **పరీక్ష తేది:** 05.03.2023.
» **వెబ్‌సైట్:** https://natboard.edu.in

నిమ్‌హాన్స్, బెంగళూరులో వివిధ ఉద్యోగాలు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో–02, ప్రాజెక్ట్ ఫిజిషియన్–01, డిస్ట్రిట్ కోఆర్డినేటర్–03, గ్రాఫిక్ డిజైనర్–01.
» **అర్హత:** మెట్రిక్యులేషన్‌తోపాటు పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 35 నుంచి 45 ఏళ్లు వరకు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.60,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** brainhealth.nimhans@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 14 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** nimhans.ac.in

సీఎస్ఐఆర్-ఐఐపీ, డెహ్రాడూన్‌లో 11 పోస్టులు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం(ఐఐపీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–07, జూనియర్ స్టెనోగ్రాఫర్–04.
» **విభాగాలు:** ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్ అండ్ పర్చేజ్ తదితరాలు.
» **అర్హత:** 10+2/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ టైపింగ్ నైపుణ్యాలు ఉండాలి.
» **వయసు:** 27 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. టైపింగ్ టెస్ట్‌లో అర్హత సాధించాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
» **వెబ్‌సైట్:** www.iip.res.in

మారిన సిలబస్‌తో అడ్వాన్స్‌డ్!

జేఈఈ అడ్వాన్స్‌డ్.. విద్యార్థి లోకానికి ఎంతో సుపరిచితమైన పరీక్ష! ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో చేరాలనుకునే ప్రతిభావంతులు తమ తొలి లక్ష్యంగా చేసుకునే ఎంట్రన్స్ టెస్ట్ ఇది. వీరంతా ఇప్పుడు తమ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాల్సిన పరిస్థితి! అంతేకాకుండా అడ్వాన్స్‌డ్ పరీక్షను నూతన సిలబస్‌తో నిర్వహించనున్నారు! ఈ నేపథ్యంలో.. జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023 నూతన సిలబస్ ప్రధానాంశాలు, ప్రిపరేషన్ స్ట్రాటజీపై ప్రత్యేక కథనం..

» 2023 నుంచి మారిన సిలబస్‌తో జేఈఈ అడ్వాన్స్‌డ్
» జేఈఈ-మెయిన్ సిలబస్ అంశాల కొనసాగింపు
» సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా కొత్త సిలబస్
» మెయిన్‌తో అనుసంధానం చేసుకోవాలంటున్న నిపుణులు
» అడ్వాన్స్‌డ్‌ను జూన్4న నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్‌టీఏ

జేఈఈ – అడ్వాన్స్‌డ్ – 2023 సిలబస్‌లో మార్పులు ఉంటాయని జాయింట్ అడ్మిషన్ బోర్డ్ గతంలోనే స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగానే ఇటీవల కొత్త సిలబస్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే.. అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన స్కోర్ సాధించే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

మూడు సబ్జెక్టుల్లోనూ మార్పులు

- జేఈఈ-అడ్వాన్స్‌డ్‌ను ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో నిర్వహిస్తారు. తాజా సిలబస్‌ను పరిశీలిస్తే.. ఈ మూడు సబ్జెక్ట్‌లోనూ మార్పులు చేశారు. కొన్ని కొత్త అంశాలను చేర్చారు.
- ఫిజిక్స్‌లో..జనరల్ ఫిజిక్స్,మెకానిక్స్, థర్మల్ ఫిజిక్స్, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ వేవ్స్, ఆప్టిక్స్, ఫోర్స్‌డ్ అండ్ డ్యాంప్డ్ ఆసిలేషన్స్,ఈఎం వేవ్స్ అండ్ పోలరైజేషన్ అంశాలను కొత్తగా చేర్చారు. ఇదే సమయంలో సెమీ కండక్టర్స్ అండ్ కమ్యూనికేషన్స్‌ను తొలగించారు.
- మ్యాథమెటిక్స్‌లో.. సొల్యూషన్ ఆఫ్ ట్రయాంగిల్ చాప్టర్‌ను తొలగించి.. దాని స్థానంలో కొత్తగా స్టాటిస్టిక్స్, అల్జీబ్రా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, మాట్రిసెస్ తదితర అంశాలను చేర్చారు.
- కెమిస్ట్రీలో.. న్యూక్లియర్ కెమిస్ట్రీ విభాగాన్ని తొలగించారు. అదే విధంగా బయో కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ టాపిక్స్‌లో మార్పులు చేశారు. గ్యాసెస్ అండ్ లిక్విడ్స్, అటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, మాలిక్యులర్ స్ట్రక్చర్, స్టేట్స్ ఆఫ్ మేటర్ విభాగాల్లోనూ కొత్త అంశాలను చేర్చారు. రిడాక్స్ రియాక్షన్స్, సాలిడ్ స్టేట్ సొల్యూషన్స్ వంటి వాటిని కూడా చేర్చారు.

జేఈఈ-మెయిన్‌కు కొనసాగింపుగా

జేఈఈ–అడ్వాన్స్‌డ్ సిలబస్‌లోని మార్పులను పరిశీలిస్తే.. జేఈఈ-మెయిన్ సిలబస్‌కు కొనసాగింపుగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరికొంతమంది జేఈఈ-మెయిన్ సిలబస్ కంటే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ కొత్త సిలబస్‌ను ఆకళింపు చేసుకోవడం సులభమని అంటున్నారు. మెయిన్ పరీక్షల సిలబస్‌ను ఆసాంతం చదివిన వారికి అడ్వాన్స్‌డ్ సిలబస్‌పై అవగాహన పొందడం పెద్ద కష్టమేమీ కాదని పేర్కొంటున్నారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు అనుకూలం

జేఈఈ–అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు సీబీఎస్ఈ బోర్డ్ +1,+2 విద్యార్థులకు అనుకూలంగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. సీబీఎస్ఈ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేసినట్లుగా ఉందని పేర్కొంటున్నారు. దీంతో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేసిన వారికి ఎక్కువ అనుకూలత ఉంటుందని అంటున్నారు. స్టేట్ బోర్డ్‌ల పరిధిలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులు చదివిన వారికి ఇబ్బంది ఎదురవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు.. గత కొన్నేళ్లుగా సీబీఎస్ఈ సిలబస్‌ను ఆధారంగా చేసుకుని తమ బోర్డ్ సిలబస్‌లోనూ మార్పులు చేశాయని.. దీనివల్ల విద్యార్థులు అంతగా ఆందోళన చెందక్కర్లేదని సబ్జెక్ట్ నిపుణులు భరోసా కల్పిస్తున్నారు.

శిక్షణ అవసరం లేని విధంగా

వాస్తవానికి విద్యార్థులు బోర్డ్ సిలబస్‌తో మెయిన్ పరీక్షకు సన్నద్ధమవుతూ విజయం సాధిస్తున్నారు. కాని అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన స్కోర్ కోసం మాత్రం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. దీంతో మెయిన్ తర్వాత అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీకి మధ్య ఉండే వ్యవధిలో శిక్షణ ఒత్తిడి, ప్రిపరేషన్ ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగానే తాజా మార్పులు చేసినట్లు ఐఐటీల వర్గాలు పేర్కొంటున్నాయి. మెయిన్ సిలబస్‌కు కొనసాగింపుగా అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు చేయడం ద్వారా విద్యార్థులు ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నాయి.

వెబ్‌సైట్‌లో కొత్త సిలబస్

జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 కొత్త సిలబస్‌ను అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గత ఏడాది మాదిరిగానే పరీక్ష

జేఈఈ–అడ్వాన్స్‌డ్-2023 సిలబస్‌లో మార్పులు చేసిన నేపథ్యంలో పరీక్ష విధానంలోనూ మార్పులు ఉంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రెండు పేపర్లుగా నిర్వహించే ఈ పరీక్షలో ఏమైనా మార్పులు ఉంటాయా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే గత ఏడాది మాదిరిగానే పరీక్ష విధానాన్ని కొనసాగించే అవకాశం ఉందని ఎక్కువ మంది నిపుణులు పేర్కొంటున్నారు.



గత పరీక్ష విధానం ఇలా

- అడ్వాన్స్‌డ్-2022 పరీక్షను రెండు పేపర్లుగా(పేపర్-1, పేపర్-2)గా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహించారు. ▪ పేపర్-1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రతి సబ్జెక్ట్‌లో మూడు సెక్షన్లుగా పరీక్ష జరిగింది.
- మ్యాథమెటిక్స్‌లో మొదటి సెక్షన్‌ను 8 ప్రశ్నలతో 24 మార్కులకు, రెండో సెక్షన్‌ను 6 ప్రశ్నలతో 24 మార్కులకు, మూడో సెక్షన్‌ను 4 ప్రశ్నలతో 12 మార్కులకు నిర్వహించారు.
- ఫిజిక్స్‌లో..సెక్షన్-1లో 8 ప్రశ్నలు(24 మార్కులు),సెక్షన్-2లో 6 ప్రశ్నలు(24 మార్కులు), సెక్షన్-3లో 4 ప్రశ్నలు(12 మార్కులు) అడిగారు.
- కెమిస్ట్రీలో..సెక్షన్-1లో 8ప్రశ్నలు(24మార్కులు), సెక్షన్-2లో 6 ప్రశ్నలు(24 మార్కులు), సెక్షన్-3లో 4 ప్రశ్నలు(12 మార్కులు) అడిగారు.
- మొత్తంగా పేపర్-1ను ప్రతి సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలతో 60 మార్కులకు చొప్పున నిర్వహించారు.

పేపర్-2

పేపర్-2ను కూడా పేపర్-1 మాదిరిగా మూడు సబ్జెక్ట్‌లో.. ప్రతి సబ్జెక్ట్‌లో మూడు విభాగాలతో నిర్వహించారు. ప్రశ్నలు, మార్కుల విధానంలోనూ పేపర్-1 మాదిరిగానే.. ప్రతి సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలు, 60 మార్కులు చొప్పున కేటాయించారు. వాస్తవానికి గత మూడేళ్లుగా ప్రశ్నల సంఖ్యలో మార్పులు జరగట్లేదు. కాబట్టి ఈసారి కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని, మార్కింగ్ విధానంలో ఏమైనా మార్పులు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

జూన్4న జేఈఈ అడ్వాన్స్‌డ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను జూన్ 4న నిర్వహిస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. ఉదయం 9నుంచి 12 గంటల వరకూ పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ పేపర్-2 ఉంటుందని పేర్కొంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారిలో టాప్ 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు అనుమతిస్తారు. ఇందులో వచ్చే ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు.

ప్రిపరేషన్ ఇలా

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్;మెకానిక్స్;హీట్ అండ్ థర్మో డైనమిక్స్, ఎలక్ట్రో డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్;సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

మ్యాథమెటిక్స్

కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్. వీటితోపాటు 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్;పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్;బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

కొత్త అంశాలపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులు అడ్వాన్స్‌డ్-2023లో కొత్తగా చేర్చిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వీటికోసం కొంత ఎక్కువ సమయం కేటాయించాలి. అదే విధంగా మెయిన్ సిలబస్‌ను అడ్వాన్స్‌డ్ సిలబస్‌తో బేరీజు వేసుకోవాలి. ఉమ్మడిగా అంశాలకు, ప్రత్యేక అంశాల ప్రిపరేషన్‌కు వేర్వేరుగా సమయాన్ని కేటాయించాలి.

ముఖ్య సమాచారం

- జేఈఈ అడ్వాన్స్‌డ్ నూతన సిలబస్ వివరాలకు వెబ్‌సైట్: https://jeeadv.ac.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

112 అడుగుల ఆదియోగి విగ్రహావిష్కరణ

బెంగళూరు సమీపంలో చిక్కబళ్లాపురం తాలూకా పరిధిలోని ఆవలగుర్కి సమీపంలో ఈశా ఫౌండేషన్ జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో 112 అడుగుల ఎత్తైన ఆదియోగి (పరమశివుడు) విగ్రహాన్ని ఆవిష్కరించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం సీఎం బసవరాజ బొమ్మై, జగ్గీ వాసుదేవ్ విగ్రహాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో 270 కోట్ల మందికి పైగా యోగాభ్యాసం చేస్తున్నారని జగ్గీ వాసుదేవ్ తెలిపారు. మనిషి సంతోషం కోసం జగత్తు నాశనం వైపు వెళుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

– చిక్కబళ్లాపురం




విగ్రహం వద్ద జగ్గీ వాసుదేవ్

తొమ్మిదో శతాబ్దం నాటి వీరగల్లు లభ్యం

వైఎస్సార్‌జిల్లా మైదుకూరుమండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో సోమవారం తొమ్మిదో శతాబ్దం నాటి వీరగల్లు లభించింది. భారతీయ పురాతత్వ సర్వేక్షణశాఖ డైరెక్టర్ ఆచార్య మునిరత్నంరెడ్డి దీని కాలాన్ని స్పష్టం చేశారు. అప్పట్లో గో సంపద పరిరక్షణలో పులి దాడిని ప్రతిఘటించి మరణించిన స్థానిక వీరుని సంస్మరణగా ఈ వీరగల్లు ఏర్పాటు చేసి ఉండవచ్చని ఆయన వివరించారు. వీర యువకుడితోపాటు అతని పెంపుడు శునకం కూడా యజమానికి మద్దతుగా పోరాడుతూ పులి బారిన పడిందని, అందుకే శాసనంలో కుక్కనుకూడా చిత్రించారని తెలిపారు.

– కడప కల్చరల్



తిప్పిరెడ్డిపల్లె వద్ద లభించిన వీరగల్లు

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 17 । జనవరి । 2023



వెండి తాపడానికి విరాళం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయంలోని అంకమ్మ ఉపాలయ గోపురం వెండి తాపడం తయారీకి ఆదివారం బెల్లంకొండ రమ్యశ్రీ రూ.1,00,116 విరాళం అందజేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన సీహెచ్ మన్విత కృష్ణ పేరుపై రూ.1,00,116 విరాళం అందజేశారు.



లాహిరి..లాహిరి..లాహిరిలో

విజయవాడ భవానీ ద్వీపంలో సంక్రాంతి సెలవుల్లో నగర వాసులు తమ కుటుంబ సభ్యులతో కలసి బోటు షికారు చేసి ఆనందంగా గడిపారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

న్యూస్‌రీల్

నేడు మినీ జాబ్ మేళా

పామర్రు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఈఈడీఏపీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఉయ్యూరు బస్ డిపో సమీపంలోని శ్రీలంక కాలనీలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ట్రైనింగ్ సెంటర్‌లో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఐనస్ క్సీపరియన్స్‌స్ లిమిటెడ్ , వరుణ్ మోటార్స్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలవారు పాల్గొంటున్నారని అన్నారు. ఈ కంపెనీలలోని వివిధ ఉద్యోగాలకు పదవ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 79813 68429 ,70133 26226 నంబర్లను సంప్రదించాలని కోరారు.

19న జర్నలిజం-నైతిక విలువలు అంశంపై సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జర్నలిజం-నైతిక విలువలు అనే అంశంపై ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్ ఎం.వెంకట్ హాజరై యువతకు విదేశాల్లో విద్య, ఉపాధి అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ, స్టెల్లా కళాశాల జర్నలిజం విభాగం సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

ముగిసిన జోసఫ్ తంబి ఉత్సవాలు



ఉంగుటూరు(గన్నవరం): ప్రార్థనాపూరితమైన తంబి జీవితం దేవుని హృదయాన్ని తెరవడానికి తాళం చెవిలాంటిదని ఫాదర్ గోపు ప్రవీణ్ అన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 15వ తేదీ తంబి మరణించిన రోజు కావడంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కృతజ్ఞతా దివ్య పూజాబలిని సమర్పించారు. తంబి జీవితం నుంచి మూడు విషయాలు నేర్చుకోవాలని బోధించారు. బాధలు, కష్టాలు క్రీస్తు ప్రేమతో భరిస్తే అవి సులువుగా తేలికగా ఉంటాయని అన్నారు. తంబి అనేక అవమానాలు, బాధలు అనుభవించి, శ్రమల ద్వారా క్రీస్తుకు దగ్గరవడానికి ఒక సుమార్గాన్ని కనుగొన్నారని చెప్పారు. తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్ మాట్లాడుతూ మహోత్సవాలు విజయవంతంగా, ఘనంగా జరిగేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సంఘస్తులకు, మరియదళ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రావెన్షియల్ కరుణాకర్ కాసు, విచారణ ఫాదర్ మరియన్న, సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పంచరత్న కీర్తనల గోష్ఠిగానం



విజయవాడ కల్చరల్: సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి 176 వ జయంత్యుత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో రెండు వందలమంది సంగీత, వాద్య కళాకారులు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తనలను ఏకకాలంలో గానం చేశారు. శ్రీ గణపతిం సేవరింపరారే కీర్తనలతో ప్రారంభించి జగదానంద కారక, ఎందరో మహానుభావులు తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్, వేమూరి విశ్వనాథ్, సీవీకే శాస్త్రి, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దండమూడి సుమతీ రామ్మోహనరావు మృదంగ లయ విన్యాసం, చిన్నారులు సురవరపు శ్రీవిద్య, ఉమ గాత్ర యుగళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సంప్రదాయంగా సంక్రాంతి

- ప్రతి ఇంటా పండుగశోభ
- కొత్త అల్లుళ్ల రాకతో వేడుకలు
- సంప్రదాయంగా కోడిపందేలు
- విజేతలకు కార్లు, బైక్‌లు బహుమతులు



సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కంకిపాడు: ఊరూ వాడా సంక్రాంతి శోభ నెలకొంది. తెలుగు వారి ముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతి ఇంటింటా కొత్త కాంతులు తెచ్చింది. కొత్త అల్లుళ్లు, బంధువుల రాక, పిండి వంటల ఘుమ ఘుమలతో ప్రతి ఇల్లూ సందడిగా మారింది. సంక్రాంతి మూడు రోజులూ సంబరంగా, సందడిగా సాగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా పెద్ద పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ ఈ ప్రాంత వాసులు సొంతూళ్లకు చేరుకుని అయిన వారి మధ్య పండుగ జరుపుకొని సందడి చేశారు.

సంప్రదాయంగా కోడి పందేలు

సంక్రాంతి అనగానే గుర్తుకొచ్చేది కోడిపందేలు. ఈ దఫా కూడా పండుగకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో సంప్రదాయంగా కోడి పందేలు నిర్వహించారు. పెనమలూరు, గన్నవరం, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ నియోజకవర్గాలతో పాటుగా, ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో సంప్రదాయంగా కోడిపందేలు జరిగాయి. భారీగా ఏర్పాటుచేసిన బరుల్లో పందేలు నిర్వహించడంతో పందేలరాయుళ్లతో పాటు ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంబరాల్లో భాగంగానే సంక్రాంతి బరుల్లో సంప్రదాయంగా కోడిపందేలు సాగాయి.

పెంపకందారులకు ప్రోత్సాహం

ఉభయ కృష్ణాజిల్లాలో ఏర్పాటు చేసిన సంక్రాంతి బరులు కోడి పుంజుల పెంపకందారులను ప్రోత్సహించేలా సాగాయి. గతంలో విజేతలకు నగదు బహుమతులు ఇచ్చేవారు. ఈ దఫా బుల్లెట్‌లు, కార్లు కూడా బహుమతిగా ఇచ్చారు. పండుగ మూడు రోజులు అధికంగా పందేలు గెలుచుకున్న వారికి బుల్లెట్‌లను అందజేశారు. కంకిపాడు మండలం గొడవర్రులో హైదరాబాద్‌కు చెందిన మధు ఎక్కువ పందేల్లో విజయం సాధించి కారును బహుమతిగా పొందారు. చివరలో నిర్వాహకుడు కాగిత రాజా రమేష్‌ను రైతులు ఘనంగా సత్కరించి అభిమానం చాటుకున్నారు.



భవానీద్వీపంలో సంక్రాంతి సందడి కార్యక్రమంలో ఎడ్ల బండిపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

మూడు తరాల కలయిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో నేటి తరానికి వాటిని తెలియజెప్పేందుకు మూడు తరాల కు చెందిన వారంతా ఒక్కచోట కలిసి సంక్రాంతి పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులో రైల్వేస్టేషన్ సమీపంలోని దాసాంజనేయ స్వామి దేవస్థానం వద్ద పల్నాటి, చోడే కుటుంబ సభ్యుల సంక్రాంతి సంబరాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. దేశ, విదేశాల్లో స్థిరపడిన దాదాపు 150 మంది కుటుంబ సభ్యులు సంబరాలకు తరలివచ్చారు. ఉమ్మడి కుటుంబం గొప్పతనాన్ని, కలిసిమెలసి ఐక్యంగా ఉండటంలో కలిగే ఆప్యాయతలను వారసులకు తెలియజేశారు. ఆటవిడుపుగా ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు, క్రికెట్, షటిల్, నృత్య పోటీలు నిర్వహించారు. పల్నాటి పెద్ద మస్తాన్ రావు, చిన్న మస్తాన్ రావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, చోడే సుబ్బారావు కార్యక్రమాన్ని నిర్వహించారు.



మూడు తరాల పల్నాటి, చోడే కుటుంబ సభ్యులు

మరపురాని మధురానుభూతి

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- భవానీ ద్వీపంలో సంక్రాంతి సంబరాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆహ్లాదకర వాతావరణంలో పల్లె సీమను తలపించేలా భవానీ ద్వీపంలో సంక్రాంతి సందడి పేరుతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన సంబరాలు మరపురాని అనుభూతులను ఇచ్చిందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. సంక్రాంతి సందడి ముగింపు సందర్భంగా సోమవారం ద్వీపంలోకి వచ్చిన ఆమె అధికారులు, పర్యాటకులతో కలిసి ద్వీపం మొత్తం కలియతిరుగుతూ సందడి చేశారు. తొలుత అమ్మవారి ప్రతిమకు పూజలు చేశారు. అనంతరం కోలాటం ఆడారు. చిలక జోస్యం చెప్పించుకున్నారు. ఎడ్ల బండిలో షికారు చేశారు. ఏపీ టూరిజం నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మంత్రి అయిన తరువాత నగరిలో ఇటీవల భోగి పండుగ చేసుకున్నానని, రాయచోటిలో సంక్రాంతి ముగ్గులు వేశానని, కనుమ రోజు ఇక్కడికి వచ్చానని అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, ఫెయిల్యూర్స్ వచ్చినా తట్టుకుని ఇలా ఉన్నానంటే ప్రజల మద్దతుతోనేనని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఏ డెప్యూటీ సీఈఓ వి.రాముడు, బీఐటీసీ ఈడీ బలరామిరెడ్డి, రెలిజియస్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి సందడిలో నటి ఇంద్రజ

భవానీద్వీపంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సందడిని చూసేందుకు ఆదివారం సినీనటి ఇంద్రజ వచ్చారు. కోలాటం ఆడారు. సోది, చిలకజోస్యం చెప్పించుకున్నారు.కుమ్మరి కుంటలో మట్టి పాత్రలు చేశారు. అమ్మవారి ప్రతిమకు పూజ చేశారు.



అమ్మవారికి పూజ చేస్తున్న నటి ఇంద్రజ



పామర్రులో ఓ ఇంటి ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గు



గుడ్లవల్లేరులో గంగిరెద్దుల సందడి



జగ్గయ్యపేటలో కోడి పుంజులతో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

ఆ నలుగురికి టికెట్లొద్దు

- వారు కబ్జాదారులు...'కాల్' నాగులు
- టీడీపీ అధిష్టానానికి ఎంపీ కేశినేని నాని అల్టిమేటం
- పండుగ పూట రచ్చకెక్కిన విభేదాలు

''క్యారెక్టర్ ఉన్న పేదవాడికైనా సీటు ఇస్తే ఎంపీనే కాదు ఏదైనా చేస్తా...కానీ భూకబ్జాదారులు, దావూద్ ఇబ్రహీం లాంటి మాఫియా డాన్‌లు, చార్లెస్ శోభరాజ్‌లు, రియల్ ఎస్టేట్ మోసగాళ్లు, కాల్‌మనీ సెక్స్ రాకెట్, పేకాట క్లబ్‌లు, నడిపేవారికి మద్దతు ఇవ్వను''... ఇవన్నీ ఎన్టీఆర్ జిల్లాలోని టీడీపీ నేతలను ఉద్దేశించి విజయవాడ ఎంపీ కేశినేని నాని చేసిన సంచలన వ్యాఖ్యలు...



సాక్షి ప్రతినిధి, విజయవాడ: సంక్రాంతి పండుగ రోజు టీడీపీలో సంకుల సమరం ఊపందుకుంది. కొన్నేళ్లుగా అధిష్టానం తీరుపై మండిపడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని నాని మరోసారి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈసారి ఏకంగా టికెట్ల పంచాయితీనే తెరపైకి తెచ్చారు. తన తమ్ముడు కేశినేని చిన్నితో పాటు, మరో ముగ్గురు, నలుగురికి టికెట్లు ఇవ్వటానికి వీల్లేదని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. ఆ జాబితాలో మైలవరం మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ నియోజక వర్గ నేత బుద్ధా వెంకన్న, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమ ఉండటం గమనార్హం. తద్వారా విజయవాడలో తాను చెప్పిన వారికే టికెట్లు ఇవ్వాలని కేశినేని నాని చెప్పడం అధిష్టానానికి మింగుడు పడటం లేదు. ఇటీవల మైలవరంలో దేవినేని ఉమాను టార్గెట్ చేస్తూ హాట్ కామెంట్‌లు చేశారు. ఆయనతో పాటు కొంతమంది పార్టీకి దూరంగా ఉండి కొత్తవారికి అవకాశం ఇస్తే బెటరనే కామెంట్లు చేశారు. నాలుగు సార్లు గెలిచానని విర్రవీగొద్దని దేవినేనిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. టికెట్టు ఇస్తే ఓడిపోవడం ఖాయమని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఆ వేడి తగ్గక ముందే తీవ్రస్థాయిలో తన తమ్ముడు చిన్నితో పాటు, మరో నలుగురికి పార్టీ టికెట్లు ఇవ్వవద్దంటూ అధిష్టానం పెద్దలకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీ ప్రత్యర్థుల మీద, అధిష్టానం మీద ఆఫ్ ద రికార్డుగా కాకుండా ఆన్ రికార్డుగానే లెఫ్ట్ అండ్ రైట్ ఇవ్వటం ప్రస్తుతం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

లోకేష్‌కు కౌంటర్ స్టేట్‌మెంట్?

తాను విజయవాడ వెస్ట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని బుద్దా వెంకన్న ప్రకటించిన కొన్ని రోజులకే ఎంపీ కేశినేని నాని కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకొంది. లోకేష్ అండతోనే బుద్ధా వెంకన్న ఆ ప్రకటన చేశారన్నది బహిరంగ రహస్యం. ఆ విషయం తెలిసి కూడా బుద్దా వెంకన్నకు టికెట్టు ఇవ్వటానికి వీల్లేదని చెప్పడం, మరోవైపు తన తమ్ముడు చిన్నిని ప్రోత్సహిస్తున్న లోకేష్‌కు పరోక్షంగా కేశినేని నాని కౌంటర్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్టయింది. తనకో క్లారిటీ ఉందని కరప్షన్ కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, జీవితంలో ఎవరినీ మోసం చేయలేదని కేశినేని నాని చంద్రబాబుకు సైతం పరోక్షంగా చురకలంటించారు. ఎన్టీఆర్ గొప్ప ఆశయంతో టీడీపీని స్థాపించారని, ఆ ఆశయంతో పనిచేసేవారు చేయొచ్చునని, కాదని ఇలాంటి వారికి సీట్లు ఇస్తే పార్టీకి గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. టీడీపీని ప్రక్షాళన చేయాలని ఘాటు వ్యాఖ్యలు చేయడం పార్టీలో ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది.

పక్కా వ్యూహంతోనే...

పక్కా వ్యూహంతోనే ఎంపీ కేశినేని నాని పార్టీపై తిరుగుబాటు చేయడంతో చంద్రబాబు, లోకేష్ నుంచి కనీసం ప్రతిస్పందన లేకుండా పోయింది. లోకేష్ అండతో హడావుడి చేస్తున్న ఆ నలుగురు కూడా కిమ్మనకుండా ఉండటం గమనార్హం. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఎంపీ కేశినేని నాని ఈ దాడిని మరింత పెంచే సూచనలు కనిపిస్తున్నాయని టీడీపీ నేతలు అంటున్నారు. దీంతో పార్టీలో నేతల మధ్య మరింత అంతరం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయనే భావన పార్టీ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. ఈ పరిణామాలను బట్టి టీడీపీలో ముున్ముందు వర్గపోరు మరింత బజారున పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

గుడివాడటౌన్: సంక్రాంతి పండుగ ఆంధ్రప్రదేశ్ ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమని కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కే కన్వెన్షన్ నగర్‌లో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్లు బండలాగుడు జాతీయ స్థాయి పోటీలను ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)తో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీనియర్ విభాగంలో 7 జతల ఎడ్లు పాల్గొనగా దేవభక్తుని సుబ్బారావు, దేవభక్తుని చక్రవర్తిల జత మొదటి బహుమతి రూ.లక్ష, దేవభక్తుని సుబ్బారావు, దేవభక్తుని చక్రవర్తి జత రెండో బహుమతి రూ.80 వేలు, నెల్లూరి రామకోటయ్య, మేక కృష్ణమోహన్ జత మూడో బహుమతి రూ.70 వేలు, పులగం త్రిషగ్నారెడ్డి, జస్వంత్ రెడ్డి, గరికపాటి శ్రీధర్ జత నాల్గో బహుమతి రూ.60 వేలు, దప్పిలి అంజిరెడ్డి జత ఐదో బహుమతి రూ.50 వేలు, నెల్లూరి రామకోటయ్య జత ఆరో బహుమతి రూ.40 వేలు, పావులూరి వీరాస్వామి చౌదరి జత ఏడో బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతి సాధించిన జత 25 ఘనపుటడుగుల బండను 20 నిముషాలలో 2,815 అడుగులు లాగి విజయం సాధించాయి. గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ జి.రామకృష్ణ, ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్ ప్రసాద్, దండమూడి శేషగిరిరావు, పట్టణ, రూరల్ అధ్యక్షులు గొర్ల శ్రీను, మట్టా జాన్‌విక్టర్, పలువురు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీనియర్ విభాగం పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ జాషువా

20 నుంచి టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల దరఖాస్తు ప్రక్రియ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టైపు రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు ఏపీ టెక్నికల్ ఇనిస్టిట్యూషన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయా పరీక్షలకు హాజరుకాదలచుకున్న అభ్యర్థులు ఈనెల 20 నుంచి 27వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 25న షార్ట్‌హ్యాండ్ తెలుగు, 26న ఇంగ్లిష్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మార్చి 4, 5వ తేదీల్లో టైపు రైటింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు జరగనున్నట్లు వివరించారు.

'వందే భారత్' వచ్చేసింది



వందేభారత్ రైలు ఆదివారం తొలిసారిగా విజయవాడ రైల్వే స్టేషన్‌లో అడుగిడింది. గంటకు వంద మైళ్లకు పైగా వేగంతో నడిచే ఈ రైలును చూసేందుకు నగర వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైలుకు ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.

-IIలో

‘వందే భారత్’ వచ్చేసింది


విజయవాడ స్టేషన్‌లోకి వస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు


విజయవాడ స్టేషన్‌లో ఎంపీలు కేశినేని నాని, జీవీఎల్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డీఆర్ఎం ఘన స్వాగతం..

విజయవాడ స్టేషన్‌లో స్వాగతం పలికిన ఎంపీలు, ఎమ్మెల్యే

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రవేశపెట్టిన వందే భారత్ సెమీ హైస్పీడ్ రైలును ఈ నెల 15న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలు ఆదివారం మధ్యాహ్నం విజయవాడ చేరుకుంది. దీన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో నగరవాసులు భారీగా తరలిరావటంతో స్టేషన్ కిటకిటలాడింది. భారత దేశం సొంత పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ హైస్పీడ్ రైలును చూసేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారు స్టేషన్‌కు చేరుకుని ఈ రైలుతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీలు పడ్డారు.

వందేభారత్ రైలు ఆదివారం మధ్యాహ్నం విజయవాడ చేరుకోవడంతో లోక్ సభ సభ్యుడు కేశినేని నాని, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ రైల్వే డీఆర్ఎం శివేంద్రమోహన్ విజయవాడ స్టేషన్‌లో వందేభారత్ రైలుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు జీవీఎల్. నరసింహారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వందే భారత్ రైలును కేటాయించిన ప్రధాని నరేంద్రమోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్ఎం శివేంద్రమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటి వందే భారత్ రైలు విజయవాడ డివిజన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే సైకో ‘సైకిల్’ పోవాలి

- ఎమ్మెల్సీ తలశిల రఘురామ్
- ఫ్లెక్సీలను గంగిరెద్దులతో తొక్కించి నిరసన



గంగిరెద్దులతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ఏం చేయాలని గంగిరెద్దును అడిగితే ‘సైకిల్ పోవాలి..సైకో చంద్రబాబు పోవాలి’.. అని అర్థం వచ్చేలా ఫ్లెక్సీపై ఉన్న చంద్రబాబు ఫొటోను కసికసిగా తన కాళ్లతో తొక్కి చూపించింది. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. భోగి పండుగ రోజున రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు, టీడీపీ శ్రేణులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలు, ఆయన ఫొటో ఉన్న ఫ్లెక్సీలు, జీఓ నంబర్ 1 కాపీలను భోగి మంటల్లో వేయటాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వన్ సెంటర్‌లో ఆదివారం వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలశిల రఘురామ్ మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే దేశ విదేశాల నుంచి ఎంతో మంది తాము పుట్టిన తెలుగు గడ్డపై అడుగిడి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు వస్తారని పేర్కొన్నారు. అయితే భోగి రోజున రాష్ట్రవ్యాప్తంగా భోగి మంటలు వేసి దానిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు, ఆయన ఫొటో ఉన్న ఫ్లెక్సీలు, జీఓ నంబర్ 1 కాపీలను వేసి దహనం చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. సంక్రాంతి పండుగకు పశువులను పూజించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గంగిరెద్దులకు పూజ చేశామన్నారు. టీడీపీకి సరైన బుద్ధిని ప్రసాదించాలని, రాష్ట్రానికి సైకో చంద్రబాబు పోతే తప్ప మంచి రోజులు రావని భగవంతుడిని కోరుకున్నామని, వచ్చే పండుగ నాటికి తమ కోరిక నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిజాయితీగా పార్టీని నడపలేనని ఒప్పుకొని నిస్సిగ్గుగా పవన్ కల్యాణ్ పార్టీలోకి టీడీపీని విలీనం చేయాలని చంద్రబాబుకు హితవు పలికారు. ముసుగులో అపవిత్ర కలయిక కంటే విలీనం చేస్తేనే బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఉంటే చంద్రబాబు ఇలా ఫ్లెక్సీలు, ఫొటోలు భోగి మంటల్లో వేసేవాడా? రోడ్లపై సభలు పెట్టేవాడా అన్ని ప్రశ్నించారు. నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి, ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, దూళిపాళ శ్రీనాథ్ పాల్గొన్నారు.

గుండె పోటుతో డ్రైవర్ మృతి


వాహనంలో మృతి చెందిన డ్రైవర్ హరినాథ్

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవి(అవనిగడ్డ): గుంటూరు జిల్లా మంగళగిరి యర్రపాలెంకు చెందిన మినీ వ్యాన్ డ్రైవర్ విస్సంశెట్టి హరినాథ్(53) గుండెపోటుతో మృతి చెందిన ఘటన మోపిదేవిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ పద్మ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మంగళగిరికి చెందిన టాటా మేజిక్ వాహన డ్రైవర్ కొంత మంది ప్రయాణికులను మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానానికి తీసుకువచ్చారన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణంలో వాహనం స్టార్ట్ చేస్తుండగా గుండెపోటు రావడంతో ఆ సీటులోనే మృతి చెందారని చెప్పారు. ప్రయాణికులు వెంటనే 108 కు ఫోన్‌చేయగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న చేరుకున్న సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారని వివరించారు. మృతదేహాన్ని వారి కుమారుడు దుర్గాప్రసాద్‌కు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నవీన్ కుమార్ (ఫైల్)

గన్నవరం: స్థానిక శ్రీనివాస హేచరీస్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని చిన్న అవుటపల్లికి చెందిన ఈదులమూడి నవీన్‌కుమార్(27) ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ రోజు వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై గన్నవరం బయలుదేరాడు. మార్గమధ్యలో శ్రీనివాస హేచరీస్ దాటిన తర్వాత పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ అతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. గన్నవరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అయితే నవీన్‌కుమార్ స్వగ్రామం అజ్జంపూడి కాగ ఏడాది క్రితం జరిగిన వివాహం అనంతరం చిన్న అవుటపల్లిలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం అతని భార్య గర్భవతి. నవీన్‌కుమార్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

అవనిగడ్డలో వ్యక్తి దారుణ హత్య

వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాషా

అవనిగడ్డ: ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పండుగ సందర్భంగా జామతోటల్లో పార్టీ చేసుకునేందుకు వెళ్లిన ఆ వ్యక్తిపై రాడ్‌తో దాడిచేయడంతో విజయవాడలో చికిత్స పొందుతూ చనిపోయాడు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మహబూబ్ బాషా హత్య వివరాలు తెలియజేశారు. స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయిలంకకు చెందిన మేడికొండ అనిల్‌కుమార్ అలియాస్ వందగాడు (35), దిడ్ల కిరణ్ మరి కొంతమంది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి స్థానిక 4వ వార్డులో గొట్టాం మిల్ సమీపంలో కరకట్ట కింద జామతోటల్లో పార్టీ చేసుకోవడానికి వెళ్లారు. కొంతమంది మందు పార్టీలో నిమగ్నం కాగా, కుర్చీలో కూర్చొని ఉన్న అనిల్ కుమార్‌పై డేరా నాగరాజు అలియాస్ కత్తిలోడు రాడ్‌తో దాడిచేశాడు. తలకు బలమైన గాయాలైన అనిల్‌కుమార్‌ని తొలుత స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం అక్కడ నుంచి విజయవాడకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా గొరికిపర్రుకు చెందిన నాగరాజు కొన్నేళ్ల కిందట అవనిగడ్డకు విచ్చేసి పలుచోట్ల అద్దెకు ఉన్నాడు. సీతాయిలంకలో ఓ మహిళతో నాగరాజు సన్నిహితంగా ఉంటాడు. ఓ రోజు నాగరాజు ఆ మహిళను వేధించగా.. ఆ ప్రాంతంలో పెద్దగా ఉన్న అనిల్‌కుమార్ వద్దకు వచ్చి నాగరాజు వేధింపుల గురించి ఆమె చెప్పింది. దీంతో నాగరాజును అనిల్ కుమార్ మందలించాడు. ఈ నేపథ్యంలో హత్య జరిగిందా, మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు. అనిల్ కుమార్ గత ఎన్నికల్లో ఒకటో ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. హత్య కేసు, ఎస్సీ అట్రాసిటీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సీఐడీ సీఐ భార్య ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న జ్యోతి

పటమట(విజయవాడ తూర్పు): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు దాడి చంద్రశేఖర్ మంగళగిరిలోని ఏపీ సీఐడీలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు 2012లో కాకినాడకు చెందిన జ్యోతి(33)తో వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు.. ఉద్యోగరీత్యా వీరిరువురూ పటమటలోని తోటవారి వీధిలో కాపురముంటున్నారు. కొంతకాలంగా వీరిరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనం కోసం పిలిస్తే రాకపోవటంతో అనుమానం వచ్చిన పిల్లలు తలుపులు కొట్టగా అవి గడియపెట్టి ఉన్నాయి. దీంతో స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లటంతో అప్పటికే ఫ్యానుకు ఉరేసుకుని ఉంది. పటమట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు ఆత్మహత్యగా కేసును నమోదు చేసినట్లు పటమట సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఆయన పేర్కొన్నారు.

వేద ధర్మ రక్షణకు కట్టుబడి ఉన్నాం

శృంగేరీ శారదాపీఠ ప్రతినిధి సచ్చిదానంద సరస్వతి స్వామి


శివరామకృష్ణ క్షేత్రంలో సచ్చిదానంద సరస్వతి

విజయవాడ కల్చరల్: వేదధర్మ పరిరక్షణకు శృంగేరీ శారదాపీఠం కట్టుబడి ఉందని తునిపీఠానికి చెందిన సచ్చిదానంద సరస్వతి స్వామి అనుగ్రహభాషణ చేశారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో 73 రోజులపాటు నిర్వహించే మహాసౌరం, అరుణం, సౌర అష్టాకరీ నామజప కార్యక్రమం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం ప్రారంభమైంది. సచ్చిదానంద స్వామి మాట్లాడుతూ సర్వజనావళిని ధర్మమార్గం వైపు నడిపించడానికి ఆదిశంకరులు నాలుగు పీఠాలను స్థాపించారని అందులో శృంగేరీ పీఠం ప్రధానమైందన్నారు. ఆదిశంకరుల కాలం నుంచి కూడా గురు సంప్రదాయంతో పీఠం ధర్మబోధ చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో శృంగేరీ పీఠం ధర్మాధికారి శిష్ట్యాల హనుమత్ ప్రసాద్, పీఠ కార్యక్రమ నిర్వాహకుడు గండూరి చంద్ర మౌళీశ్వర భానుమూర్తి పాల్గొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు దీక్షావస్త్రాలను ధరించి సూర్యనమస్కారాలను, సౌరష్టాక్షరి మంత్ర పారాయణ చేశారు. సచ్చిదానంద స్వామికి నిర్వాహకులు పూర్ణకుంభం, వేద మంత్రాలతో స్వాగతం పలికారు.

జూదాలపై ఉక్కుపాదం

- పేకాట శిబిరాలపై 319 కేసులు నమోదు
- 1005 మంది వ్యక్తుల నుంచి రూ. 7,34,930 నగదు స్వాధీనం
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా

చిలకపూడి(మచిలీపట్నం): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జూద కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువా హెచ్చరించారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు నమోదైన కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 319 కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో 1005 మంది వ్యక్తుల వద్ద నుంచి రూ. 7,34,930లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందేలు నిర్వహించకుండా 123 కోడి కత్తులు, 137 కోడి పుంజులు సీజ్ చేశామన్నారు. వీటితో పాటు 559 కేసుల్లో 927 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక, జూద కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై వచ్చిన సమాచారం మేరకు ఎక్కడికక్కడ మెరుపుదాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

జాతీయ స్థాయి ఆర్చరీ విజేతలు వీరే


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెనమలూరు: ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీపీసీ చెరుకూరి లెనిన్ ఓల్గా మెమోరియల్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ మేరకు విజేతల వివరాలు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ వెల్లడించారు.

- ఓవరాల్ 9 ఏళ్ల విభాగంలో 15+10 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో యురాజ్‌సింగ్(యూపీ),ద్వితీయ స్థానంలో జుగల్‌జావా(రాజస్తాన్),తృతీయ స్థానంలో సుబర్జిత్‌బేగ్(జార్ఖండ్), వ్యక్తిగత రౌండ్‌లో ప్రథమ స్థానంలో యురాజ్‌సింగ్(యూపీ), ద్వితీయ జుగల్‌జావా(రాజస్తాన్), తృతీయ వరుణ్ స్వామీ(మహారాష్ట్ర), ఓవరాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో బండిస్నిగ్ధ(తెలంగాణ), ద్వితీయ స్థానంలో సంస్కృతి, తృతీయ స్థానంలో సందిప్‌కౌల్(మహారాష్ట్ర), వి.జేష్నా(ఏపీ), వ్యక్తిగత బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో బండిస్నిగ్ధ(తెలంగాణ), ద్వితీయ స్థానంలో వర్రిజేష్నా(ఏపీ), తృతీయ స్థానంలో కొల్లి లలిత(ఏపీ) గెలుపొందారు.
- టీమ్ విభాగంలో ప్రథమ స్థానంలో మణిపూర్, ద్వితీయ స్థానంలో ఏపీ, తృతీయ స్థానంలో తమిళనాడు జట్లు గెలిచాయి. బాలికల విభాగంలో రాజస్తాన్, జార్ఖండ్, మణిపూర్ వరుస స్థానాలు గెలిచాయి. మిక్స్‌డ్ జట్లులో మణిపూర్, రాజస్తాన్, జార్ఖండ్ జట్లు విజయం సాధించాయి.
- మెడల్‌ట్యాలీ 9 సంవత్సరాలలోపు విభాగంలో ప్రథమ స్థానంలో కైలాష్ (తమిళనాడు), ద్వితీయ స్థానంలో గుళ్లపల్లి రుత్విక్ (ఏపీ), తృతీయ స్థానంలో విష్ణు(యూపీ), వ్యక్తి గత ఒలంపిక్ రౌండ్‌లో ప్రథమ స్థానంలో విష్ణు(యూపీ), ద్వితీయ స్థానంలో సమర్జిత్ సుదర్శన్(మహారాష్ట్ర),తృతీయ స్థానంలో కైలాష్ (తమిళనాడు) గెలిచారు.
- ఓవరాల్ బాలికల విభాగంలో ఆరాజ్యగజనా చౌహాన్(మహారాష్ట్ర), ద్వితీయ స్థానంలో అదితి అరవింద (మహారాష్ట్ర), ద్వితీయ స్థానంలో అనుష్కతివారి(జార్ఖండ్), వ్యక్తి గత ఒలంపియాడ్ విభాగంలో ప్రథమ స్థానంలో హంశిక(తమిళనాడు), ద్వితీయ స్థానంలో ఆదితి అరవింద్ (మహారాష్ట్ర), తృతీయ స్థానంలో అనుష్కతివారి(జార్ఖండ్) విజయం సాధించారు.
- డబుల్స్10 మీటర్ల ఓవరాల్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో లక్షాప్రజాపత్(రాజస్తాన్), ద్వితీయ స్థానంలో కె.హేన్‌సాన్‌సింగ్ (మణిపూర్),తృతీయ స్థానంలో ఏఎస్‌వీఎం.నాగశ్రీవైభవర్‌రామ్(ఏపీ), వ్యక్తిగత ఒలంపియాడ్ విభాగంలో లక్ష్యాప్రజాపత్(రాజస్తాన్), కె.హేన్‌సూన్‌సింగ్ (మణిపూర్), హేమ్‌తోయిబా (మణిపూర్), డబుల్ ఓవరాల్ బాలికల విభాగంలో హర్షితా బిస్నోయ్(రాజస్తాన్), నిధిఘాట్(రాజస్తాన్), కుమారి (జార్ఖండ్), వ్యక్తి గత బాలికల విభాగంలో నిధిఘాట్(రాజస్తాన్), హర్షితా బిస్నోయ్(రాజస్తాన్), కుమారి (జార్ఖండ్) గెలుపొందారు.
- విజేతలకు విశ్రాంత ఇంజినీర్ దేవినేని వాసుదేవరావు పతకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎల్.జిందాల్, చెరుకూరి కృష్ణకుమారి, జి.ప్రేమ్‌కుమార్, బీవీ.రమణ, అరుంధతి, ఆర్ఎస్.సింగ్, బి.శ్రావణ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో గోపూజ


గోమాతకు పూజ చేస్తున్న ఈఓ భ్రమరాంబ

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా కనుమ రోజును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపైగల కొండపైన ఉన్న గోశాల వద్ద ఆలయ వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ పాల్గొని గోమాతకు పూజలు చేశారు. అనంతరం గోమాత చుట్టూ ప్రదక్షిణలు చేసి వాటికి ఆహారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాస శాస్త్రి, వేద పండితులు చింతపల్లి ఆంజనేయ ఘనాపాఠీ, ఆర్‌వీఎస్ యాజులు, చిట్టి చంద్రశేఖర శర్మ, సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్. రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మానేయమన్నారని ఆత్మహత్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): మద్యం అలవాటును మానేయమన్న కారణంతో ఒక వ్యక్తి ఉరేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ కేఎల్‌రావు నగర్‌లో నివసిస్తున్న సయ్యద్ సమద్‌కు ముగ్గురు మగ పిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుల్లో చిన్నవాడు సయ్యద్ సుభాని ఏసీ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుభాని ప్రతి రోజూ మద్యం సేవించి ఇంటికి వస్తుండగా తల్లిదండ్రులతోపాటు భార్య ఆషా బేగం ఎందుకు అలా రోజూ తాగి వస్తున్నావని ప్రశ్నించారు. అతను నాకు చిన్నచిన్న అప్పులు ఉన్నాయని చెప్పటంతో వాటిని నెమ్మదిగా తీర్చవచ్చని, ప్రతి రోజూ తాగవద్దని నచ్చ చెప్పేవారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో బాగా తాగి ఇంటికి వచ్చాడు. ఎన్నిసార్లు చెప్పినా తాగి ఆరోగ్యం, డబ్బు పాడుచేస్తున్నావని అడగటంతో అతను గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. తలుపు ఎంత కొట్టినా తీయకపోవడంతో పెద్ద కొడుకుతో కలిసి వెనుక తలుపును బలవంతంగా పగులకొట్టి లోపలకు వెళ్లి చూడగా సుభాని చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే కిందకు దించి 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న దర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు..

- మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం


ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు


మృతుడు నగేష్ (ఫైల్)


మృతుడు శ్రావణ్‌కుమార్(ఫైల్)

రేణిగుంట(తిరుపతి జిల్లా): తిరుమలేశుని దర్శనానికి వెళ్తూ మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. హైదరాబాద్ మూసాపేటకు చెందిన నగేష్, అతని తోడల్లుడు లక్ష్మీనారాయణ ప్రైవేటు సంస్థ ఉద్యోగులు. నగేష్‌కు భార్య రాధిక, కుమారుడు శరత్‌కుమార్, కుమార్తె సంజన.. లక్ష్మీనారాయణకు భార్య అపర్ణ, కుమారుడు శ్రావణ్‌కుమార్, కుమార్తె స్వాతి ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మోగల్లు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబం ఉద్యోగ రీత్యా 25ఏళ్ల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. తిరుమలలో మొక్కు తీర్చుకునేందుకు వీరి రెండు కుటుంబాల సభ్యులు శనివారం రాత్రి కారులో హైదరాబాద్ నుంచి తిరుమల దర్శనానికి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున కడప-రేణిగుంట మార్గం రేణిగుంట మండలం మామండూరు వద్ద ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తుండడంతో దానిని తప్పించే క్రమంలో ముందు ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నగేష్(41), శ్రావణ్‌కుమార్(19) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు నగేష్ భార్య రాధిక, కుమార్తె సంజన తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వీరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీనారాయణ, అతని భార్య అపర్ణ, కుమార్తె స్వాతి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

శోకసంద్రమైన రెండు కుటుంబాలు

ప్రమాదంలో ఓ కుటుంబంలో కుటుంబ పెద్ద దిక్కు మృత్యు ఒడికి చేరగా, మరో కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు మరలిరాని లోకాలకు చేరడంతో రెండు కుటుంబాల్లో శోక సంద్రంలో మునిగిపోయాయి. నగేష్ మృతి చెందగా, అతని భార్య రాధిక, కుమార్తె సంజన పరిస్థితి కూడా విషమంగా ఉంది. లక్ష్మీనారాయణ, అతని భార్య అపర్ణ, కుమార్తె స్వాతి స్వల్ప గాయాలతో బయటపడగా, కుమారుడు శ్రావణ్‌కుమార్ మృతి చెందడంతో వీరి కుటుంబం దుఃఖ సాగరంలో మునిగింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాయిఖేదాలోని జీఎచ్ రాయ్‌సోని యూనివర్సిటీలో శ్రవణ్‌కుమార్ అగ్రికల్చరల్ బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చి తిరుమల దర్శనానికి వెళుతూ జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు.

క్లుప్తంగా

సందడిగా సంక్రాంతి



మహిళలకు బ్యాగులు పంపిణీ చేస్తున్న భాస్కరరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి సంబరాలు సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఆంధ్రప్రభకాలనీ, నందమూరినగర్, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో సందడిగా జరిగాయి. పలు పార్టీలు, కాలనీల ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 57, 58, 59, 60 డివిజన్లలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందిగా జరిగాయి. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు సీపీఐ నాయకులు కేవీ భాస్కరరావు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా గోదాదేవి-రంగనాథ స్వామి కల్యాణం



గోదాదేవి రంగనాథస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చక స్వాములు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి-గోదాదేవి సమేత గరుడాచల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 27 మంది ఉభయదాతలతో నిర్వహించిన గోదాదేవి-రంగనాథ స్వామి ల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు రత్నమాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగపిల్లి అప్పారావు, సెక్రటరీ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాస్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు రత్నమాచార్యులు మాట్లాడుతూ గోదాదేవి రంగనాథ స్వామిలో ఐక్యమైన రోజున వారి కల్యాణాన్ని నిర్వహించామని తెలిపారు.

అరిసెల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని జయహోవా కర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుడమేరు వంతెన సెంటర్‌లో పులిహోర, అరిసెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకగా పండగలను ఘనంగా జరుపుకోవాలన్నారు. పండగ పూట ప్రతిఒక్కరూ పిండివంటలు చేసుకోలేరని కావున తాము సామాజిక బాధ్యతగా పులిహోర, అరిసెలను పంణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు బీ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2099 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రఫీవుల్లా, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవం



అంకమ్మతల్లి పల్లకీ సేవలో భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జ్యోతులతో పల్లకీ సేవ, తెప్పోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మధురానగర్ పురవీధులలో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. దారి పొడవునా మహిళలు హారతులు ఇస్తూ, పసుపునీళ్లుపోసి స్వాగతం పలికారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

ప్రజలు అసహ్యించుకునేలా టీడీపీ నాయకుల తీరు





కృష్ణలంకలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మకర సంక్రాంతి పండగను కూడా టీడీపీ నాయకులు వారి రాజకీయాలకు వాడుకుంటూ ప్రజలు అసహ్యించుకునేలా ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విమర్శించారు. కృష్ణలంక. 22వ డివిజన్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోరివి చైతన్య ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజకంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం చాటుకుంటూ స్థానిక మహిళలు నవరత్నాల ముగ్గులు, జగనన్న పాలన మా అదృష్టం అంటూ ముగ్గులు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. తెలుగు ప్రజలు, రైతులు ఎంతో సంతోషంగా జరుపుకునే పండగను టీడీపీ నాయకులు వారి రాజకీయాలకు వాడుకుంటూ దున్నపోతు మీద వర్షంపడ్డ చందంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు చీదరించుకుంటున్నారని విమర్శించారు. రోజురోజుకు ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక శనివారం భోగి మంటల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను, ప్రభుత్వ జీఓ ప్రతులను తగులబెట్టడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబునాయుడు యావంతా ముఖ్యమంత్రి సీటు మీదే ఉందన్నారు. కానీ అది నేరవేరని కల అని ఎద్దేవా చేశారు. రాబోయే ముప్పయేళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు వేసిన ముగ్గులను, క్రీడలను వీక్షించారు. అనంతరం ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు.

సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ పుష్ప

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని దర్శిపేటలో మకర సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం దర్శిపేటలోని రాజరాజేశ్వరి శ్రీ లాలితపరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు లెమన్-స్పూన్, ముగ్గుల పోటీలు, పిల్లలకు పరుగు పందేల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కిసాన్‌సంఘ్ నాయకులు కుమారస్వామి, డాక్టర్ పుష్ప, దొడ్డపనేని కిషోర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మేకల నాగేశ్వరరావు, ఆలయ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, కోశాధికారి యామా శివన్నారాయణ, ఆలయ ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, తాండవ రంగలక్ష్మి, కొఠారి భాస్కర్, జగన్, శేషం నరసింహులు, అద్దంకి ఆదినారాయణ, మండలనేని శ్రీను, శ్రీ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేముల భాను ప్రకాష్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత డాక్టర్ ఎం.గురుమూర్తి, డాక్టర్ ఎంవీఎం లక్ష్మి సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 187 నెలలుగా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ సావనీర్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీఎస్ సూర్యకుమార్ పమ్మి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడిపూడి చినరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీ రత్న ప్రియదర్శిని, మాట్లాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో వృద్ధులకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు, నాయకులు ఎస్.భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫొటోలతో నూతన సంవత్సర క్యాలెండర్లు



ఫొటోలతో క్యాలెండర్లు అందజేస్తున్న సర్వీస్ స్టేషన్ మేనేజర్ వెంకటప్పయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధీకృత సంస్థ పైలట్ సర్వీస్ స్టేషన్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. వినియోగదారుల కుటుంబ సభ్యుల ఫొటోలతో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించింది. ఫొటో దిగిన వెంటనే వినియోగదారులకు క్యాలెండర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సంక్రాంతికి సుమారు 600 మంది వినియోగదారులకు తమ కుటుంబ సభ్యుల ఫొటోలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేసినట్లు మేనేజర్ వెంకటప్పయ్య తెలిపారు. ఏడాది పొడవునా పలు శుభ సందర్భాలను పురస్కరించుకుని వినియోగదారులకు విశేష సేవలు అందిస్తోన్నట్లు ఆయన తెలిపారు. బందరు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ సర్వీస్ స్టేషన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు పాల్గొని ఎంతో ఉత్సహంగా ఫొటోలు దిగారు. తమ కుటుంబ సభ్యులతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్లను చూసుకుని మురిసిపోయారు. పండగ సందర్భంగా పిల్లలకు స్వీట్స్, గాలిపటాలను యాజమాన్యం అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధిపతి ఎంవీవీ సత్యనారాయణ, ఐ.ఓ.సి.ఎల్. చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ నరేంద్రమౌర్య, అనిల్, ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, నందకిషోర్ పాల్గొన్నారు.

'వందేభారత్'కు నేతల స్వాగతం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండపల్లి రైల్వే స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు, నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. కౌన్సిలర్‌లు గుంజా శ్రీనివాస్, బాడిశ నాగరాజకుమారి, మొగిలి దయాసాగర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, మామిళ్లపల్లి ఆనంద్, కిరణ్‌కుమార్ తదితరులు జెండా ఊపి స్వాగతం పలికారు.

• నిర్మానుష్యం



సంక్రాంతి పండగ సెలవులు కావడంతో నిత్యం రద్దీగా ఉండే కాళేశ్వరరావు మార్కెట్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది



నిర్మానుష్యంగా ఉన్న కంట్రోల్ రూమ్ ఫ్లై ఓవర్

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటో ఢీకొనడంతో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికుడు సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గిరిపురానికి చెందిన బంగారు గణేష(43) అనే పారిశుద్ధ్య కార్మికుడు ఈ నెల 11వ తేదీన ఉదయం పశువుల ఆస్పత్రి సమీపంలో నేతాజీ వంతెనపై విధి నిర్వహణలో ఉన్నాడు. ఆ సమయంలో బందరురోడ్డు నుంచి జాతీయ రహదారి వైపు వెళ్తున్న ఒక ఆటో ఆ కార్మికుడిని ఢీకొట్టింది. గాయాలపాలైన అతడ్ని సమీపంలోని వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య నీలిమ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హోటల్ నిర్వాహకుడు అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హోటల్ నిర్వాహకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు భవానీపురం ఔట్ ఏజెన్సీకి చెందిన నిడమానూరి శ్రీనివాస్ కుమ్మరిపాలెం సెంటర్‌లో భోజన హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో హోటల్ నుంచి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఆ తర్వాత అతను ఇంటికి తిరిగి రాలేదు. శ్రీనివాస్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య దుర్గ చుట్టుపక్కల వారిని, బంధువులు, స్నేహితులను ఆరా తీసినప్పటికీ జాడ తెలియలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 11వ తేదీ భోజనం ఆర్డర్ విషయంలో హోటల్ వద్ద కొందరు వ్యక్తులు తన భర్తతో గొడవ పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో ఆటల పోటీలు నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఎస్.సుబ్బారెడ్డి భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు లెమన్ అండ్ స్పూన్, సైకిల్, రన్నింగ్ వంటి వివిధ పోటీలు జరిగాయి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోకూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో సీఐటియూ డివిజన్ నాయకులు బీఏ రావు, ఎం.మురళి, అచ్చేశ్వరరావు, ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషమణి, విక్రం లక్ష్మి, పీఎస్ఎం నాయకులు పీ అప్పన్న, కె రమణమ్మ పాల్గొన్నారు.

ద్వీపంలో వినోదం.. విజ్ఞానం



విద్యార్థులతో ఏపీటీఏ డిప్యూటీ సీఈఓ రాముడు, బీఐటీసీ ఈడీ బలరామిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక భవానీ ద్వీపంలో పర్యాటకులకు వినోదంతో పాటు సైన్స్ ఎక్స్‌పోనుకూడా ఏర్పాటు చేసి విజ్ఞానాన్ని అందిస్తున్నారు. ఇందులో విజయవాడ రూరల్ అంపాపురంలోని ఫ్రాంక్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు గ్లోబల్ వార్మింగ్ - వాతావరణ మార్పులు, రివల్యూషన్ ఆఫ్ ఎర్త్ బెనిఫిట్స్ ఆఫ్ విటమిన్ డీ తదితర అంశాలపై సైన్స్ ప్రాజక్టులను ప్రదర్శించారు. అలాగే సోలార్ సిస్టమ్ పోర్ట్‌ఫోలియో, వలస పక్షులకు సంబంధించిన ప్రాజక్టులను ధర్మిన్, రిషిత, దేవి, తేజస్వి, ప్రశాంతి, కార్తికేయ, పవన్‌సంజన, సురేఖ, యేసుబాబు, వినయ్‌తేజ ప్రదర్శించారు. ఈ విజ్ఞాన ప్రదర్శనను ఏపీటీఏ డిప్యూటీ సీఈఓ వీ రాముడు, బీఐటీసీ ఈడీ బలరామిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ లజ్వంతి నాయుడు తిలకించి, విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.



• పండగ కళ

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో నగరంలోని రాజీవ్‌గాంధీ పార్క్ చిన్నారులతో పాటు వారి కుటుంబ సభ్యులతో కళకళలాడింది. ఆది, సోమవారాల్లో నగరవాసులు అధిక సంఖ్యలో పార్క్‌కు తరలివచ్చారు. చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అందరూ ఆటలు ఆడుతూ సంతోషంగా గడిపారు. పండగ సందడి అంతా పార్క్‌లోనే కనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె సోమవారం డివిజన్‌లోని సీతారామపురం, గిరిపురం పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పండగ వేళ పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని శానిటరీ సిబ్బందిని కోరారు. ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో రూ. 5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఎప్పటి నుంచో అస్తవ్యస్తంగా ఉన్న యూజీడీకి కొత్త పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్లు నిర్మాణపనులు చేపట్టినట్లు తెలిపారు. తన పరిధిలో లేని సమస్యలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

హేతువాద సాహిత్యం విస్తృతం కావాలి



సుబ్బరాజు సంకలనపరచిన మానవవాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: హేతువాద సాహిత్యం విస్తృతంకావాలని ప్రజా సాహితి సంస్థ అధ్యక్షుడు దివికుమార్ అన్నారు. త్రిపురనేని స్మారక సంస్థ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవి, పరిశోధకుడు బహుభాషా వేత్త త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దివికుమార్ మాట్లాడుతూ మహిళలోని ఎదుగుదలను స్వాగతించాల్సిన అవసముందన్నారు. సమాజంలోని మూఢాచారాలను ఖండించాలని సూచించారు. శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ కవిగా ఆయన సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చేశారన్నారు. తెనాలి మున్సిపల్ చైర్మన్‌గా, న్యాయవాదిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. హేతువాది పెన్మెత్స సుబ్బరాజు సంకలన పరచిన వ్యాస సంపుటి మానవ వాద మార్గం గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎం.అరుణ్ కుమార్, గోళ్ల నారాయణరావు, జంపాల కృష్ణ కిషోర్, పూర్ణెందు చంద్రమౌళి, మందగళ్ల సాయికుమార్, కోడాలి రవిబాబు, అరుణాచలం పాల్గొన్నారు.

మహిళా సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి కోటేశ్వరరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి వైవీ కోటేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఉత్తర్వులు మేరకు సోమవారం సత్యనారాయణపురంలోని ప్రశాంతి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కుసుమ లావణ్య, వైస్ చైర్మన్‌గా అమూల్య కల్పన, డైరెక్టర్లుగా అపర్ణ, వి.నాగమణి, కె.లక్ష్మీకుమారి, ఎం.జ్ఞానాంబ, పి.రాధికను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నిక అయిన సభ్యులు నేటి నుంచి ఐదు సంవత్సరాల పాటు తమ సేవలను కొనసాగించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి కోటేశ్వరరావు, బ్యాంకు సీఈఓ పి.ప్రభాకర్ ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నూతక కార్యవర్గ సభ్యులను సత్కరించి శుభాకాక్షంలు తెలియజేశారు.

శాస్త్రోక్తంగా ఆళ్వార్ మర్యాదోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా, శ్రీరామనగరేశ్వరస్వామి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం ఆళ్వార్ మర్యాదోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం వైష్ణవ సంప్రదాయాన్ని ఆచరించి భక్తులను ప్రభావితం చేసిన ప్రముఖులైన పన్నెండు మంది ఆళ్వార్లను విశేషంగా అలంకరించి వారికి ప్రత్యేక అర్చన తదితర కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవచార్యులు నిర్వహించారు.

పాఠం నేర్చుకున్నాను

- క్రిటిక్స్ అవార్డ్స్‌లో కీరవాణి

''నా జీవితంలో ఉన్న మహిళలందరికీ ధన్యవాదాలు. స్కూల్ ఎడ్యుకేషన్ కంటే కూడా కామిక్ బుక్స్, కథల పుస్తకాలను చదివించి నా క్రియేటివిటీని పెంచిన మా అమ్మ రాజనందినికి, నన్ను బెస్ట్ వెర్షన్‌గా మార్చుకోవడంలో ప్రోత్సహించిన తల్లి లాంటి మా వదిన శ్రీవల్లికి, నా సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడంతో పాటు నా లైఫ్‌ని డిజైన్ చేసిన నా భార్య రమకు (తను లేకపోతే నేనిక్కడ లేను), చిరునవ్వుతో నా జీవితం ముందుకెళ్లేలా తోడ్పడే నా కూతుళ్లకు ధన్యవాదాలు. ఫైనల్‌గా నా దేశం ఇండియా.. మేరా భారత్ మహాన్.., జైహింద్'' అంటూ సలాం చేశారు దర్శకుడు రాజమౌళి. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం రెండు (బెస్ట్ ఫారిన్ ఫిల్మ్, బెస్ట్ సాంగ్) విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఈ అవార్డు అందుకున్న అనంతరం రాజమౌళి పై విధంగా ప్రసంగించారు. ఇక ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు అవార్డు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లోనూ ఈ పాటకు అవార్డు సొంతం చేసుకున్నారు చిత్ర సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి. ఈ సందర్భంగా మాట్లాడుతూ– ''జాస్' సినిమా చూసినప్పుడు నేనో పాఠం నేర్చుకున్నాను. షార్క్ దగ్గరికి వచ్చినప్పుడల్లా ప్రమాదం సూచించే విధంగా ఓ సంకేతం ఉంటుంది. అక్కడ రిచ్ ఆర్కెస్ట్రేషన్‌తో మెలోడీ మ్యూజిక్‌ని ఆశించాను, కానీ నిరాడంబరంగా, స్మూత్ మ్యూజిక్‌ని ఇచ్చారు జాన్ విలియమ్స్. నాకు నిరాడంబరత, వినయం తాలూకు పాఠం నేర్పి, ఇన్నేళ్లుగా నాకు స్ఫూర్తిగా నిలిచినందుకు థ్యాంక్స్ జాన్ విలియమ్స్ సార్'' అన్నారు కీరవాణి. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించిన విషయం తెలిసిందే.



నమ్మలేకపోతున్నాను

- రాజమౌళి



● జేమ్స్ కామెరూన్, రాజమౌళి



● రాజమౌళి

అవార్డు వేడుకలో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ పాల్గొన్నారు. ఈ వేడుక ప్రాంగణంలో కామెరూన్‌ని కలిశారు రాజమౌళి. ''గొప్ప దర్శకులు జేమ్స్ కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. ఆయనకు ఈ సినిమా ఎంతో నచ్చడంతో, తన భార్య సుజీని చూడమని సిఫార్సు చేసి, ఆమెతో కలిసి రెండోసారి 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. మా సినిమా (ఆర్ఆర్ఆర్)ను విశ్లేషిస్తూ మీరు (జేమ్స్ కామెరూన్) మాతో పది నిమిషాలు మాట్లాడదాన్ని నేను నమ్మలేకపోతున్నాను. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి దర్శకుల్లో నేనూ ఉన్నాననన్నట్లుగా మీరు (కామెరూన్) చెప్పారు. మాతో పది నిమిషాల సమయాన్ని గడిపినందుకు, నన్ను ప్రశంసించినందుకు ధన్యవాదాలు'' అని సోమవారం ట్వీట్ చేశారు రాజమౌళి. ఇక ఈ సంగతి ఇలా ఉంచితే... లాస్ ఏంజెల్స్ వేదికగా ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో హాలీవుడ్‌కు చెందిన మరో ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను రాజమౌళి, కీరవాణి కలిసి కాసేపు ముచ్చటించిన సంగతి తెలిసిందే.

షూటింగ్‌లో ప్రమాదం

సోమవారం రెండు షూటింగ్ లొకేషన్స్‌లో రెండు ప్రమాదాలు జరిగాయి. ఒకటి హైదరాబాద్‌లో జరుగుతున్న 'ది వాక్సిన్ వార్' షూటింగ్ సెట్. ఈ షూటింగ్‌లో నటి, నిర్మాతల్లో ఒకరైన పల్లవీ జోషి గాయపడ్డారు. రెండోది మలేసియా. ఈ షూటింగ్‌లో హీరో విజయ్ ఆంటోని గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే...

కారు ఢీకొట్టడంతో పల్లవీకి గాయాలు

దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది వాక్సిన్ వార్'. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో జరుగుతోంది. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో పల్లవీ జోషికి గాయాలు కావడంతో సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. అయితే చేస్తున్న సన్నివేశం పూర్తి చేశాకే పల్లవి ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్రబృందం తెలిపింది. ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్ పతాకం పై పల్లవీ జోషి 'ది వాక్సిన్ వార్' చిత్రాన్ని నిర్మించడంతో పాటు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ది కాశ్మీరీ' ఫైల్స్ కోసం వివేక్ అగ్నిహోత్రితో కలిసి పని చేసిన అభిషేక్ అగర్వాల్ తన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



● పల్లవీ జోషి, విజయ్ ఆంటోని

బోట్ ప్రమాదంలో గాయపడిన విజయ్ ఆంటోని: 'బిచ్చగాడు' సినిమాతో పాపులర్ అయిన హీరో విజయ్ ఆంటోని తీవ్రంగా గాయపడ్డారు. 'బిచ్చగాడు'కి సీక్వెల్‌గా ఆయన హీరోగా నటిస్తున్న 'బిచ్చగాడు 2' షూటింగ్ మలేసియాలో జరుగుతోంది. ఈ చిత్రానికి విజయ్ ఆంటోనియే దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్‌లో భాగంగా వాటర్ బోట్‌లో ప్రయాణిస్తుండగా ఆ బోట్ హఠాత్తుగా కెమెరా ఉన్న మరో పడవలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ ఆంటోనీని వెంటనే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

ప్రముఖ రచయిత బాలమురుగన్ కన్నుమూత



సీనియర్ కథా రచయిత బాలమురుగన్ (86) ఆదివారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ తదితర భాషా చిత్రాలకు కథ, మాటలను అందించారాయన. తమిళనాడులోని ఆండిపట్టికి చెందిన బాలమురుగన్ అసలు పేరు సుందర పాండియన్. నటనపై ఆసక్తితో చిన్న వయసులోనే శక్తి నాటక సభ బృందంలో చేరి నాటకాల్లో నటించడం ప్రారంభించారు. 'కుమర గురు' అనే నాటకంలో బాల మురుగన్‌గా నటించి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి ఆయన పేరు బాలమురుగన్‌గా స్థిరపడిపోయింది. 13 ఏళ్ల వయసులోనే 'కల్ శిలై' అనే నాటకాన్ని రాసి. తానే నటుడుగా రంగ ప్రవేశం చేశారు. ఆయన నటించిన టిప్పు సుల్తాన్, మరుదు పాండియర్ నాటకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. 'టిప్పు సుల్తాన్' నాటకాన్ని తిలకించి, బాలమురుగన్ నటనను అప్పటి ప్రముఖ నటుడు ఎంజీఆర్ ఎంతగానో కొనియాడారు. శివాజీ గణేషన్ చిత్రాలకు బాలమురుగన్ ఎక్కువగా కథ, మాటలు అందించారు. అదే విధంగా తెలుగులో ఎన్.టి. రామారావు, కృష్ణ, శోభన్‌బాబు వంటి ప్రముఖ కథానాయకులకు, హిందీలో రాజేష్ ఖన్నా, ధర్మేంద్ర వంటి స్టార్స్ చిత్రాలకు కథలు అందించారు. బాలమురుగన్ కథ అందించిన తెలుగు చిత్రాల్లో 'ధర్మ దాత, అదృష్ట జాతకుడు, కోడలు పిల్ల, బంట్రోతు భార్య, సోగ్గాడు, ఆలుమగలు, జీవన తీరాలు, పుణ్యం కొద్దీ పురుషుడు, భార్యాభర్తలు వంటివి ఉన్నాయి. 1969లో ఆయన మాటలు అందించిన 'దేవరిన్ తునైవన్' చిత్రానికిగానూ తమిళ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మాటల రచయిత అవార్డుతో సత్కరించింది. తమిళంలో 'రామన్ ఎత్తనై రామనడి', 'పట్టికాడా పట్టణమా' చిత్రాలకుగాను జాతీయ అవార్డును అందుకున్నారు. బాలమురుగన్ భార్య పదేళ్ల క్రితం కన్నుమూశారు. ఈ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు భూపతి రాజా సినిమా పరిశ్రమలో రచయితగా కొనసాగుతున్నారు. బాలమురుగన్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సస్పెన్స్ లవ్‌స్టోరీ



● తలసాని, ఆకుల అఖిల్

ఆకుల అఖిల్, దర్శక మీనన్, 'చిత్రం' శ్రీను, 'జబర్దస్త్' గడ్డం నవీన్, 'జబర్దస్త్' చిట్టిబాబు, రేవతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బాలుగాడి లవ్ స్టోరీ'. యల్. శ్రీనివాస్ తేజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఆకుల మంజుల నిర్మిస్తున్న చిత్రం ఇది. ఒక పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం టీజర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ రిలీజ్ చేసి, చిత్రం యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు సముద్ర మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. మంచి కాన్సెప్ట్, కథ ఉన్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''మంచి కథతో వస్తున్నాం. ఈ సినిమా హిట్‌ని మా తల్లిదండ్రులకు గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు ఆకుల అఖిల్. ''లవ్, సస్పెన్స్ అంశాలతో కూడిన చిత్రం ఇది. బ్యాలెన్స్ ఉన్న స్పెషల్ సాంగ్‌ను త్వరలోనే పూర్తి చేసి, మార్చిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

థ్రిల్లింగ్ అథర్వ



● కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. నేడు కార్తీక్ రాజు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ''క్రైమ్, థ్రిల్లింగ్, ఎమోషన్స్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మేకల క్షేత్రమే శిక్షణా కేంద్రం

● మేకల పెంపకంలో మార్గదర్శకుడు మూల మహేందర్‌రెడ్డి ● మేకలు, నాటు కోళ్ల పెంపకంలో ఏడాదికి రూ. 8-9 లక్షల నికరాదాయం
● ప్రతి శనివారం ఫామ్ దగ్గరే రైతులకు ఉచిత శిక్షణ ● రైతులు, అధికారుల క్షేత్ర పర్యటనలకు వేదికగా మారిన మహేందర్‌రెడ్డి ఫామ్



● మహేందర్ రెడ్డి

మేకల పెంపకంలో పదేళ్ల అనుభవంతో స్థిరమైన నికరాదాయం పొందుతూ.. జీవాల పెంపకంపై ఆసక్తి చూపే రైతులకు మార్గదర్శిగా నిలిచారు మూల మహేందర్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం సింగప్పగూడ గ్రామంలో పాక్షిక సాంద్ర పద్ధతిలో ఆయన మేకలతో పాటు నాటు కోళ్లను పెంచుతూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. అంతేకాదు ఉచితంగా శిక్షణ ఇస్తూ వందలాది మంది రైతులకు తోడ్పాటునందిస్తున్నారు. జీవాల పెంపకంపై పూర్తి అవగాహన కలిగించుకొని, మక్కువతో పెంపకం చేపడితే వంద శాతం లాభాలు పొందుతారని నిక్కచ్చిగా చెబుతున్నారాయన.

రైతు కుటుంబంలో పుట్టిన మహేందర్‌రెడ్డి బీఎస్సీ చదివి, కొంతకాలం బోర్‌వెల్ రంగంలో పనిచేశారు. 2005లో 14 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం ప్రారంభించారు. తదనంతర కాలంలో వ్యవసాయంతోపాటు జీవాల పెంపకం కూడా తోడైతేనే నిరంతరం రైతుకు ఆదాయం వస్తుందని గ్రహించిన ఆయన మేకల పెంపకం వైపు దృష్టి సారించారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి శిక్షణ, ప్రోత్సహకాలు లేకపోవటంతో సొంతంగానే అనేక రాష్ట్రాల్లో తిరిగి పరిశోధన చేశారు.

గోట్ ఫార్మింగ్ పరిజ్ఞానం కోసం ఆయన పడిన కష్టం అంతా ఇంతా కాదు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సొంత ఖర్చులతో పర్యటించారు. స్థానిక రైతులను కలిసి వారి అనుభవాలను తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో సక్సెస్ సాధిస్తామనే ధీమా ఎవరూ కల్పించలేకపోయారు. అయినా వెనకడుగు వేయకుండా పట్టుదలతో మేకల పెంపకం చేపట్టారు.

ఎకరంలో షెడ్లు, మూడెకరాల్లో మేత...

ప్రభుత్వ సబ్సిడీ పథకాలు సైతం లేక సొంతం గానే 2013లో 65 మేకలతో పాక్షిక సాంద్ర పద్ధతిలో మహేందర్‌రెడ్డి మేకల పెంపకం ప్రారంభించారు. రూ. 13 లక్షలు ఖర్చు చేసి ఎకరం విస్తీర్ణంలో షెడ్లు నిర్మించారు. మహేందర్‌రెడ్డి మూడేళ్లు కష్టపడి మేకల సంఖ్యను 250కు పెంచారు. 1 ఎకరంలో షెడ్లు, నివాస భవనం నిర్మించారు. షెడ్డులో మేకలను నేలపైన కాకుండా.. మీటరు ఎత్తున చెక్కలతో ప్లాట్‌ఫామ్‌ను నిర్మించి, దానిపై మేకలు విశ్రమించేలా ఏర్పాటు చేశారు. పెంటికలు చెక్కల సందుల్లో నుంచి నేల మీద పడిపోతాయి. మేకలకు గాలి, వెలుతురు చక్కగా తగులుతుంది. షెడ్‌కు పక్కనే చుట్టూ ఇనుప కంచెతో దొడ్డిని ఏర్పాటు చేశారు. మేకలు అక్కడ ఆరుబయట ఎండలో తిరుగుతూ మేత మేస్తాయి. మరో మూడు ఎకరాలు మేకలకు కావాల్సిన పచ్చిగడ్డి సాగుకు ఉపయోగిస్తున్నారు. ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఖర్చులు పోను నెలకు రూ. 65–75 వేల నికరాదాయం, ఏడాదికి రూ. 8–9 లక్షల నికరాదాయం పొందుతూ మేకల పెంపకంలో పదేళ్లుగా ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రతి శనివారం ఉచిత శిక్షణ

మేకల పెంపకానికి ముందుకొచ్చే వారికి ఇప్పటికీ ప్రభుత్వపరంగా శిక్షణా కేంద్రాలు అందుబాటులో లేవు. ఈ లోటు భర్తీ చేయడానికి మహేందర్‌రెడ్డి సేవా భావంతో ముందుకొచ్చారు. సీనియర్ రైతుగా తన అనుభవాలను పంచాలనే ఆలోచనతో ప్రతి శనివారం తన ఫామ్ దగ్గరే ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పద్ధతులను 3 గంటల పాటు సవివరంగా బోధిస్తున్నారు. ఆయన పట్టుదల, నైపుణ్యం గుర్తించిన వెటర్నరీ శాఖ ఔత్సాహిక రైతులను ఆయన ఫామ్‌కు క్షేత్రపర్యటనకు తీసుకురావటం ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు, అగ్రి, ఫుడ్ బిజినెస్ విద్యార్థులు ఆయన వద్ద అనుభవపాఠాలు నేర్చుకుంటున్నారు. వెటర్నీ ఉన్నతాధికారుల నుంచి ప్రసంశలు కోకొల్లలు. వ్యవసాయ కళాశాలలో అనేక సదస్సుల్లో ఆయన సుసంపన్నమైన తన అనుభవాలను పంచుతూ ఉంటారు. 2015లో రైతునేస్తం, 2016లో సీఆర్ఐడీఏ, 2018లో ఐసీఏఆర్ ఉత్తమ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారాలు లభించాయి.

– ఎస్.రాకేశ్, సాక్షి, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా



● ఎలివేటెడ్ షెడ్‌లో విశ్రమిస్తున్న మేకలు



● ఫామ్ వద్ద ఉచితం శిక్షణ తరగతులు

మేకల రైతుల సేవలో..

నా ఫామ్‌లో 250 మేకలున్నాయి. వీటి పెంపకానికి మొత్తం 4 ఎకరాల భూమిని ఉపయోగిస్తున్నా. ముగ్గురికి ఉపాధి కల్పిస్తూ 250 మేకలను పెంచుతున్నా. మేకల పెంపకంతోపాటు నాటు కోళ్ల పెంపకం చేపట్టా. 20 కోళ్లతో ప్రారంభించా. ఇప్పుడు 100కు చేరాయి. వీటిని 500లకు పెంచేందుకు కృషి చేస్తున్నా. మేకలు, కోళ్ల పెంపకానికి మొత్తంగా ఏడాదికి ఈ సుమారు రూ. 6 లక్షల ఖర్చు అవుతుంటే దాదాపు రూ. 14–15 లక్షల ఆదాయం వస్తున్నది. ఖర్చులు పోను ఏడాదికి సుమారు రూ. 8–9 లక్షల నికరాదాయం సంపాదిస్తున్నా. నా అనుభవాలను అందరికీ అందించి సహాయ పడాలనే ఆలోచనతో ఏడేళ్లుగా ప్రతి శనివారం ఉచితంగా ఫామ్ దగ్గరే రైతులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నా. వారికి ఎప్పుడు ఏ సమాచారం కావాల్సినా ఫోన్‌లో అందిస్తూ వస్తున్నా. నాకు అవకాశం ఉన్నంత వరకు ఈ సేవ కొనసాగిస్తునే ఉంటాను. రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తా. ఏడాదిలో 365 రోజులూ మేక మాంసానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలకు ప్రతి రోజు సగటున 7–8 వేల మేకల అవసరం ఉంటుందని అంచనా. ప్రభుత్వపరంగా కూడా జీవాల పెంపకంలో శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేయాలి. మేకల పెంపకంపై అవగాహన, ఇష్టమే విజయ సోపానమవుతుంది.

- మూల మహేందర్‌రెడ్డి (8008639618),
ఆదర్శ మేకల పెంపకందారుడు,
సింగప్పగూడ, చేవెళ్ల మం., రంగారెడ్డి జిల్లా

మేకల పెంపకంలో మెలకువలు

కొత్తగా గోట్ ఫార్మింగ్ చేపట్టే రైతులకు మహేందర్‌రెడ్డి చెబుతున్న సూచనలు:

- ఒక మేక సగటున రెండేళ్లలో మూడు ఈతల్లో ఈతకు రెండు పిల్లల చొప్పున ఇస్తుంది. ఒక మేక పిల్ల అమ్మకానికి రావడానికి 6 నుంచి 8 నెలల సమయం పడుతుంది. చిన్న పిల్లల పోషణను అశ్రద్ధ చేయకుండా మరణాల రేటు తగ్గించాలి.
- కనీసం 25 కేజీల బరువు ఉన్న మేకలనే అమ్ముకోవాలి. మార్కెటింగ్‌లో జీవాలను ఫారంలోనే అమ్ముకోవటం లాభాదాయకంగా ఉంటుంది. నాణ్యమైన మేకల పెంపకమే నోటి ప్రచారంగా పని చేస్తుంది.
- మేకల పెంపకాన్ని యాంత్రికంగా కాకుండా మనసుపెట్టి ఇష్టంగా చేస్తేనే వంద శాతం సక్సెస్ చేకూరుతుంది.
- ముందు జాగ్రత్త చర్యలను, యాజమాన్య మెలకువలు మక్కువతో పాటిస్తే.. 90 శాతం మందులు లేకుండానే మేకల సంతతిని పెంచుకుంటూ పోవచ్చు.
- మేలు రకం మేకల ఉత్పత్తితోనే లాభాలు వస్తాయి. మేకల ఉత్పత్తిలో తల్లి, తండ్రి మేకల నాణ్యత ముఖ్యం.
- పోషక విలువలు ఉండే నాణ్యమైన మేతలను మేకలకు కడుపు నిండా అందించటంతో నాణ్యమైన మేకల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు సాధ్యం.
- సాంద్ర పద్ధతిలో మేకల పెంపకం ఎంతో మేలు. సగం ఎండు మేత, సగం పచ్చి మేతలను అందించాలి.
- ఇరుకుగా కాకుండా అవసరమైన విస్తీర్ణం మేరకు షెడ్ల నిర్మాణం, పరిశుభ్రత, చూడి మేకల, పిల్లల పోషణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలివేటెడ్ షెడ్లు నిర్మించాలి. సీజన్‌కు తగిన రీతిలో షెడ్ల నిర్వహణ ఉండాలి.
- మేకల పెంపకంలో రైతు సక్సెస్ కావాలంటే ఎట్టి పరిస్థితుల్లో యాజమాన్య లోపం రానివ్వకూడదు. జీవాలకు పోషక విలువలతో కూడిన మేతను కమం తప్పకుండా అందించాలి.

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె : జనవరి 23 వరకు
శ్రావణ కార్తె : 24 నుంచి

రోగాలకు రెడ్ సిగ్నల్!



● 'జీపీటీ 2858' పేరిట సన్నని ఎరుపు వరి వంగడానికి రూపుకల్పన
● ఐరన్, జింకు, మాంసకృత్తులు అధికం

అధిక పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించే సేంద్రియ/ప్రకృతి వ్యవసాయంలో పండించిన దేశవాళీ వరి రకాల బియ్యానికి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతుల్లోనే దేశవాళీ వంగడాల్లో పౌష్టికాంశాలతో కూడిన బీపీటీ సన్న వరి రకాల రూపకల్పనపై బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు 2012 నుంచే దృష్టి కేంద్రీకరించారు. 'బీపీటీ బ్లాక్ రైస్' వంగడాలను గత ఏడాదే అధికారికంగా విడుదల చేసి, రైతులకు విత్తనాలను విస్తారంగా అందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో 'బీపీటీ రెడ్ రైస్ 2858' వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని పంటకాలం 135 రోజులు. తుపాన్లకు పడి పోదు. దోమ, అగ్గితెగులు, ఆకు ముడత, ఆకు ఎండు తెగుళ్లను తట్టుకుంటుంది. కంకి ముద్దగా వస్తుంది. ఒక కంకిలో 500 నుంచి 600 వరకు గింజలు ఉంటాయి. బీపీటీ 5204 కన్నా సన్న రకం. బీపీటీ 2858 రెడ్ రకం వెయ్యి గింజల బరువు 12 గ్రాములు. నాణ్యతా ఎక్కువే. దేశవాళీ రెడ్ రైస్ దిగుబడి 10 బస్తాలకు మించదు. బీపీటీ రెడ్ రైస్ ఎకరాకు 30 బస్తాలకు తగ్గదని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ రకం రెడ్ రైస్ ధాన్యం పై పొట్టు మామూలుగానే ఉంటుంది. కానీ, బియ్యం నల్లగా ఉంటాయి. బియ్యం పై పొరలో 'ప్రోయాంతో సైనిడిన్' అనే పదార్థం ఉండడం వల్ల వాటికి ఎర్ర రంగు వచ్చింది. అందుకని, ముడి బియ్యాన్నే తినాలి. ఇందులో ఐరన్, జింకు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే రెండు రెట్లు అధికం. యాంటీ ఆక్సిడెంట్లు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. అధికంగా 10.5 శాతం మాంసకృత్తులు ఉన్నాయి. టోటల్ ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ సాధారణ రకాలతో పోలిస్తే రెండు రెట్లు అధికం. శరీరంలో ఉత్పత్తయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి సమతుల్యం చేసి రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తాయి. రెడ్ రైస్‌లో బీపీటీ 2858తో పాటు బీపీటీ 3143, 3182, 3140, 3111, 3507 రకాలను సైతం రూపొందిస్తుండటం విశేషం.

– బిజివేముల రమణారెడ్డి,
సాక్షి ప్రతినిధి, బాపట్ల



ఎర్ర బియ్యం ఎంతో ఆరోగ్యం

జీపీటీ 2858 రెడ్‌రైస్ విత్తన మినీకిట్లను ఈ ఏడాది జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వ్యవసాయశాఖ జేడీఏలు, డాట్ సెంటర్లలో పంపిణీ చేస్తారు. మూడు సంవత్సరాల మినీకిట్ దశను వచ్చే ఏడాది పూర్తిచేసి, ఆ తరువాత అధికారికంగా విడుదల చేస్తాం. జీపీటీ 2858 రెడ్‌రైస్ దీర్ఘకాలిక రోగాలను ఎదుర్కొనే పుష్టిని కలిగిస్తుంది. మనుషుల ఆరోగ్య రక్షణకు అత్యంత అనుకూలమైన రకం.



- బి.కృష్ణవేణి,
సీనియర్ శాస్త్రవేత్త - అధిపతి,
వ్యవసాయ పరిశోధనా కేంద్రం, బాపట్ల

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్